


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 12
సంచిక: 354

SUNDAY Special

ఆదివారం 15-3-2020




**శ్రీనివాస కల్యాణం**
సింగీతం శ్రీనివాస్ దంపతులతో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ
– ఫ్యామిలీలో

**దేశవాళీ క్రికెట్ టోర్నీలు వాయిదా**
కోవిడ్–19 వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయం
– స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



# భయం లేదు.. జాగ్రత్తలే

## మార్చి 31 వరకు అన్ని విద్యాసంస్థల బంద్: సీఎం కేసీఆర్

- మ్యారేజ్ హాల్స్ మూసివేత.. ఇప్పటికే ఖరారైన పెళ్లిళ్లకు మినహాయింపు..
- బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, వర్క్‌షాప్‌లు పెట్టొద్దు
- స్టేడియాలు, జిమ్‌లు, పబ్బులు, బార్లు, క్లబ్బులు మూసివేత
- సినిమా హాల్స్ కూడా బంద్
- అతిక్రమిస్తే కఠిన చర్యలు
- షాపులు, మాల్స్ తెరిచే ఉంటయ్
- కేబినెట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన సీఎం కేసీఆర్

**1,030** అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్‌లు..

**321** సిద్ధంగా ఉన్న ఐసీయూ యూనిట్లు..



సాక్షి, హైదరాబాద్

కరోనా వైరస్ గురించి రాష్ట్ర ప్రజలెవరూ భయపడాల్సిన పనిలేదని, రాష్ట్రంలో అసలు కరోనా లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఇద్దరు వ్యక్తులకు మాత్రమే కరోనా పాజిటివ్‌గా నమోదైందని, అందులో ఒక వ్యక్తి చికిత్స పొంది కోలుకోగా, మరో వ్యక్తి చికిత్స పొందుతున్నాడని సీఎం చెప్పారు. మరో ఇద్దరికి అనుమానం ఉన్న నేపథ్యంలో నిర్ధారణ కోసం పుణేకు పంపామని, ఆ రిపోర్టు వచ్చిన తర్వాతే వారి గురించి ఆలోచిస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం ప్రగతి భవన్‌లో మూడు గంటల పాటు నిర్వహించిన కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో కలసి సీఎం విలేకరులతో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

### ముందుజాగ్రత్తగానే చర్యలు..

'రాష్ట్రంలో ఏదో ఉత్పాతం ఏర్పడింది. పిడుగు పడింది అని ప్రజలు భయపడాల్సిన పనిలేదు. భయోత్పాతం చెంది గందరగోళానికి గురికావాల్సినవసరం లేదు. అసలు ఇది మనదేశంలో పుట్టిన వైరస్ కాదు. విదేశాల నుంచి వచ్చిన వారికి మాత్రమే వస్తోంది. విదేశాల నుంచి వచ్చిన వారిని పరీక్షించేందుకు ఎయిర్‌పోర్టులో అన్ని ఏర్పాట్లు చేశాం. కానీ ఈ వైరస్ ఒక వ్యక్తి నుంచి చాలా మందికి.. వారి నుంచి చాలా చాలా మందికి సోకుతుందనే ఆలోచనతోనే దాన్ని నియంత్రించేందుకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. అంతే తప్ప ఎవరూ భయపడొద్దు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెండు దశల కార్యాచరణ రూపొందించాం. అందులో 15 రోజుల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారం రోజుల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలున్నాయి. కేబినెట్ నిర్ణయాలను అందరూ పాటించాల్సిందే. ఎవరికీ మినహాయింపు ఉండదు. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. చట్టాలను ఎలా అమలు చేయాలో తెలుసు' అని హెచ్చరించారు.

### ఇక్కడ పుట్టింది కాదు..

'ఈ వ్యాధి చైనా నుంచి వచ్చి ఇతర దేశాల్లో పాకుతుందే తప్ప మన దేశంలో పుట్టింది కాదు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం

మిగతా 2వ పేజీలో ▶

## ఇవాంకకూ కరోనా సెగ!

**ఇంటి నుంచే ఆఫీస్ పనులు చక్కబెట్టిన ట్రంప్ కూతురు**



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకకూ కరోనా సెగ తగిలింది. ఇవాంక గత శుక్రవారం ఆస్ట్రేలియా హోం శాఖ మంత్రి పీటర్ డుటన్‌తో సమావేశమైంది. ఆ తర్వాత నిర్వహించిన పరీక్షల్లో పీటర్‌కు కరోనా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో శుక్రవారం ఇవాంక తన ఆఫీస్ పనులను ఇంటి నుంచే చక్కబెట్టుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఇంటి నుంచే పనిచేసినట్లు ఆమె వెల్లడించారు. మరోవైపు పీటర్ డుటన్ మాత్రం కొంతకాలం పాటు విడిగా (సెల్ఫ్ క్వారంటైన్)లో ఉండాలని నిర్ణయించుకున్నారు. కాగా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భార్య సోఫీ గ్రెగోరే కరోనా వైరస్ బారిన పడగా.. ట్రూడో మాత్రం ఆరోగ్యంగా ఉన్నట్లు తెలుస్తోంది.



### జాతీయ విపత్తు..

కోవిడ్‌ను భారత్ జాతీయ విపత్తుగా ప్రకటించింది. వ్యాధి కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు పేర్కొంది.

### మోదీ ట్వీట్...

కోవిడ్ లక్షణాలు ఉన్నవారు అటాచ్డ్ బాత్రూమ్ ఉండే, గాలి, వెలుతురు బాగా వచ్చే గదిలో ఉండాలి. ఎక్కువ మంది అదే గదిలో ఉండాల్సి వస్తే 3 అడుగుల కంటే ఎక్కువ దూరంలో ఉండాలి. వీలైనంత వరకు వృద్ధులు, గర్భిణులు, పిల్లలకు దూరంగా ఉండండి.

### అమెరికాలో ఎమర్జెన్సీ..

వైరస్ విస్తృతి నేపథ్యంలో అమెరికాలో అధ్యక్షుడు ట్రంప్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. జాతీయ ఎమర్జెన్సీని ప్రకటించిన నేపథ్యంలో వ్యాధి నియంత్రణకు సుమారు 3.6 లక్షల కోట్ల రూపాయలు అందుబాటులోకి రానున్నాయి.

### 'పద్మ' వాయిదా...

మార్చి 26, ఏప్రిల్ 3వ తేదీల్లో ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో జరగాల్సిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలను కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రం వాయిదా వేసింది.

### చిన్నారులు సేఫ్..

కోవిడ్‌తో చిన్నారుల ఆరోగ్యం అంతగా ప్రభావితం కాదని శాస్త్రవేత్తలు కొద్దిరోజులుగా గుర్తిస్తున్నారు. తాజా పరిశోధనలోనూ కరోనా బాధితుల్లో చిన్నారుల సంఖ్య అత్యల్పమనీ, వైరస్ సోకినప్పటికీ దాని తీవ్రత వారిపై అంతగా లేదన్నది స్పష్టమైంది.

- పూర్తి వివరాలు 10లో

## ఎండలతో కరోనా తగ్గుముఖం!

- నియంత్రణ చర్యలు ఉపయోగపడతాయి
- ఏప్రిల్ చివరి వారానికి కేసులు తగ్గే అవకాశం
- సీనియర్ శాస్త్రవేత్తల వెల్లడి

2 లో















epaper.sakshi.com





## ప్రాణాలకు ముప్పు తక్కువే...

**నిన్నటి గురించి ఆలోచన వద్దు**
**రేపటి గురించి ఆందోళన వద్దు**
**ఈరోజే మనకి ముఖ్యం**
**అప్పుడే బతికే ధైర్యం వస్తుంది. కరోనా రక్కసిని పారద్రోలే శక్తి వస్తుంది. కరోనా అంటే పక్కన బాంబు పడ్డట్టు భయపడనక్కర్లేదు. దగ్గు, జలుబు రాగానే వామ్మో ఏం సోకిందోనని బెంబేలెత్తిపోనక్కర్లేదు. కోవిడ్-19 వ్యాధి శరవేగంగా విస్తరిస్తోంది కానీ అదే స్థాయిలో ప్రాణాలైతే తీయడం లేదు. అందుకే ఆ వ్యాధి నుంచి బయటపడిన వారు భయం లేదురా సోదరా అని భరోసా ఇస్తున్నారు. ఎవరి ఆరోగ్యం మీద వారికి శ్రద్ధ ఉంటే పాములాంటి కరోనా కూడా పడగ దించి వెళ్లిపోతుంది. కొన్ని మొండి వ్యాధులకు చికిత్స ఉండదు. నివారణే మార్గం. అందుకే అతిగా అనిపించినా మరిన్ని జాగ్రత్తలు పాటిద్దాం. కరోనాని జయిద్దాం. కరోనా బాధితుల అనుభవాలు, ఈ వ్యాధి చుట్టూ ఉన్న వాస్తవాలే ఇవాళ్టి సండే స్పెషల్**

## అరవై ఏళ్ల టీనేజర్...



జపాన్ డైమండ్ ప్రిన్సెస్ క్రూయిజ్ షిప్‌లో ప్రయాణించిన ఓ దంపతుల వింత గాథ ఇది. ఆ నౌకలో ప్రయాణికులకి సోకిన కరోనా వైరస్ అందరినీ ఎంత ఆందోళనకు గురిచేసిందో తెలిసిందే కదా. అమెరికాలో కాలిఫోర్నియా లోకల్ స్టేషన్ యజమాని అయిన కార్ల్ గూడ్‌మ్యాన్ తన భార్య జెరి సెరాట్టి పుట్టినరోజు కానుకగా డైమండ్ ప్రిన్సెస్ నౌకలో ఆగ్నేయాసియా చుట్టి రావాలని టిక్కెట్లు బుక్ చేశారు. ఆయన వయసు అరవైకి పై మాటే. జనవరి నెలాఖరున ఆ నౌకలో బయల్దేరిన వాళ్లు కొద్ది రోజులు ప్రయాణం చేశారో లేదో కరోనా మహమ్మారి పడగ విప్పిందని తెలిసింది. ఆ నౌకని జపాన్ రేవుకి తీసుకువచ్చి వదిలేశారు. రెండువారాలు అంతా ఆ నౌకలోనే ఉన్నారు. వారిద్దరికీ ఆ నౌకలో బాల్కనీ ఉన్న గది వచ్చింది. ఆ అనుభవాలు సోషల్ మీడియాలో షేర్ చేశాడు గూడ్‌మ్యాన్. ''ఒక్కొక్కరికి కరోనా వైరస్ సోకుతూ ఉంటే వారిని చికిత్సా కేంద్రాలకు తరలిస్తున్నారు. మేమిద్దరమే మా గదిలో ఉన్నాం. రోజుకి మూడుసార్లు మాత్రమే బయటకు రానిచ్చేవారు. సముద్రం ఒడ్డున బాగా ఎంజాయ్ చేశాం. కానీ ఏదో మూల భయం ఉండనే ఉన్నాయి. అయినా సరే ఆ నిర్బంధంలో కూడా స్వేచ్ఛగా పక్షి పిల్లల్లా ఎగిరాం. చివరికి ఆ నౌకలో వాలెంటైన్స్ డే కూడా జరుపుకోవడం అందమైన అనుభూతి''అని పోస్టు చేశారు. అయితే అమెరికా విమానం వచ్చి వారిని తీసుకువెళుతున్న సమయంలో గూడ్‌మ్యాన్ అస్వస్థతకి లోనయ్యారు. జ్వరం, దగ్గు మొదలైంది. అమెరికాలో ఒమాహా చేరాక వైద్య పరీక్షల్లో ఆయనకి కరోనా వైరస్ సోకిందని తేలింది. ఆయన భార్య జెరి మాత్రం బాగానే ఉన్నారు. అందుకే ఇద్దరినీ వేర్వేరు చోట ఉంచారు. 14 రోజుల తర్వాత జెరినీ ఇంటికి పంపించారు. గూడ్‌మ్యాన్ ఇంకా చికిత్సలోనే ఉన్నారు. వైరస్ అదుపులోనికి రాకపోవడంతో ఆయన ఇంకా వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. నెలరోజులుపైనే అయింది ఆయన బయట ప్రపంచం చూసి. అయితేనేం భార్యతో కలిసి ఆ నౌకలో గడిపిన మధురానుభూతుల్ని నెమరువేసుకుంటూ కాలం గడిపేస్తున్నానని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

## గాంధీలో 150 పడకలతో ఐసోలేషన్ వార్డుల ప్రధాన భవనం

- గాంధీలో 150 పడకలతో ఐసోలేషన్ వార్డులు
- ప్రధాన భవనంలోని ఏడు, ఎనిమిది అంతస్తుల్లో ఏర్పాటు
- నర్సింగ్ స్కూలు బోయిగూడ కాలేజీ ప్రాంగణానికి తరలింపు



**హైదరాబాద్:** ప్రపంచ దేశాలతోపాటు తెలంగాణను వణికిస్తున్న కోవిడ్ వైరస్‌ను కట్టడి చేసేందుకు గాంధీ ఆస్పత్రిలో 150 పడకలతో ఐసోలేషన్‌వార్డులు, ఎక్యూట్ ఐసీయూలను ఏర్పాటు చేసేందుకు వైద్య ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రి ప్రధాన భవనంలోని ఏడు, ఎనిమిది అంతస్తుల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయాలని భావించిన అధికారుల సూచన మేరకు ఆస్పత్రి పాలనయంత్రాంగం శనివారం ఆయా అంతస్తులతోపాటు బోయిగూడలోని నర్సింగ్ కాలేజీని సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. ఎనిమిదవ అంతస్థు లో ఉన్న గాంధీ నర్సింగ్ స్కూలును బోయిగూడలోని గాంధీ నర్సింగ్ కళాశాల ప్రాంగణానికి తరలించాలని నిర్ణయించారు. నర్సింగ్ స్కూలు లో చదువుతున్న కొంతమంది మేల్ నర్సింగ్ విద్యార్థులను సమీపంలోని ప్రైవేటు భవనంలో ఉంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఏడు, ఎని మిది అంతస్తులను పూర్తిగా వినియోగించుకుని ఆక్సిజన్ పైప్‌లైన్, వెంటి లేటర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు కల్పించి వంద పడకలతో ఐసో లేషన్‌వార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అత్యవసర విభాగంలో మరో 50 పడకలతో ఐసోలేషన్, కోవిడ్ ఐసీయూలను ఏర్పాటు చేయాలని భావించారు. అయితే అత్యవసర విభాగంలో కోవిడ్ ఐసీయూ ఏర్పాటుపై తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. కోవిడ్ అనుమానితులను ఐసోలేషన్ వార్డులో ఉంచి కోవిడ్ పాజిటివ్ వచ్చిన బాధితులకు ఐసీయూలో వైద్య సేవలు అందించాలని, అందుకు ఐసీయూలో ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రెండ్రోజుల్లో నర్సింగ్ స్కూలును తరలించి ప్రత్యేక ఐసోలేషన్‌వార్డు డిజైన్ చేసేందుకు వైద్య ఉన్నతాధికారులు, టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు మరోమారు పరిశీలించి తుదినిర్ణయం తీసుకుంటారని తెలిసింది. వైద్య ఉన్నతాధికారుల సూచన మేరకు గాంధీ నర్సింగ్ స్కూలును బోయిగూడలోని నర్సింగ్ కాలేజీ ప్రాంగణానికి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆస్పత్రి పాలనాయంత్రాంగం తెలిపింది. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్, ఆర్ఎంఓలు జయకృష్ణ, ప్రభుకిరణ్, గాంధీ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రాధారుక్మిణి, స్కూలు ప్రిన్సిపాల్ విజయలక్ష్మిలతోపాటు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కోవిడ్ కేస్‌షీట్' ఏం చేద్దాం?

### గాంధీ ఆస్పత్రి పాలనా యంత్రాంగం తర్జనభర్జన

**హైదరాబాద్:** తెలంగాణలో నమోదైన తొలి కోవిడ్ కేసులో బాధితునికి మెరుగైన వైద్యసేవలందించి, రోగాన్ని నయంచేసి డిశ్చార్జ్ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి, గాంధీ వైద్యులకు దక్కుతుంది. అయితే బాధితుడికి అందించిన వైద్యసేవలు, చికిత్స వంటి వివరాల్ని పొందుపర్చిన కేస్‌షీట్ వ్యవహారం మాత్రం గాంధీ ఆస్పత్రి పాలన యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. నగరంలోని మహేంద్రహిల్స్‌కు చెందిన యువకుడు దుబాయ్‌కు వెళ్లొచ్చాక కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, ఈ నెల 1న గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డు, తర్వాత అత్యవసర విభాగంలోని ఎక్యూట్ మెడికల్ వార్డులో చేర్చుకుని చికిత్స అందించారు. ఎట్టకేలకు కోలుకోగా, చివరిగా అనేక పరీక్షల అనంతరం కోవిడ్ నెగెటివ్ రావడంతో ఈ నెల 13న రాత్రి డిశ్చార్జ్ చేశారు. ఇన్ని రోజుల పాటు బాధితునికి అందించిన సేవలు, చికిత్స, మందులు, ఫ్లూయిడ్స్, బీపీ, సుగర్ వంటి వివరాలన్నీ కేస్‌షీట్‌లో పొందు పర్చారు. మామూలు రోగులను డిశ్చార్జ్ చేస్తే అతని కేస్‌షీట్‌ను పదేళ్లపాటు భద్రపరచాలని నిబంధన. దీంతో ఆయా కేస్‌షీట్లను ఆస్పత్రి ప్రధాన భవనం మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డు రూంలో భద్రపరుస్తారు. తాజా కేస్‌షీట్ కోవిడ్ బాధితునిది కావడం, కేస్‌షీట్ కాగితాలపై వైరస్ అంటుకుని ఉంటుందని, దానిని తాకితే ఇతరులకూ వ్యాపిస్తుందని భావిస్తున్నారు. ఒకవేళ కేస్‌షీట్‌ను జిరాక్స్ లేదా స్కానింగ్ చేస్తే.. యంత్రాలకూ వైరస్ అంటుకుని ఇతరులకు వ్యాపిస్తుందనేది మరికొందరి వాదన. ఈ నేపథ్యంలో 'కోవిడ్ కేస్‌షీట్'ను ఏం చేయాలనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. బాధితుడు వాడిన చెప్పులు, టూత్‌బ్రష్, దుస్తులు, వాడిన సిరంజీలు, సెలైన్ ఫ్లూయిడ్ బ్యాగులు వంటివన్నీ బయో మెడికల్ వేస్టేజ్ ద్వారా నిర్వీర్యం చేశారు. ఒక్క కేస్‌షీట్ విషయం మాత్రం తేలలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేస్‌షీట్‌ను దళసరి పాలిథిన్ బ్యాగ్‌లో పెట్టి, సీల్‌చేసి, దానిపై వైరస్ నివారణకు వినియోగించే ద్రావణాలను పూసి, ప్రత్యేక బీరువాలో భద్రపర్చాలని నిర్ణయించినట్టు తెలిసింది.





## విమానాశ్రయంలో 60,830 మందికి స్క్రీనింగ్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చిన వారిలో ఇప్పటివరకు మొత్తంగా 60,830 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

| విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలు | శనివారం రోజున | మొత్తంగా ఇప్పటివరకు |
|---|---|---|
| థర్మల్ స్క్రీనింగ్ చేసినవారు | 3,616 | 60,830 |
| సొంతంగా థర్మల్ స్క్రీనింగ్ చేయించుకున్నవారు | 39 | 774 |
| కేంద్రం లేదా ఇతర రాష్ట్రాలు రిఫర్ చేసినవారు | 0 | 349 |
| ఇళ్లల్లో ఐసోలేషన్‌లో ఉన్నవారు | 39 | 1,123 |
| ఆస్పత్రుల్లో ఐసోలేషన్‌లో ఉన్నవారు | 14 | 353 |
| శాంపిళ్ల సేకరణ | 14 | 353 |
| నెగటివ్ వచ్చినవి | 0 | 333 |
| పాజిటివ్ వచ్చినవి | 1 | 2 |
| ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవి | 14 | 18 |

# ఎండలతో కరోనా తగ్గుముఖం!

### నియంత్రణ చర్యలు ఉపయోగపడతాయి • ఏప్రిల్ చివరి వారానికి కేసులు తగ్గే అవకాశం • సీనియర్ శాస్త్రవేత్తల వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్‌పై భారతీయులు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సీనియర్ శాస్త్రవేత్తలు. ఇటలీ, ఇరాన్ వంటి దేశాలతో పోలిస్తే భారత్‌లో కొత్త కేసుల రేటు చాలా తక్కువగా ఉండటం దీనికి ఓ కారణమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మరో రెండు మూడు వారాల్లో కేసుల సంఖ్య ఎక్కువైనా.. ఆ తర్వాత క్రమేపీ తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ రాకేశ్ మిశ్రా. అమెరికా, బ్రిటన్‌లో కరోనా వైరస్ వ్యాప్తి, ఆస్పత్రిలో చేరేవారు.. మరణాల గురించి ఇప్పటికే కొన్ని కంప్యూటర్ ఆధారిత మోడల్స్ వచ్చాయని, వాటి ప్రకారం ఆయా దేశాల్లో కొన్ని లక్షల మంది మరణిస్తారన్న అంచనాలు ఉన్నా.. అవేవీ భారత్‌కు వర్తించవని వీరు 'సాక్షి'తో స్పష్టం చేశారు.

**ఆందోళన వద్దు..**



అమెరికాలోని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) ఇటీవల చేసిన ఓ కంప్యూటర్ మోడలింగ్ ప్రకారం.. ఆ దేశంలో రానున్న ఏడాది కాలంలో మొత్తం 16 కోట్ల మంది కరోనా వైరస్ బారిన పడతారు. 2 లక్షల నుంచి 17 లక్షల వరకు మరణాలు ఉండొచ్చని సీడీసీ మోడల్ హెచ్చరిస్తోంది. సీడీసీ ఉన్నతాధికారులు ఇటీవల నిర్వహించిన సదస్సులో ఈ మోడల్‌పై చర్చ జరిగినట్లు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ అంశాలను డాక్టర్ రాకేశ్ మిశ్రా దృష్టికి తీసుకురాగా.. భారత్‌లో ఇలా మోడలింగ్ చేసే సంస్థలు లేవని పేర్కొన్నారు. అయితే మన వాతావరణ పరిస్థితులు, ప్రజల సాధారణ రోగ నిరోధక వ్యవస్థ పనితీరు వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కరోనా వైరస్ గురించి అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారానికల్లా కొత్త కరోనా వైరస్ కేసుల సంఖ్య పతాక స్థాయికి చేరుకుని.. రెండు, మూడు వారాల తర్వాత తగ్గుముఖం పడతాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. కరోనా వైరస్ ప్రభావం వృద్ధుల్లోనే ఎక్కువని పేర్కొన్నారు.

**కొత్త కేసుల రేటు తక్కువ..**

గతేడాది డిసెంబర్‌లో చైనాలోని వూహాన్‌లో తొలిసారి కరోనా వైరస్‌ను గుర్తించగా జనవరి నెలాఖరుకు అక్కడి ప్రభుత్వం.. రవాణాపై ఆంక్షలు విధించిందని శ్రీవారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆ తర్వాత కేసులు తగ్గుముఖం పట్టాయని, భారత్‌తో పాటు ఇతర దేశాల్లోనూ ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనావేశారు. దేశంలోని దాదాపు 15 రాష్ట్రాల్లో వైరస్ నియంత్రణ చర్యలు ముమ్మరంగా చేపట్టారని, సినిమా హాళ్లు, స్విమ్మింగ్ పూల్స్ మూసేశారని ఈ చర్యల ఫలితం త్వరలోనే కనిపిస్తుందని చెప్పారు. ఐఐసీటీలోనూ తాము వైరస్ నియంత్రణకు అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశంలో రోజుకు నమోదవుతున్న కొత్త కరోనా వైరస్ కేసులు 10 కంటే తక్కువ ఉన్నాయని, దీన్నిబట్టి చూసినా ఆందోళన అవసరం లేదన్నది స్పష్టమవుతోందని చెప్పారు. ఉష్ణోగ్రతల పెరుగుదలతో కరోనా వైరస్‌కు అడ్డుకట్ట పడుతుందని కొందరు చెబుతున్నారని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కన్పిస్తే ప్రజలు ఇతరులతో కలవడాన్ని తగ్గించాలని, వైద్యులను సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



శనివారం కేబినెట్ భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎస్ సోమేశ్ కుమార్, మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్

# భయం లేదు.. జాగ్రత్తలే

▶ మొదటి పేజీ తరువాయి

130 కోట్ల మంది జనాభా ఉన్న మనదేశంలో కేవలం 83 మందికి మాత్రమే వచ్చింది. అందులో 66 మంది విదేశాల నుంచి వచ్చిన భారతీయులు, 17 మంది విదేశీయులు. వీరిలో 10 మంది కోలుకున్నారు. ఇద్దరు మాత్రమే చనిపోయారు. మిగిలిన వారికి చికిత్స అందుతోంది. ప్రజలెవరూ భయపడాల్సిన పనిలేదు. బెంబేలెత్తి గందరగోళానికి గురికావొద్దు. ప్రజలు తమను తాము కాపాడుకునేందుకు జనసమ్మర్థం ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా ఉండటమే మంచిది'అని సూచించారు.

### కేంద్ర సూచనల దృష్ట్యా

'అసెంబ్లీలో జరిగిన చర్చ, కేబినెట్ సమావేశం అనంతరం కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఢిల్లీ రాష్ట్రాలు కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాయి. కేంద్రం కూడా చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎంత డబ్బైనా ఖర్చు పెట్టేందుకు వెనుకాడబోం. ఈ వైరస్ నియంత్రణ కోసం ప్రాథమికంగా రూ.500 కోట్లను కేబినెట్ మంజూరు చేసింది. ఈ నిధి సీఎస్ అధీనంలో ఉంటుంది. ఏ క్షణంలోనైనా, ఎలాంటి సందర్భంలో అయినా ఈ నిధిని ఖర్చు చేసే సంపూర్ణ స్వేచ్ఛ ఆయనకు ఇస్తున్నాం. వైద్య, ఆరోగ్య శాఖ కూడా సర్వ సన్నద్ధంగా ఉంది'అని సీఎం వివరించారు.

### ఊళ్లకు పాకే ప్రసక్తే లేదు..

'ఇది అంతర్జాతీయంగా వస్తున్న వ్యాధి కాబట్టి దేశీయంగా వచ్చే ప్రమాదం లేదు. ఎయిర్‌పోర్టులు, పోర్టుల వద్దే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మనకు సముద్రం లేదు కాబట్టి పోర్టుల వద్ద ప్రమాదం లేదు. ఎయిర్‌పోర్టు కూడా హైదరాబాద్‌లోనే ఉన్నందున, బహుళ ఎయిర్‌పోర్టులు లేనందున హైదరాబాద్ పరిసరాలకు మాత్రమే ఈ వైరస్ పరిమితమవుతుంది. గ్రామీణ ప్రాంతాలకు సోకే అవకాశమే లేదు. ప్రజలు భయాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో 200 మంది వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు కేంద్రం పంపిన అధికారులు ఉన్నారు. వ్యాధి ప్రబలకుండా వారు స్క్రీనింగ్ చేస్తున్నారు'అని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

### అందుబాటులో పడకలు

'ఈవైరస్‌అనూహ్యంగాపెరిగినా ఇబ్బంది కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా 1,020 ఐసోలేషన్ పడకలు అందుబాటులో ఉంచాం. ఇవన్నీ కరోనా వైరస్ బాధితుల కోసమే.. ప్రత్యేక వార్డుల్లో ఉంటాయి. వీటితో పాటు 321 ఐసీయూ బెడ్ యూనిట్లు అందుబాటులో ఉంచాం. 240 వెంటిలేటర్లు సిద్ధంగా ఉంచాం. వెంటిలేటర్లకు ఎలాంటి కొరత లేదు. వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునే క్వారంటైన్ కోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఇప్పటికే ఏర్పాటు చేశాం. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, కార్యదర్శి ఆధ్వర్యంలో ఉండే ఈ టాస్క్‌ఫోర్స్‌లో పంచాయతీరాజ్, పురపాలక, అటవీ, పోలీసు తదితర శాఖ అధికారులు ఉంటారు. ఈ టాస్క్‌ఫోర్స్ రోజూ ఒకటి లేదా రెండు సార్లు సమావేశమై రాష్ట్రంలోని పరిస్థితిని ఆరోగ్య మంత్రి, ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శికి నివేదిస్తాయి. ఆరోగ్య మంత్రి కూడా పరిస్థితిపై సమీక్ష జరిపి అం దుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. ఎవరూ అధైర్యపడాల్సిన పని లేదు'అని పేర్కొన్నారు.

### వారం పాటు నియంత్రణ వీటిపై..

- బహిరంగ సభలు, సమావేశాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ఉత్సవాలు, ర్యాలీలు, ఎగ్జిబిషన్లు, ట్రేడ్ ఫెయిర్లు, కల్చరల్ ఈవెంట్లకు అనుమతులు ఉండవు. ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్స్, జిమ్నాజియమ్స్, జూ పార్కులు, మ్యూజియాలు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు అన్నీ వారం పాటు మూసేయాలి. జనసమ్మర్థం ఉండే ప్రాంతాలు కాబట్టి అనుమతి ఉండదు. వెంటనే మూసేయాలి.
- అన్ని రకాల స్పోర్ట్స్ ఈవెంట్లు రద్దు. నిర్వహించడానికి వీల్లేదు. సినిమా హాళ్లు, బార్లు, పబ్బులు, మెంబర్‌షిప్ క్లబ్బులు బందే.

### ఎవరూ కాపాడలేరు..

'ఎలక్ట్రానిక్ మీడియాలో అతి ప్రచారం చేస్తున్నారు. మంచిర్యాల, జగిత్యాల, కాకరకాయ అంటూ వార్తలు రాస్తున్నారు. వీళ్ల మీద కూడా నియంత్రణ పెడుతున్నాం. మంచిర్యాల, జగిత్యాల, తోక, తొండెం అని రాస్తే క్షమించే పరిస్థితి లేదు. ఆరోగ్య శాఖ నిర్ధారించింది మాత్రమే రాయాలి తప్ప, ఏ మీడియా అయినా ఈడ కేసు, ఆడ కరోనా అని రాస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మేం పత్రికా స్వేచ్ఛను హరించట్లేదు. భయోత్పాతం సృష్టించడం, తప్పుడు ప్రచారం చేయడం సమాజానికి మంచిది కాదు కాబట్టి మానుకుంటే మంచిది. మాకు ఎలాంటి శషభిషల్లేవు. ప్రభుత్వం అంటే ఏంటో వారే చూస్తారు. ఎవరూ కాపాడలేరు. ప్రభుత్వానికి విచక్షణాధికారాలు ఉంటాయి. ప్రభుత్వ వినతిని కాదని, ఇలాంటి సున్నిత పరిస్థితుల్లో తప్పుడు వార్తలు రాస్తే ఏమవుతుందో అనుభవం వారికే వస్తుంది. అప్పీల్ చేయకపోతే మాది తప్పు. విజ్ఞప్తి చేస్తున్నాం కాబట్టి చర్యలకు వెనుకాడే ప్రసక్తే లేదు'అని కేసీఆర్ మీడియాను కూడా హెచ్చరించారు.

**ప్రజా రవాణా యథాతథం**

'ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రజా రవాణా యథాతథంగా కొనసాగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లు యథాతథంగా నడుస్తాయి. అయితే వాటిలో నిరంతరం శానిటైజేషన్ జరుగుతుంది. ప్రజలకు కొనుగోలుకు ఇబ్బంది లేకుండా, సరుకుల కొరత రాకుండా సూపర్ మార్కెట్లు, షాపులు, మాల్స్ మూసేయట్లేదు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం'అని సీఎం వివరించారు.

### పరిశుభ్రత పాటిస్తే మంచిది..

'కరోనా ప్రధానంగా చైనా, ఇటలీ, ఇరాన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో విస్తరించింది. ఈ ఏడు దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను 14 రోజుల పాటు క్వారంటైన్ కేంద్రాలకు తరలించి, పరిస్థితిని బట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది. అన్ని రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. వారం రోజుల తర్వాత ఆరోగ్య మంత్రి, ప్రధాన కార్యదర్శి, ఆరోగ్య శాఖ కార్యదర్శి సమీక్షించి, ప్రస్తుతం విధించిన ఆంక్షలు కొనసాగించాలా లేదా ఎత్తేయాలా అన్న దానిపై నిర్ణయం తీసుకుంటారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కోరతాం. ప్రభుత్వం ఏటా నిర్వహించే ఉగాది పంచాంగ శ్రవణాన్ని అవసరమైతే రద్దు చేస్తాం. శ్రీరామనవమి వంటి పండుగల నిర్వహణకు సంబంధించి పరిస్థితికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాం. కరోనాపై లేనిపోని భయాందోళనలు కల్పించొద్దు. మాస్కుల అవసరం అంతగా లేదు. కరోనా వ్యాప్తికి సంబంధించి ప్రాథమికంగా అనుమానితులు ఉంటే వారి నుంచి నమూనాలు సేకరించి పుణేలోని కేంద్రానికి పంపిస్తున్నాం. కరోనా ప్రభావం కొద్ది రోజులే ఉండే అవకాశం ఉంది. రాకపోకలను తగ్గించుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించడం ద్వారా కరోనా వ్యాప్తిని నివారించొచ్చు. అసెంబ్లీ సమావేశాల కొనసాగింపుపై ఆదివారం స్పీకర్ నిర్ణయం తీసుకుని ప్రకటిస్తారు'అని సీఎం వెల్లడించారు.

## మీడియా.. బహుపరాక్

'కరోనా వ్యాప్తిపై సోషల్ మీడియాలో, మీడియాలో (ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ మీడియా) అతి ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం, చట్టం అంటే ఏంటో రుచి చూపిస్తాం. చట్టాలు ఎలా అమలు చేయాలో తెలుసు. ఎవరికీ మినహాయింపు ఉండదు. కొందరు అతిగాళ్లు సోషల్ మీడియాలో ఇష్టమున్న ప్రచారం చేస్తున్నారు. వీరిపై చాలా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి పరిస్థితుల్లో భయాందోళనలు కలిగించడం మంచిది కాదు. వీటిని ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ప్రచారం చేసే వాళ్లపై నియంత్రణ ఉంటుంది. క్షమించేది లేదు. కఠిన చర్యలుంటాయి'అని కేసీఆర్ తీవ్ర హెచ్చరికలు చేశారు. అలాగే మీడియా కూడా సంయమనం పాటించాలని, ప్రజలను భయాందోళనలకు గురిచేసే వార్తలు కాకుండా, వారికి సమాచారం ఇచ్చే విధంగా, అవగాహన కలిగించేలా మాత్రమే ప్రచారం చేయాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ ధ్రువీకరించిన తర్వాతే వార్తలు రాయాలని స్పష్టం చేశారు.

## 15 రోజుల కార్యాచరణ అంశాలు..

- ప్రాథమిక పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు శనివారం రాత్రి నుంచి మార్చి 31 వరకు బంద్.
- ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. ఎవరు అతిక్రమించినా తీవ్ర చర్యలుంటాయి. ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు. కోచింగ్ సెంటర్లు, సమ్మర్ క్యాంపులు మూసేయాలి. ఈ రాత్రి నుంచే అమల్లోకి వస్తుంది. ఎవరూ రిస్క్ తీసుకోవద్దు.
- ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఇతర బోర్డు పరీక్షలు యథావిధిగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతాయి. ఈ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు, జాగ్రత్తలు చేస్తారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండే విద్యార్థుల్లో పరీక్షలు రాసే విద్యార్థులకు హాస్టల్ వసతి కొనసాగుతుంది. మిగిలిన విద్యార్థులను పంపిస్తారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండే విద్యార్థుల కోసం ప్రత్యేక శానిటరీ ఏర్పాట్ల కోసం వైద్య శాఖ కార్యదర్శి ఆదివారం ఉత్తర్వులు జారీ చేస్తారు.
- రాష్ట్రంలోని అన్ని మ్యారేజీ హాల్స్ మూసివేత. ఇప్పటికే కరారైన ముహూర్తాలు, నిర్ణయించిన పెళ్లిళ్లకు మినహాయింపు. పెళ్లిళ్లు 200 మంది లోపు బంధువులతో (అమ్మాయి తరపు 100, అబ్బాయి తరపు 100 మంది) చేసుకుంటే మంచిది. వాళ్ల శ్రేయస్సు, మంచి దృష్ట్యా శుభకార్యాలను ఈ పద్ధతిలో చేసుకోవాలి. మ్యారేజీ హాల్స్ విషయంలో ఇప్పటికే పోలీసు కమిషనర్లు, ఎస్పీలకు ఆదేశాలిచ్చాం. మ్యారేజీ హాల్స్ యజమానులు మార్చి 31 తర్వాత జరిగే పెళ్లిళ్లకు ఎవరికీ హాల్స్ బుకింగ్ ఇవ్వొద్దు. అలా ఇస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఓనర్లు రిస్క్ తీసుకోవద్దు.

## ఇదం జగత్



విశ్వాస పరీక్షకు వెళ్లే ముందు కరోనా శ్వాస పరీక్ష కూడా చేయించాలి సార్ మనోళ్లకు... అసలే పరిస్థితులు బాగోలేవ్!!



# ఇటలీలో శ్మశాన నిశ్శబ్దం



ఇటలీ ప్రభుత్వం విధించిన నిబంధనలు చూస్తే వామ్మో అనిపించొచ్చు. మరీ అతి చేస్తున్నారా అన్న భావన రావచ్చు. కానీ కబళించింది ఏదో కాదు ప్రపంచాన్నే వణికించే రక్కసి. చైనా తర్వాత అత్యంత ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న దేశం ఇటలీ. రోజు రోజుకీ కేసుల సంఖ్యతో పాటు మృతులు కూడా పెరిగిపోతున్నారు. ఇప్పటికే 17 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. దీంతో పకడ్బందీ చర్యలు చేపట్టారు. నిత్యావసరాలు దొరికే సూపర్ మార్కెట్లు, ఫార్మసీలు తప్ప మిగతావన్నీ మూసేశారు. తమకు కావల్సిన సరుకులు తెచ్చుకోవాలంటే ఇంట్లో నుంచి ఒక్కరికి మాత్రమే బయటకు రావడానికి అనుమతిస్తున్నారు. సూపర్ మార్కెట్లు, ఫార్మసీల కిటికీలు మాత్రమే తెరిచి ఉంచుతారు. ఒకరి తర్వాత ఒకరు క్యూ పద్ధతి పాటిస్తూ లోపలికి వెళ్లి వారికి కావల్సినవి తెచ్చుకోవాలి. రద్దీ ఎక్కువ ఉంటే ఒకసారి నలుగురైదుగురిని లోపలికి అనుమతిస్తారు కానీ ఒక్కొక్కరి మధ్య కనీసం మూడు అడుగుల దూరం పాటించాలి. ఇల్లు కదిలి బయటకి రావాలంటే పోలీసులకు కారణాలు చెప్పాలి. ఇలా అడుగడుగునా ఆంక్షలు విధించారు. అయితే అంతటి నిర్బంధంలో ఉండడం మామూలు విషయం కాదంటున్నారు మిలాన్‌లో ఉంటున్న అమెరికన్ క్రిస్టినా హిగ్గిన్స్. దేశమే ఒక జైలులా మారినప్పుడు కాలం గడపడం దుర్లభం అని ఆమె అంటున్నారు. భర్త, పిల్లలు ఇంటిపట్టునే ఉన్నా ఊపిరాడనట్టుగా ఉంటోందని హిగ్గిన్స్ మీడియా ఇంటర్వ్యూల్లో చెప్పారు. మరో రెండు వారాల పాటు ఇటలీలో ఇవే పరిస్థితులు కొనసాగనున్నాయి. మహమ్మారి ముంచేయకుండా అక్కడి ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది.

## ఇగ్నోలో ఎంబీఏ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ద్వారా 2020 సంవత్సరానికి మేనేజ్‌మెంట్(ఎంబీఏ), పీహెచ్‌డీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. ఈ పరీక్షలకు హాజరుకాదలచిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ ఎస్.ఫయాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోగా ఆన్‌లైన్ విధానంలో ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 9492451812, 040–23117550 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.






# ‘ఉమ్మడి’ నోటిఫికేషన్ ప్రకారమే భర్తీ చేయాలి

- సబ్ ఇంజనీర్ పోస్టులపై ట్రాన్స్‌కోకు హైకోర్టు స్పష్టీకరణ
- 2011, 2012 నోటిఫికేషన్ల ప్రకారం అర్హులను నియమించాలని ఆదేశం
- 2017లో జారీచేసిన నోటిఫికేషన్ చెల్లదని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌కోలో సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులను 2011, 2012 సంవత్సరాల్లో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన వారితో భర్తీ చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆ రెండు నోటిఫికేషన్లకు కాలం చెల్లిందని 2017లో ట్రాన్స్‌కో ఆఫీస్ ఆర్డర్ జారీ చేసింది. అనంతరం అదే ఏడాది డిసెంబర్ 28న ఆ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ రెండు నిర్ణయాలను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ తీర్పు సబ్ ఇంజనీర్ల (ఎలక్ట్రికల్)కు మాత్రమే వర్తిస్తుందని.. జూనియర్ ఇంజనీర్లు, జూనియర్ లైన్‌మెన్‌లకు వర్తించదని స్పష్టం చేసింది. 2011, 2012 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం సబ్ ఇంజనీర్ పోస్టులకు అర్హులైనవారికి నియామకపత్రాలు జారీచేయాలని తెలంగాణ ట్రాన్స్‌కోను ఆదేశించింది. అయితే ఈ తీర్పుతో 2011, 2012 నోటిఫికేషన్ల అభ్యర్థులకు ఎలాంటి హక్కులు దక్కబోవని తేల్చి చెప్పింది.

### ఏకపక్షంగా రద్దు చేశారు..

‘‘ఓపెన్ కేటగిరీ కింద 101, స్థానిక కోటా కింద 238 సబ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి 2011 డిసెంబర్ 15న ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఆరు జోన్లు పేర్కొన్నారు. మొదటి మూడు జోన్లు ఏపీ, తర్వాత మూడు జోన్లు తెలంగాణ పరిధిలో ఉన్నాయి. రెండు రాష్ట్రాలకు వర్తించేలా సమైక్య రాష్ట్రంలో నోటిఫికేషన్ వెలువడింది. ఆ పోస్టుల భర్తీకి ట్రాన్స్‌కోకు ఎలాంటి అడ్డంకులు ఏర్పడలేదు. అయినా ఆ నోటిఫికేషన్లను ట్రాన్స్‌కోలు రద్దు చేశాయి. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 79 సెక్షన్ ప్రకారం ఏ ప్రాంతంలో పనిచేసే ఉద్యోగి ఆ రాష్ట్రంలోనే కొనసాగుతారు. దీని ప్రకారం అభ్యర్థి ఎంపికైన జోన్‌ను ఆధారంగా చేసుకుని వారిని రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏ రాష్ట్రానికి చెందినవారో ట్రాన్స్‌కో గుర్తించవచ్చు. నోటిఫికేషన్ మేరకు ఉద్యోగాల భర్తీ చేయడానికి ఏవిధమైన అడ్డంకులు లేకపోయినా ఆ నోటిఫికేషన్లను ఏకపక్షంగా రద్దు చేశారు. నోటిఫికేషన్ల రద్దు విషయంలో రెండు ట్రాన్స్‌కోలు అనుసరించిన తీరు ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్ర విభజనకు ముందు నోటిఫికేషన్ అమలు చేస్తే అభ్యర్థుల అర్హతలు, సర్టిఫికెట్లను గుర్తించడం కష్టమని ట్రాన్స్‌కో చేసిన వాదన న్యాయబద్ధంగా లేదు. అందుకే 2011, 2012ల్లో జారీ చేసిన నోటిఫికేషన్లను రద్దు చేస్తూ ట్రాన్స్‌కో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నాం. ఆ రెండు నోటిఫికేషన్ల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేయాలి. 2017లో ఇచ్చిన నోటిఫికేషన్ చెల్లదు. పాత నోటిఫికేషన్ల మేరకే ఉద్యోగాల భర్తీ చర్యలు తీసుకోవాలి’’అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.






### పరీక్ష కేంద్రం దొరకట్లేదు..

# హెల్ప్ ప్లీజ్!

- బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్లలో గందరగోళం
- పరీక్ష కేంద్రం దొరక్క అభ్యర్థుల అవస్థలు

సాక్షి, హైదరాబాద్ : మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో వివిధ తరగతుల్లో ఖాళీల భర్తీకి తలపెట్టిన ప్రవేశ పరీక్ష విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తోంది. బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 257 పాఠశాలలున్నాయి. ఈ స్కూళ్లలో 6,7,8, తరగతుల్లో ఉన్న ఖాళీల భర్తీకి ఈనెల 15న ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ ఫలితాల ఆధారంగా అడ్మిషన్లు ఇస్తారు. ఈ నేపథ్యంలో పరీక్షకు చెందిన హాల్‌టిక్కెట్లు ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. వీటిని డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులు పరీక్ష కేంద్రాన్ని చూసుకునేందుకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు.హాల్ టిక్కెట్‌లో పేర్కొన్న చిరునామాలో సదరు పరీక్ష కేంద్రం లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**చిరునామా అరకొర...**

బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి నిర్వహించిన ప్రవేశపరీక్షకు సంబంధించిన పరీక్షా కేంద్రాలన్నీ బీసీ గురుకుల పాఠశాలలే. వాటికి శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. చాలా పాఠశాలలను మూతపడ్డ ఇంజనీరింగ్ కాలేజీలు, ఇతర విద్యాసంస్థల్లో కొనసాగిస్తున్నారు. కొన్నింటిని దూరప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పూర్తిస్థాయి చిరునామా ఉంటే తప్ప వాటిని గుర్తించే స్థితి లేదు. అయితే హాల్ టిక్కెట్లను అరకొర చిరునామాతో జారీ చేశారు.

# ప్రభుత్వానికి ప్రజల సహకారం అవసరం

- కోవిడ్ నియంత్రణకు అందరూ సహకరించండి: మెగాస్టార్ చిరంజీవి
- సినిమా షూటింగ్‌లను వాయిదా వేసుకుంటున్నట్లు ప్రకటన



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వ్యాప్తి చెందకుండా కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడుగా ప్రజల సహకారం అవసరమని మాజీ కేంద్రమంత్రి, మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. ఏపీ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటోందని, మరింత అప్రమత్తం అవసరమని పేర్కొన్నారు. తన సినిమా షూటింగ్‌లను తక్షణం వాయిదా వేసుకుంటున్నట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కోవిడ్ నియంత్రణ బాధ్యత ప్రభుత్వాలకే వదిలేయకుండా అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. అందరిలో చైతన్యం కలిగించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానని పేర్కొన్నారు. కోవిడ్ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్విముఖ వ్యూహం అనుసరిస్తున్నాయని కొనియాడారు. కరోనా సోకిన వారికి తగిన చికిత్స అందించడం, వైరస్ వ్యాప్తి కాకుండా జనాలు గుమికూడకుండా క్రీడల్ని వాయిదా వేయడం, మాల్స్, సినిమా హాల్స్ మూసివేయడం, స్కూల్స్, కళాశాలలకు సెలవులు ప్రకటించడం తదితర చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ అందరిలో ధైర్యాన్ని, నమ్మకాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముందస్తు నివారణ చర్యలు ప్రారంభించినట్లు తెలుసుకున్నానని, పరిస్థితులకు అనుగుణంగా ఆయన కూడా తగిన నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, సినిమా షూటింగ్స్‌లో పెద్ద సంఖ్యలో సాంకేతిక నిపుణులు పనిచేయాల్సి ఉంటుందని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 10 నుంచి 15 రోజుల పాటు షూటింగ్స్ వాయిదా వేస్తే బాగుంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ కొనసాగుతున్న సినిమా షూటింగ్‌ను వాయిదా వేయాలని దర్శకుడు కొరటాల శివతో చెప్పగా, ఆయన అంగీకరించారని వివరించారు. కోవిడ్ నియంత్రణలో సినీ రంగం కూడా పాలు పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### వైద్య విద్యార్థులకు సెలవులు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ నియంత్రణలో భాగంగా రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఎంబీబీఎస్, నర్సింగ్, డెంటల్ విద్యార్థులకు సెలవులు ప్రకటిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఫైనల్ ఇయర్, పీజీ విద్యార్థులను మినహాయించింది. వారికి తరగతులు యథావిధిగా ఉంటాయి.






# తిరుమలలో నేరుగా దర్శనానికి..

- కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండే పద్ధతికి స్వస్తి
- కరోనా వ్యాప్తి నేపథ్యంలో టీటీడీ జాగ్రత్తలు
- ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం రద్దు
- ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు 17వ తేదీ మంగళవారం నుంచి టైంస్లాట్ టోకెన్లు జారీ చేయడం ద్వారా యాత్రికులను నేరుగా శ్రీవారి దర్శనానికి అనుమతించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సాయంత్రం ఈవో, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు టీటీడీ తీసుకున్న నిర్ణయాలను వివరించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్– 1, 2 లలో వేచి ఉండకుండా టైంస్లాట్ టోకెన్లు పొందిన భక్తులను నేరుగా శ్రీవారి దర్శనానికి అనుమతించనున్నట్లు వివరించారు. భక్తులు కంపార్ట్ మెంట్లలో వేచి ఉంటే కరోనా వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తిరుమల, తిరుపతిలలో టైమ్ స్లాట్లు టోకెన్లు ఇవ్వడానికి కౌంటర్లు అందుబాటులోనికి తెస్తామన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

- భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు విశేష పూజ, సహస్ర కలశాభిషేకం, వసంతోత్సవం సేవలను రద్దు.
- ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించవలసిన శ్రీ సీతా రాముల కల్యాణాన్ని ఆలయం వెలుపల రద్దు చేసి గతంలో వలే ఆలయం లోపల నిర్వహణ.
- ఏప్రిల్ 5వ తేదీన ముంబాయిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఏర్పాటు చేసిన భూమిపూజ రద్దు.
- ప్రజలందరు ఆరోగ్యంగా ఉండడానికి స్వామివారి ఆశీస్సులకోసం శ్రీ శ్రీనివాస శాంత్యోత్సవ సహిత ధన్వంతరి మహాయాగం మార్చి 19 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తాం. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపనందేంద్ర స్వామివారు, మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ స్వామివార్ల ఆధ్వర్యంలో ఇది జరుగుతుంది.
- అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాలతోపాటు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, కల్యాణ కట్ట, అన్నప్రసాద భవనం తదితర ప్రాంతాల్లో థర్మల్ స్క్రీనింగ్.
- భక్తులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రతి 2 గంటలకోసారి పరిశుభ్రత చర్యలు.
- భక్తులు ఖాళీ చేసిన వసతి గదులను గంట పాటు శుభ్రం చేసిన తరువాతే మరొకరికి కేటాయింపు.
- యాత్రికులు 0877 – 2263447 నంబరుకు చేసి కరోనా వ్యాప్తి నివారణ చర్యలను తెలుసుకోవచ్చు.
- అలిపిరి వద్ద యాత్రికులకు కరోనా వ్యాధి లక్షణాలను గుర్తిస్తే నేరుగా రుయా ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు పంపుతాం.



## ఆందోళన చెందొద్దు



ఆమె పేరు ఎలిజబెత్ షియండర్. వయసు 37. అమెరికా సియాటిల్‌లో నివాసం. బయో ఇంజనీరింగ్‌లో డిగ్రీ చేశారు. కరోనాను జయించి తన అనుభవాలను ఫేస్‌బుక్ వేదికగా పంచుకున్నారు. అప్పటికింకా అమెరికా కరోనా వైరస్‌ను సీరియస్‌గా తీసుకోలేదు. ఆ లక్షణాలు కనిపిస్తే ఫ్లూ అయి ఉంటుందని కొట్టిపారేసే రోజులవి. ఎలిజబెత్ కూడా ఒక రోజు స్నేహితుల ఇంట్లో పార్టీ జరిగితే వెళ్లారు అక్కడి నుంచి వచ్చిన మూడు రోజుల తర్వాత జ్వరం, విపరీతమైన తలనొప్పి రావడం మొదలైంది. ఉదయం లేచేసరికి కాస్త వళ్లు వెచ్చబడేది, సాయంత్రమైతే 103 డిగ్రీలకు జ్వరం చేరేది. జలుబు, దగ్గు, గొంతు నొప్పి, శ్వాసకోశ సమస్యలు వంటి కరోనా లక్షణాలే లేవు. దీంతో ఏదో ఫ్లూ జ్వరం తగ్గిపోతుందని అనుకున్నారు. అయిదారు రోజులైనా తగ్గకపోయేసరికి డాక్టర్ దగ్గరకి వెళ్లారు. వైద్య పరీక్షల్లో కరోనా అని తేలింది. వెంటనే ఆమె నెత్తిన పిడుగు పడ్డట్టయింది. తనకు తాను ధైర్యం చెప్పుకున్నారు. మూడు వారాలు ఇంటికే పరిమితమయ్యాక కరోనా అదుపులోకి వచ్చింది. మామూలుగానే ఎలిజబెత్‌ది మంచి ఆరోగ్యం. రోగనిరోధక శక్తి ఎక్కువే. అందుకే ఆమె వ్యాధి నుంచి సులభంగానే బయటపడ్డారు. ఆమె చేసిందల్లా ఒక గదికే పరిమితమైపోవడం, ఎక్కువ సేపు విశ్రాంతిగా ఉండడం, బాగా మంచినీళ్లు తాగడం. అంతే.. ఆమె ఇప్పుడు కరోనా గురించి చెబుతున్న మాట ఒక్కటే 'మీరు వయసులో ఉండి, ఇతర ఏ సమస్యలు లేకపోతే, మీ ఆరోగ్యంపై మీకు శ్రద్ధ ఉంటే కరోనా నుంచి సులభంగా బయటపడొచ్చు. ఆందోళన చెందాల్సిన పనేలేదు''అని ఎలిజబెత్ అందరిలోనూ భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు.

## అతివిశ్వాసమూ వద్దు



కోవిడ్–19తో అతలాకుతలమవుతున్న మరో దేశం దక్షిణ కొరియా. బూసాన్ సిటీలో నివాసం ఉండే పార్క్ హయాన్ అనే యూనివర్సిటీ ప్రొఫెసర్ కరోనా సోకి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 48 ఏళ్ల వయసున్న పార్క్ వ్యక్తిగత పరిశుభ్రతకి అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. శానిటైజర్‌లో చేతులు బాగా శుభ్రం చేస్తుంటారు. అందుకే తనకి కరోనా సోకదులే అన్న ధీమా ఉండేది. ఒకరోజు ఉదయం లేచేసరికి గొంతు నొప్పి, జ్వరం, పొడి దగ్గు వచ్చాయి. కరోనా వైరస్ ఏమోనన్న అనుమానం వచ్చింది. కానీ ఆస్పత్రుల వద్ద పరీక్షలకి పెద్ద పెద్ద క్యూలైన్లు ఉండడంతో కాస్త నిర్లక్ష్యం చేశారు. తర్వాత రెండు మూడు రోజులకే శ్వాసకోశ సమస్యలు తలెత్తడంతో వైద్య పరీక్షలకు వెళ్లారు. ఆ లైన్లోనే ఉంటూ స్పృహ తప్పి కింద పడిపోయారు. తలకి గాయమైంది. వైద్య పరీక్షల్లో కరోనా సోకిందని తేలింది. ఆయనని ఐసీయూలో ఉంచి చికిత్స నిర్వహించాల్సి వచ్చేది. కొద్ది రోజుల చికిత్స తర్వాత కూడా ఆయనకి విపరీతమైన ఛాతీ నొప్పి, కడుపులో మంట వస్తూ ఉండేవి. ఒక్కోసారి విపరీతమైన ఆకలి వేసేది. గొంతు నొప్పి కారణంగా ఆహారం మింగుడుపడేది కాదు. అయితే వైద్యులు చూపించిన శ్రద్ధ, తాను తీసుకున్న జాగ్రత్తల వల్లే కోలుకున్నానని పార్క్ చెప్పారు. ఎవరూ అతి విశ్వాసానికి పోవద్దని, అనుమానం ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని ప్రజలకు హితవు చెబుతున్నారు పార్క్.

# కరోనాతో గాబరా వద్దు!

### శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం కేసీఆర్

- కోవిడ్‌తో భయపడాల్సిన పరిస్థితి లేదు
- ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటది
- ఉత్పాతం వచ్చినా ఎదుర్కోవడానికి సర్వం సంసిద్ధమై ఉన్నాం
- రూ. వెయ్యి కోట్లు కాదు.. అవసరమైతే 5 వేల కోట్లు ఇస్తా
- ప్రపంచ వ్యాప్తంగా ఉత్పాత పరిస్థితి ఉంటే ప్రేక్షక పాత్ర తగదు

సాక్షి, హైదరాబాద్

'కోవిడ్‌తో మనకు ప్రమాదమేమీ లేదు. ఉత్పాతం ఏమీ వచ్చిపడలేదు. గాబరపడాల్సిన పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటది. అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నరు. అన్ని రకాలుగా మన ఆరోగ్య శాఖ సంసిద్ధమై ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది'అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు భరోసానిచ్చారు. ఎటువంటి ఉత్పాత పరిస్థితి వచ్చినా ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధమై ఉందని స్పష్టం చేశారు. 'మన పిల్లలు, అమాయక ప్రజానీకాన్ని కాపాడుకోవడానికి పొరుగు రాష్ట్రాల తరహాలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అనవసరంగా రిస్క్ తీసుకోకూడదు కాబట్టి ఏ చర్యలు తీసుకుంటే సబబుగా ఉంటది అనే విషయాన్ని చర్చించేందుకు కేబినెట్ సమావేశం నిర్వహించి నిర్ణయిస్తాం'అని ప్రకటించారు. 'రాష్ట్రంలో కోవిడ్ ప్రభావం–తీసుకున్న చర్యలు'పై శాసనసభలో శనివారం నిర్వహించిన లఘు చర్చలో ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మాట వరసకు గతంలో కోవిడ్–19 నివారణకు రూ.1000 కోట్లు ఇస్తా అన్నామని, అవసరమైతే రూ.5 వేల కోట్లయినా ఇస్తామని ప్రకటించారు. 'కరోనా వైరస్ సంబంధించి మంత్రి ఈటల రాజేందర్ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నరు. 12 రోజుల నుంచి రోజువారీగా సమీక్షలు నిర్వహిస్తున్నరు. గాంధీ ఆస్పత్రిలో కరోనా వచ్చిన ఓ వ్యక్తికి నయం చేసి పంపించడం జరిగింది. ఇప్పటివరకు దేశంలో ఇద్దరే చనిపోయారు'అని సీఎం తెలిపారు.

**మొన్నటి వరకు సమస్య లేదు..**

'శుక్రవారం రాత్రి 11.30 గంటలకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి శాంతికుమారితో మాట్లాడితే ఇప్పటికి మనం సేఫ్ అని అన్నరు. ఇటలీ నుంచి వచ్చిన వ్యక్తికి పాజిటివ్ అని తేలడం దురదృష్టకరం. గాంధీలో ఉంచి చికిత్స చేస్తున్నం. ప్రాథమికంగా మరో ఇద్దరికి వ్యాధి సోకినట్టు అనుమానిస్తున్నరు. వైద్య పరీక్షల కోసం నమూనాలు సేకరించి పుణేకు పంపించిండ్రు. ఈ ముగ్గురూ బయట దేశాల నుంచి వచ్చినవాళ్లే. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పాతస్థితి ఉన్నప్పుడు మనం ప్రేక్షక పాత్ర వహించలేం. వహిస్తే నేరం అవుతుంది. మొన్నటి వరకు మనకు ఆ సమస్య, ప్రమాదం లేదు. అనుకోకుండా ఒక కేసు పాజిటివ్‌గా రావడం, మరో ఇద్దరు అనుమానితులు ఉండటం తాజా పరిణామాలు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



**పొరుగు రాష్ట్రాల బాటలో...**

'ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. కేంద్ర ప్రభుత్వం దేశ రాజధానిలో స్కూల్స్, మాల్స్ మూసివేసింది. బెంగళూరులో పెళ్లిళ్లు, బర్త్‌డేలు వాయిదా వేయించే అధికారాన్ని కలెక్టర్లకు అక్కడి ప్రభుత్వం ఇచ్చింది. కుటుంబ కార్యక్రమాలు ఇంటి వరకే చేసుకోవాలి. మహారాష్ట్ర, ముంబై, పుణే, భువనేశ్వర్, బెంగళూరులో భవిష్యత్తు కార్యాచరణపై అక్కడి ప్రభుత్వాలు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాయి. మనం కూడా మున్ముందు తీసుకోవాల్సిన చర్యలపై చీఫ్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారు'అని సీఎం తెలిపారు.

**వచ్చిన వారిని వచ్చినట్లే స్క్రీనింగ్...**

'కరోనా తీవ్రత అధికంగా ఉన్న చైనా, దక్షిణ కొరియా, ఇరాన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల నుంచి విదేశీ ప్రయాణికులను మన దేశంలోకి అనుమతించవద్దని కేంద్రం నిర్ణయం తీసుకుంది. కోవిడ్–19 నుంచి మన దేశాన్ని కాపాడుకోవాలని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ దేశాల నుంచి మన దేశస్తులు తిరిగి వస్తే వారిని విమానాశ్రయంలో దిగిన వెంటనే 14 రోజులు క్వారంటైన్ (జనంతో దూరంగా ఉంచడం) చేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. వారికి వ్యాధి లేదని తేలితే ఇంటికి పంపిస్తం. లేకుంటే చికిత్స అందిస్తం. వచ్చేవాళ్లు ఏ దేశం నుంచి ఏ దేశం వెళ్లి వస్తారో తెలియదు. ఈ 7 దేశాల నుంచి నగరానికి నేరుగా విమానాలు లేకపోయినా ఢిల్లీ, ముంబైలో దిగి హైదరాబాద్‌కు రావచ్చు. అందుకే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని వారం రోజుల నుంచే అప్రమత్తమై ఉన్నం. 200 మంది ఆరోగ్య శాఖ సిబ్బందిని ఎయిర్‌పోర్టులో ఉంచినం. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీతో కలసి వచ్చిన వారిని వచ్చినట్టే స్క్రీనింగ్ చేస్తున్నరు. చెప్తే ప్రజలు భయపడ్తరని ఈ విషయాలు చెప్తలేం. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో శుక్రవారం ఒక కమిటీ వేసినం. డీసీపీ ప్రకాశ్ రెడ్డి ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్నరు'అని కేసీఆర్ వెల్లడించారు.

**అంతర్జాతీయ కనెక్టివిటీ పెరిగింది**

హైదరాబాద్‌కు పెరిగిన అంతర్జాతీయ కనెక్టివిటీని, కోవిడ్ వ్యాప్తికి ఉన్న అవకాశాలను సీఎం సభలో వివరించారు. 'శంషాబాద్ విమానాశ్రయానికి రద్దీ బాగా పెరిగింది. హైదరాబాద్ మెట్రో రైలులో కూడా అంచనాలకు మించి రోజుకు 4 లక్షల మందికి పైగా ప్రయాణిస్తున్నరు. 2013–14లో రోజుకు సగటున 88 లక్షల ప్రయాణికులు నగరానికి వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 2.17 కోట్లకు పెరిగింది. శంషాబాద్ విమానాశ్రయానికి అప్పట్లో రోజుకి 23 వేల మంది వస్తే.. ఇప్పుడు 57 వేల మంది వస్తున్నరు' అని కేసీఆర్ చెప్పారు.

### భయంకరమైన కరోనా కాంగ్రెస్ పార్టీనే..

దేశానికి పట్టిన భయంకరమైన కరోనా కాంగ్రెస్ పార్టీనే అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 'కోవిడ్‌తో వచ్చే జ్వరం మామూలు పారాసిటమాల్ వేసుకుంటే పోతదని ఓ సైంటిస్టు నాతో చెప్పిన విషయాన్ని చెప్పిన. దీనిని పట్టుకుని రాజకీయం చేస్తున్నరు'అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్కపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కొంత మంది మిత్రులు ప్రతి దాన్ని రాజకీయం చేస్తరు. అది వారి ఖర్మ. కేంద్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోలేదని అనడం చాలా దుర్మార్గం. ఒక రాజు గారి రాజ్యంలో గత్తర(కలర)తో 50 వేల మంది చనిపోయిన్రు. పెద్ద భూత వైద్యుడున్నడు.. ఈ మహమ్మారిని తరిమేస్తడని సలహా ఇస్తే ఆయన్ని రాజుగారు పిలిపించిండు. ఆ భూతవైద్యుడు ఊరిపొలిమెరళ నుంచి వస్తుంటే భయపడి ఆ మహమ్మారి బయటకు వెళ్లపోసాగింది. ఏమే 50 వేల మందిని సంపినవ్ కదా అన్యాయంగా అని భూతవైద్యుడు అంటే.. లేదు నేను 5 వేల మందినే సంపిన.. మిగిలిన 45 వేల మంది ఉత్తి భయానికే చనిపోయారు అని ఆ మహమ్మారి అందట'అని ఓ కథను ఉదాహరణగా వినిపించారు. మీరంతా సస్తరని బాధ్యత ఉన్నవాళ్లు ప్రజలతో చెప్తరా? అని ప్రశ్నించారు. కేంద్రం చాలా అప్రమత్తంగా ఉండి ఏం చేయాలో అన్ని చేస్తున్నది, 130 కోట్ల మంది ప్రజలు నివసించే దేశంలో అకస్మాత్తుగా అన్ని బంద్ చేస్తే ప్రజలు ఎంత భయపడాలి అని అన్నారు. సీఎం వ్యాఖ్యలకు భట్టి విక్రమార్క అభ్యంతరం వ్యక్తం చేయగా, గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకోవాల్సిన అవసరం లేదని సీఎం సూచించారు. 'శవాల మీద పేలాలు ఏరుకోవద్దని చెప్తున్నం. సమాజాన్ని భయభ్రాంతులను చేయవద్దని చెప్తున్నం. ఎందుకు అనవసరంగా ఓ బస్తీ పేరు, ఓల్డ్ సిటీ పేరు చెప్పి బద్నాం చేయాలి? మేము ఎన్ని చర్యలు తీసుకున్నమో జాబితా చెప్పాలా? విదేశాల నుంచి వచ్చే వారిని కొరెంటైన్ చేయడానికి దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో 150 పడకలు ఏర్పాటు చేసినం, వికారాబాద్ హరిత టూరిజం ప్లాజాలో 30 సూట్స్ తీసుకున్నం. ఇంకా చాలా చాలా తీసుకున్నం. ఇవన్నీ చెప్పి భయభ్రాంతుల్ని చేయాల్సిన అవసరం లేదు. కెనడా ప్రధాని భార్యకు వ్యాధి సోకితే ప్రజలు భయపడ్తరని ఆయన నాలుగైదు రోజుల తర్వాత ప్రకటన చేశారు. ఈ పార్టీ ఆ పార్టీ అని కాకుండా అందరూ అప్రమత్తంగా ఉన్నరు. పంజాబ్, రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉన్నయి. ఒక్కో దేశంలో వందలు వేల మంది చనిపోతున్నరు. అమెరికాలో కిరాణం సామాన్లు దొరకడం లేదని అత్యయిక పరిస్థితి ప్రకటించారు. మన దగ్గర ఇద్దరే చనిపోయారు. 65 మందికే వ్యాధి వచ్చింది. 6 వేల మందికి వచ్చింది అనాలా? 'అని సీఎం ప్రశ్నించారు.



మీడియాతో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో వీరయ్య, రాజగోపాల్‌రెడ్డి

## భూత వైద్యుడిలా మాట్లాడతారేంటి?

- కరోనాపై పిట్ట కథలు చెప్పడం ఆపండి
- వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోమని చెప్తే కాంగ్రెస్‌ను కరోనాతో పోలుస్తారా?
- అలా అన్నందుకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్

**సాక్షి, హైదరాబాద్:** కరోనా (కోవిడ్–19)పై పిట్ట కథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సీఎం కేసీఆర్ ఒక ఆర్ఎంపీ డాక్టర్‌లాగా, భూత వైద్యుడిలా మాట్లాడకూడదని, ఇది నిజ జీవితం.. సినిమా కాదని గ్రహించాలన్నారు. కరోనా మన రాష్ట్రానికి రానే రాదని, పారాసిటమాల్ మాత్ర వేసుకుంటే తగ్గిపోతుందని చెప్పే పిట్ట కథలు మానుకోవాలన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, సీతక్క, పొడెం వీరయ్యలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తాము అసెంబ్లీలో చెప్పడానికి ప్రయత్నిస్తే.. కాంగ్రెస్ పార్టీని సీఎం కేసీఆర్ కరోనా వైరస్‌తో పోల్చి మాట్లాడారని, అసలు ఆయనకు బుద్ధుందా అని ప్రశ్నించారు. సామ్రాజ్యవాదులను గడగడలాడించిన కాంగ్రెస్ పార్టీనుద్దేశించి చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా సోకిన వ్యక్తిని ప్రజా జీవితానికి దూరంగా ఐసోలేషన్ రూంలో ఉంచాలని, అలాంటిది నగరం నడిబొడ్డున గాంధీ ఆస్పత్రిలో ఉంచారని విమర్శించారు. నిజ జీవితం సినిమాలా ఉండదని, బాలకృష్ణ సినిమాలో లాగా తొడగొడితే బిల్డింగులు కూలిపోయినట్టు కాదని ఎద్దేవా చేశారు. కరోనా వైరస్ తెలంగాణలో రావాలంటే గజ్జున వణుకుతుందని కేసీఆర్ చెప్పారని, ఆయన్ను చూసి కరోనా గజ్జున వణికితే డబ్ల్యూహెచ్‌వోకు చెప్పి ప్రపంచ దేశాలు తిప్పుతామని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం మాటలు చెప్తే సరిపోదని, కరోనా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

**ఏం మాట్లాడుతున్నారో అర్థం అవుతుందా..: రాజగోపాల్‌రెడ్డి**

సీఎం కేసీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సోనియాను దేవతతో పోల్చి కాంగ్రెస్ పార్టీని పొగిడిన ఆయన ఇప్పుడు వైరస్ అంటున్నారన్నారు. ఒడ్డు చేరేంత వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు చేరాక బోడి మల్లయ్యలాగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ వైఖరి చూస్తుంటే ఆ రోజు సోనియాను ఒప్పించి తెలంగాణను ఎందుకు తెచ్చామా అనే బాధ కలుగుతోందని, ఉమ్మడి రాష్ట్రంలోనే ఉంటే బాగుండేదని అనిపిస్తోందన్నారు. కేసీఆర్ కుటుంబం కోసమే తెలంగాణ వచ్చినట్టు ఉందన్నారు. కేసీఆర్ తర్వాత కేటీఆర్ ఆయన తర్వాత మనుమడు హిమాన్షు సీఎం అని ప్రచారం జరుగుతోందన్నారు.

**కేసీఆర్ మాటలతోనే ప్రజల్లో అనుమానాలు: సీతక్క**

ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. కరోనా లేదు కాకరకాయ లేదు అని మాట్లాడిన సీఎం కేసీఆర్ ఇప్పుడు కరోనా గురించి చేస్తున్న హడావుడి చూస్తుంటేనే ఏదో జరిగిపోతోందనే అనుమానం ప్రజలకు కలుగుతోందని వ్యాఖ్యానించారు. కరోనాను నియంత్రించాలని సభలో తాను కోరితే గాలి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ వ్యాఖ్యానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మన వ్యవసాయ కేటాయింపులు జాతీయసగటు కంటే ఎక్కువ

**గత ఐదేళ్లుగా మొత్తం పద్దులో 10 శాతం: మంత్రి నిరంజన్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వం గత ఐదేళ్లలో మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో పది శాతాన్ని దీనికే కేటాయించటం గొప్ప పరిణామమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం శాసనసభలో వెల్లడించారు. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. జాతీయ స్థాయిలో వ్యవసాయానికి కేటాయించిన మొత్తం బడ్జెట్ పద్దులో కేవలం 6.5% మాత్రమేనన్నారు. బడ్జెట్ పద్దులపై చర్చ అనంతరం ఆయన సమాధానమిచ్చారు. 'రాష్ట్రంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేటాయింపులు గొప్పగా ఉన్నాయి. నాడు బోరుబావి వేసి బాగుపడినవాడు లేడు, నేడు చెరువుల కింద సాగు చేసి చెడిపోయిన వాడు లేడు. అమెరికాలాంటి అగ్రరాజ్యాల్లో కూడా సాగుకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చిన దాఖలాలు కనిపించవు. సంక్షోభం నుంచి వ్యవసాయరంగాన్ని గట్టెక్కించాలంటే రైతుబంధు అమలు ఉత్తమ మార్గమని నీతిఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ రమేశ్‌చంద్ అన్నారు. పంటల బీమా విషయంలో కేంద్రం చొరవ చూపనందున రాష్ట్ర రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కౌలు రైతులకు కూడా రైతుబంధులాంటిది వర్తింప చేయాలని కొందరు సభ్యులు చేసిన సూచనపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో కౌలు రైతు విధానం స్థిరంగా లేదని, తరచూ కౌలుదారులను మార్చటం వల్ల ఎప్పుడు ఎవరు కౌలు చేస్తారో తెలియని స్థితి ఉంటోంది. మాంద్యాలు వచ్చినప్పుడు తట్టుకునే శక్తి సహకార రంగాలకు ఉంటుంది. కేరళలో అన్ని సహకార సంఘాలకు కలిపి రూ.60 వేల కోట్ల నిధులున్నాయి. తెలంగాణలో అలాంటి పటిష్ట విధానాలను రూపొందించి అంతకు రెట్టింపు నిధులు సమకూరేలా చేసే అవకాశం ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

**దిగుబడి పెరిగితే కొనుగోలు కేంద్రాలు పెంచుతాం..: గంగుల**



రాష్ట్రంలో యాసంగిలో పంట దిగుబడి పెరిగితే పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 3,670గా ఉన్న కొనుగోలు కేంద్రాలను పెంచుతామని ఆ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. 'తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నాం. దళారుల బెడద లేకుండా ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నాం. నిత్యావసర వస్తువుల పంపిణీకి రూ.2,320 కోట్లు కేటాయించాం. ఆధార్‌తో అనుసంధానం వల్ల 18 లక్షల డూప్లికేట్ కార్డుల తొలగించాం' అని తెలిపారు. బొమ్మలరామారం సమీపంలోని ఓ మండలంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే, వారు విశాఖపట్నం నివాసులుగా ఆన్‌లైన్లో చూపుతోందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే సునీత మంత్రి దృష్టికి తెచ్చారు. ఆయన సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్డులు కావాలంటూ 8.44 లక్షల దరఖాస్తులు రాగా 4.45 లక్షల మందికి ఇచ్చినట్టు ఆయన వెల్లడించారు.

**మావోల నియంత్రణలో తెలంగాణ ఆదర్శమని షా అన్నారు: మహమూద్**



మావోయిస్టు సమస్యను నియంత్రించటంలో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలు బాగున్నాయని, మిగతా రాష్ట్రాలు దాన్ని అనుసరించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇటీవల పేర్కొన్నారని హోం మంత్రి మహమూద్ అలీ తెలిపారు. 'రాష్ట్రంలో శాంతి నెలకొల్పడం ద్వారా పెట్టుబడులు భారీగా వచ్చేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ పోలీసు సిబ్బంది 2 రోజుల్లో పూర్తి చేస్తున్నందున కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వెరీ ఫాస్ట్ వెరిఫికేషన్ పురస్కారాన్ని ప్రదానం చేసింది' అని పేర్కొన్నారు. జైళ్లలో చాలాకాలంగా మగ్గుతున్న వయసు మీరిన వారిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాజాసింగ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జైళ్లలో ఖైదీలు వివిధ వస్తువులు రూపొందించి విక్రయించటం ద్వారా మంచి ఆదాయం వస్తోందని మంత్రి తెలిపారు.

## బడ్జెట్ సమావేశాలు కుదింపు!

- 'కోవిడ్' నేపథ్యంలో అసెంబ్లీ షెడ్యూలులో మార్పు?
- నేడు పద్దులపై చర్చ.. రేపు ద్రవ్య వినిమయ బిల్లు



**సాక్షి, హైదరాబాద్:** 'కోవిడ్'పై అనేక ముందు జాగ్రత్తలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలనూ కుదించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ నెల 6న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు 20న ముగియాల్సి ఉంది. కోవిడ్‌పై అసెంబ్లీ కమిటీ హాల్‌లో శనివారం మధ్యాహ్నం సీఎం.. ప్రభుత్వ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం, రాత్రి ప్రగతి భవన్‌లో మంత్రి మండలి సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలను కుదించాలని శనివారం ఉదయమే ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో బడ్జెట్ సమావేశాలను 16వ తేదీతో ముగించాలని నిర్ణయించారు. దీంతో సభ కార్యకలాపాల షెడ్యూలులోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 8న రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2020–21ను ప్రవేశపెట్టారు. 2 రోజుల సాధారణ చర్చ అనంతరం, శుక్ర, శనివారాల్లో శాఖల వారీగా బడ్జెట్ పద్దులపై చర్చలు జరిగాయి. ఇప్పటి వరకు 15 పద్దులపై చర్చించి శాసనసభ ఆమోదించింది. 16 నుంచి 19 వరకు మరో 25 పద్దులపై చర్చించేలా బీఏసీలో తొలుత షెడ్యూలు సిద్ధం చేశారు. తాజాగా సమావేశాలను కుదించాలని నిర్ణయించడంతో 15, 16 తేదీల్లోనే సమావేశాలు జరగనున్నాయి. బీఏసీ షెడ్యూలులో 15న, ఆదివారం విరామం ప్రకటించగా, ప్రస్తుత పరిస్థితుల్లో నేడు కూడా పద్దులపై చర్చిస్తారు. 25 పద్దులకు గాను నీటిపారుదల, విద్య, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్ వంటి కీలక పద్దులకే చర్చను పరిమితంచేసే అవకాశం ఉంది. చర్చకు నోచుకోని మిగతా పద్దులను గిలొటిన్ చేసే అవకాశముంది. 20న ప్రవేశ పెట్టాల్సిన ద్రవ్య వినిమయ బిల్లును 16న ప్రవేశపెట్టి ఆమోదించి, సభను నిరవధిక వాయిదా వేస్తారు.

**సోమవారం మండలి సమావేశం**

ఈ నెల 6 నుంచి 14 వరకు జరిగిన శాసన మండలి.. బీఏసీ నిర్ణయం మేరకు తిరిగి 20న సమావేశం కావాల్సి ఉంది. తాజాగా మండలి షెడ్యూల్లోనూ మార్పులు చేశారు. ఈ నెల 16న సమావేశమయ్యే శాసన మండలి ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించిన తర్వాత నిరవధికంగా వాయిదా పడనుంది. ఈ మేరకు శాసనమండలిని సోమవారానికి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వాయిదా వేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. కాగా బీఏసీ సభ్యుల అభిప్రాయం తీసుకున్నాకే అసెంబ్లీ సమావేశాలను కుదించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాగా, ఆది, సోమవారాల్లో ప్రశ్నోత్తరాలను శాసనసభ నిబంధన 38 కింద రద్దు చేస్తున్నట్టు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు శనివారం రాత్రి బులెటిన్ విడుదల చేశారు.

## చెక్‌డ్యామ్‌లతో 15 టీఎంసీల నిల్వ

- రూ.3,825కోట్లతో 1,200 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం: హరీశ్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కురిసే ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టే లక్ష్యంతో అన్ని వాగులు, వంకలపై రూ.3,825 కోట్లతో 1,200ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తొలి విడతగా 600 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించా రు. ఈ చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో 15 టీఎంసీ నీటి నిల్వ పెరగనుందని, 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని తెలిపారు. శనివారం టీఆర్ఎస్ సభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి, సంకె రవిశంకర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, అవసరమైన ప్రతిచోటా వీటి నిర్మాణాలు జరుగుతాయన్నారు.

**6.62 లక్షల మందికి పింఛన్లు: ఎర్రబెల్లి**

ఆసరా పింఛన్లపై ప్రభుత్వం రూ.11,758 కోట్లు ఖర్చు చేయనుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ప్రస్తుత వార్షిక ఏడాదిలో ఖర్చు చేస్తున్న దానికంటే వచ్చే ఏడాది రూ.2,355 కోట్లు అదనంగా ఖర్చు చేస్తామని వెల్లడించారు. 57 ఏళ్లు పైబడిన వారందరికీ ఏప్రిల్ నుంచి పింఛన్లు అమలు ఇస్తామన్నారు. ఇప్పటికే కొత్తగా 6.62 లక్షల లబ్ధిదారులను గుర్తించామన్నారు. ఆ పింఛన్లలో కేంద్రం వాటా కేవలం రూ.203 కోట్లుగా ఉందనిన్నారు. దివ్యాంగులకు ధ్రువపత్రాలు ఇచ్చేందుకు వీలుగా ప్రతి నియోజకవర్గంలో సదరన్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సభ్యులు చల్ల ధర్మారెడ్డి, కోరుకంటి చందులు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు.

**దోమలు ప్రబలకుండా చర్యలు: ఈటల**

జీహెచ్ఎంసీ పరిధిలో డెంగీ జ్వరంతో 7 మంది మాత్రమే చనిపోయారని ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మూసీ నది పరీవాహకంలోంచే దోమల వ్యాప్తి ఎక్కువగా ఉన్న దృష్ట్యా, ఆయా ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టమన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు. బీజేపీ సభ్యుడు రాజాసింగ్ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ, నగరంలో 350 బస్తీ దవాఖానాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా ఇప్పటికే 122 దవాఖానాలు పనిచేస్తున్నాయన్నారు. ఇక హరిప్రియ నాయక్ అడిగిన మరో ప్రశ్నకు.. కేసీఆర్ కిట్ ద్వారా ఇప్పటికే 6.47లక్షల కుటుంబాలు లబ్ధి పొందాయని చెప్పారు.

## చైనా వెళ్లొచ్చా.. అయితే ఇప్పుడు కాదులే

### మండలి సమావేశాల్లో కోవిడ్ చర్చపై నవ్వులు పూయించిన టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు



ఎగ్గె మల్లేశం

**సాక్షి, హైదరాబాద్:** శాసనమండలిలో శనివారం కరోనా వైరస్‌పై ఆసక్తికర చర్చజరిగింది. స్వల్పకాలిక చర్చలో భాగంగా టీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం కరోనా వైరస్‌పై మాట్లాడుతూ సభలో నవ్వులు పూయించారు. ఆయన స్థానంలో నిలబడి 'నేను చైనా వెళ్లొచ్చాను'అనగానే పక్కనే ఉన్న సహచర ఎమ్మెల్సీలు 'ఎప్పుడూ?'అంటూ ఉలిక్కిపడ్డారు. అయితే వెంటనే ఆయన ''ఇప్పుడే కాదులే మూడు, నాలుగేళ్ల క్రితం వెళ్లొచ్చాను. నిన్న, మొన్న మీతోటే ఉన్న కదా'అని సమాధానం ఇవ్వడంతో సభ్యులంతా గొల్లున నవ్వారు. 'చైనాకు పోయుంటే సక్కగా హాస్పిటల్‌కే పోయేటోడిని'అని మల్లేశం బదులిచ్చారు. తాతల కాలంలో గత్తరొచ్చి పెద్దసంఖ్యలో చనిపోయినట్టు విన్నామే తప్పించి, ఈ విధమైన జబ్బు గురించి ఎన్నడూ వినలేదు. చూడలేదన్నారు. బడ్జెట్ సమావేశాలను కూడా వాయిదా వేస్తారనే అనుమానమొచ్చిందన్నారు. అనంతరం టీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ..ముస్లిం మహిళలు బురఖా ధరించడం వల్ల వారికి కోవిడ్ సోకే అవకాశం లేదని, ఇప్పుడు హిందూ మహిళలు, విద్యార్థినులు కూడా ముఖం కనిపించకుండా చున్నీతో కవర్ చేసుకుంటున్నందున వారికి కూడా అది రాదన్నారు. వారికి గూండాలు, పోకిరీల బెడద కూడా ఈ రకంగా తీరిందన్నారు. తాను పాతబస్తీలో ఒక బట్టలషాపులో వస్త్రాలను పరిశీలిస్తుండగా, ఆ దుకాణం యజమాని తనవద్దకొచ్చి దగ్గుతూ 'కరోనా అంటే ఏమిటి'? అని తనను ప్రశ్నించగానే ఏదో ఫోన్ వచ్చినట్టుగా 'హలో.. హలో'అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయానని ఫారుఖ్‌హుస్సేన్ వ్యాఖ్యానించగానే కౌన్సిల్‌లో నవ్వులు విరిశాయి. సభలో రామచంద్రరావు, చిన్నపరెడ్డి, జీవన్‌రెడ్డి ఇతర సభ్యులు జోరుగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే ఒక్కముక్క కూడా అర్థం కావడం లేదని, రాబోయే రోజుల్లో అందరూ తెలుగు,ఉర్దూలకు దూరమయ్యేట్టు కనిపిస్తోందన్నారు. ఇంతలో కొందరు సభ్యులు ఫారుఖ్‌హుస్సేన్‌ను ఉద్దేశించి 'కరోనాను తెలుగులో ఏమంటారు?'అంటూ ప్రశ్నించడంతో తడుముకోవడం ఆయన వంతైంది.





## అదో పరీక్షా సమయం



చైనా కొత్త సంవత్సరం సంబురాలు జరుపుకుంటున్న వేళ ఉరుము లేకుండా ఒక పిడుగు పడింది. అసలేం జరుగుతోందో అర్థం చేసుకునేలోపు జరగాల్సిన నష్టం జరిగింది. కరోనా సోకిన జియో యోయో అనే యువకుడు వ్యాధిని జయించి సోషల్ మీడియా వేదికగా తన అనుభవాలను పంచుకున్నారు. మొదట్లో దానిని మహమ్మారి అనుకోకపోవడంతో జియో కూడా పట్టించుకోలేదు. జ్వరం, గొంతునొప్పి వచ్చాయి. తర్వాత జ్వరం పెరగడం, శ్వాసకోశ సమస్యలు రావడంతో అతనిలోనూ ఆందోళన పెరిగింది. అప్పుడు అతను తన స్నేహితుడు ఇంట్లో ఉన్నారు. అక్కడున్న పెద్ద వాళ్లకి ఇబ్బంది అవుతుందని హోటల్‌కి వెళ్లిపోయారు. ఒక వారం రోజులు నూడుల్స్‌తో కడుపు నింపుకున్నారు. తినడానికి వేరే ఆహారం కూడా దొరకలేదు. రాత్రిపూట జ్వరం ఎక్కువయ్యేది. గాల్లో ఎగురుతున్నట్టుగా అనిపించేది. అలాగే వారం రోజులు గడిపేశారు. శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తడంతో భయం మొదలైంది. కానీ ఆస్పత్రుల్లో బెడ్స్ ఖాళీ లేవు. చావుకి దగ్గరగా వెళ్లాననే అనుకున్నారు. మొత్తానికి తాత్కాలిక ఆస్పత్రిలో ఒక బెడ్ దొరికింది. దాంతో సగం ప్రాణం లేచి వచ్చింది జియోకి. సెలైన్లు, ఇంజెక్షన్లు, నిరంతరం వైద్యుల పర్యవేక్షణ ఎలాగైతేనేం కరోనా అదుపులోకి వచ్చింది. 20 రోజులు స్నానం చేసే అవకాశం కూడా రాలేదని, ఆస్పత్రిలో ఇచ్చే ఆహారం కూడా తినబుద్ధి కాదని చెప్పుకొచ్చారు. ఎలాగైతే నేం కరోనాని జయించా కానీ, అప్పుడు అనుభవించిన మానసిక ఒత్తిడి నుంచి ఇంకా బయటకు రాలేదు జియో.

## ధ్యానం, డైరీ రాయడమే కాపాడుతోంది



ఏదో పది రోజులు సెలవులు వచ్చాయి కదా ఎంచక్కా పడవెక్కి అమెరికా చూసి రావచ్చనుకొని కెనడా నుంచి కొందరు బయల్దేరారు. గ్రాండ్ ప్రిన్సెస్ క్రూయిజ్‌లో ఎంజాయ్ చేయాలని వెళ్లారు. హవాయి దీవుల నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళుతుండగా ఆ నౌకలో ఉన్నవారిపై కరోనా దాడి చేసిందని తెలిసింది. ఒక్కసారిగా నీరసం ఆవహించేసింది. ఆ నౌకలో కెనడా విక్టోరియాకు చెందిన మహిళ ఒకరు ఉన్నారు. మెలానియా సిబ్బిట్ అనే మహిళ నౌకలో తొలి కరోనా బాధితురాలు. కానీ ఆమె నిరాశా నిస్పృహలకు లోనుకాలేదు. అమెరికాలో ట్రెంటన్ రేవులో నౌకను నిలిపి ఉంచి ఒక్కో అంతస్తులో కొందరిని విడివిడిగా ఉంచారు. మూడు పూటలా ఆహారం, దుస్తులు సరఫరా చేస్తున్నారు. మనిషి ముఖమే కనిపించకపోతే టైమ్ గడవడం లేదని ఎవరికైనా విసుగు వస్తుందేమో కానీ మెలానియా ఎప్పటికప్పుడు తనని తాను ఉత్సాహంగా ఉంచుకోవడానికే ప్రయత్నిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి రోజూ వ్యాయామం, ధ్యానం చేస్తున్నారు. తన రోజువారీ కార్యక్రమాన్ని డైరీగా రాస్తున్నారు. మరో వారం, పది రోజులు మెలానియా ఇతర వ్యాధిగ్రస్తులు నిర్బంధంలో గడపాల్సి ఉంటుంది. ఒక సినిమా హాలులో ఉన్నట్టుంది, లైఫ్‌ని రియల్‌గా ఎంజాయ్ చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ అందరిలోనూ ధైర్యం నింపుతున్నారు మెలానియా.

## రోజూ ఎంత అమ్ముతున్నారు? ఐస్‌క్రీమ్ ఉందా?

### విజయ డెయిరీ స్టాల్‌ను పరిశీలించిన మంత్రి తలసాని



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభ లాబీల్లో ఉన్న విజయ డెయిరీ స్టాల్‌ను పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించారు. శనివారం ప్రశ్నోత్తరాల అనంతరం విరామ సమయం లో ఆయన డెయిరీ అధికారులతో కలిసి విజయ డెయిరీ స్టాల్‌ను సందర్శించారు. ఈ స్టాల్‌లో రోజుకు ఎంత అమ్ముతున్నారు? ఐస్‌క్రీమ్ ఉందా? అని ఆరాతీశారు. ఈ సందర్భంగా స్టాల్ సిబ్బంది రోజుకు రూ.6 వేల విలువైన ఉత్పత్తులు అమ్ముతున్నామని చెప్పారు. అక్కడే ఉన్న విలేకరులు కలుగజేసుకుని రోజుకు అమ్మే రూ.6 వేలలో రూ.3 వేలు మీడియా ప్రతినిధులవేనని సరదాగా మంత్రితో అన్నారు. దీనికి స్పందించిన మంత్రి ఉత్పత్తులు ఎలా ఉన్నాయి? రుచిగా ఉంటున్నాయా? అని విలేకరులను ప్రశ్నించారు. అనంతరం స్టాల్‌లో ఉన్న ఉత్పత్తులను అధికారులతో కలిసి సేవించిన తలసాని.. ఔట్‌లెట్ నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## 'సీఏఏను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలి'

**సాక్షి, హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టంతో పాటు ఎన్‌ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ డిమాండ్‌చేసింది. కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని గొంతెత్తి ఖండించిన కేసీఆర్ ప్రభుత్వం మరోవైపు ప్రశ్నించే వివిధ వర్గాల ప్రజల గొంతుకలను నొక్కడం ద్వంద్వ ప్రమాణాలతో కూడుకున్నదని పార్టీ నేతలు డీవీ కృష్ణ, పోటు రంగారావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఢిల్లీలో దమనకాండ, విధ్వంసకాండకు నిరసనగా ఈ నెల 16నుంచి 30 వరకు వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

## మంత్రి వేములకు జన్మదిన శుభాకాంక్షలు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి శనివారం అసెంబ్లీ వేదికగా సీఎం కె.చంద్రశేఖర్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో వేములను సీఎం ఆలింగనం చేసుకుని జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో పోచారం, గుత్తా సుఖేందర్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, ప్రభుత్వ చీఫ్ విప్‌లు వినయ భాస్కర్, బోడకుంటి వెంకటేశ్వర్లు మిఠాయిలు తినిపించి వేములకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శాసనసభ ఆవరణలో ఆయన్ను కలిసిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలపై భారాలు మోపుతారా?: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** ఇప్పటికే ఆర్థికమాంద్యం కారణంగా తీవ్ర సమస్యలతో సతమతమవుతున్న ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారాలు మోపడం సరికాదని సీపీఐ అభిప్రాయపడింది. త్వరలో విద్యుత్‌చార్జీలు, ఆస్తిపన్ను పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించగా, పెట్రోల్, డీజిల్‌లపై కేంద్రం రూ.2 నుంచి 8 వరకు ఎక్సైజ్ సుంకాన్ని పెంచడాన్ని ఆ పార్టీ ఒక ప్రకటనలో తప్పుబట్టింది. వాస్తవిక బడ్జెట్‌ను పెట్టామంటూ ప్రజలపై భారాలు మోపడం దారుణమని, అన్ని ఎన్నికలు ముగిశాక చార్జీలు, పన్నులు పెంచడం ప్రభుత్వం మోసగించే తత్వానికి నిదర్శనమని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. చార్జీల పెంపుదలపై సీఎం చేసిన ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## పెంపు యోచనొద్దు: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** ఆస్తిపన్ను, విద్యుత్ చార్జీలు పెంచాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్ చార్జీలతో పాటు ఆస్తిపన్ను పెంచుతామన్న సీఎం కేసీఆర్ ప్రకటనను బట్టి ప్రజలపై మరిన్ని భారాలు మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు స్పష్టమైందని ఒక ప్రకటనలో తెలిపింది. ఉన్నత ఆదాయ వర్గాలపై పన్నులు వేయకుండా ఇళ్ల ఆస్తిపన్ను, మధ్యతరగతి వర్గం, చిన్నవ్యాపారులపై పన్నుల భారం మోపడం సరికాదని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. చార్జీలు పెంచకుండా విద్యుత్ సరఫరా మెరుగుదల ద్వారా ఆంతరంగిక పని మెరుగుదల ద్వారా నష్టాల నుంచి బయటపడొచ్చునని సూచించారు.

### మార్క్స్ 137వ వర్ధంతి

కారల్ మార్క్స్ 137వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతలు ఘనంగా నివాళులర్పించారు. మానవజాతి ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం చూపేది కమ్యూనిస్ట్ ప్రణాళికనేనని పేర్కొన్నారు. శనివారం ఎంబీభవన్‌లో మార్క్స్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ మార్క్స్ ఈ ప్రపంచానికి దోపిడీ వ్యతిరేక సిద్ధాంతాన్ని అందించిన మహాపురుషుడని, దోపిడి, పీడన, కులాల అంతరాలు లేని సమాజాన్ని సృష్టించాలంటే మార్క్సిజం–లెనినిజం తప్ప మరో మార్గం లేదని అన్నారు. సమావేశంలో సారంపల్లి మల్లారెడ్డి, మిడియం బాబూరావు, డీజీ నరసింహారావు, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.

## నేటి బీజేపీ ర్యాలీ రద్దు

### కోవిడ్ నేపథ్యంలో రద్దుకు నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన బండి సంజయ్‌కుమార్ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఈనెల 15న మధ్యాహ్నం నిర్వహించతలపెట్టిన బైక్ ర్యాలీని రద్దు చేసుకున్నారు. కోవిడ్ వైరస్ నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి తలపెట్టిన భారీ బైక్ ర్యాలీని నిర్వాహకులు రద్దు చేశారు. కోవిడ్ ఎఫెక్ట్ విషయంలో ఢిల్లీ పెద్దల సూచన మేరకు ర్యాలీని రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంజయ్ నేరుగా పార్టీ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారని, అనంతరం పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడనున్నారని తెలిపారు. కాగా, బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సంజయ్.. తనను కలిసేందుకు వచ్చే వారు బొకేలు, శాలువాలు తీసుకు రావద్దని అభిమానులకు సూచించారు. అదే డబ్బుని బైంసా బాధితుల కోసం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హుండీలో వేయాలని సూచించినట్లు కార్యకర్తలు తెలిపారు.

# రూ. 24,577 కోట్లు.. 2,253 పరిశ్రమలు..



### గతేడాది 9 నెలల్లో భారీ పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు

### అవి పూర్తయితే 1,70,888 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు..

### ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు డిమాండ్ అధికం

*తెలంగాణ పారిశ్రామిక విధానం 'టీఎస్ ఐపాస్'ద్వారా 9 నెలల వ్యవధిలో రాష్ట్రానికి రూ.24,577 కోట్ల పెట్టుబడులతో 2,253 పరిశ్రమలొచ్చాయి. ఈ పరిశ్రమల ఏర్పాటు పూర్తయితే 1,70,888 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయని ఈ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఏడాదిన్నరగా తీవ్ర ఆర్థిక మాంద్యం నెలకొని ఉన్నా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై ఎలాంటి ప్రభావం పడకపోవడం గమనార్హం. కేటగిరీల వారీగా పరిశీలిస్తే.. అత్యధిక సంఖ్యలో వరుసగా ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత, సిమెంట్, కాంక్రీట్ ఉత్పత్తులు, బూడిద ఇటుకులు, గ్రానైట్, స్టోన్ క్రషింగ్, ప్లాస్టిక్ అండ్ రబ్బర్ ఉత్పత్తుల పరిశ్రమలు అత్యధిక సంఖ్యలో వచ్చాయి. వీటిలో రూ.712.58 కోట్ల పెట్టుబడులతో 437 ఇంజనీరింగ్ పరిశ్రమలు అగ్రస్థానంలో నిలిచాయి. ఇక ఇవి ఏర్పాటైతే 9,186 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.* – సాక్షి, హైదరాబాద్

### 6,23,071 మందికి ఉద్యోగాలొచ్చాయి

ఇక టీఎస్ ఐపాస్ ద్వారా గత ఐదేళ్లలో రూ.1,84,655.44 కోట్ల పెట్టుబడులతో మొత్తం 11,857 పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ పరిశ్రమల ఏర్పాటు పూర్తయి ఉత్పత్తి ప్రారంభమైతే 13,08,056 మందికి ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. గత డిసెంబర్ 31 నాటికి రూ.85,125.83 కోట్ల పెట్టుబడులతో 9,020 పరిశ్రమల ఏర్పాటు పూర్తి కావడంతో 6,23,071 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. రూ.28,116.96 కోట్ల పెట్టుబడులతో చేపట్టిన మరో 764 పరిశ్రమలు తుదిదశలో ఉండగా, వీటి నిర్మాణం పూర్తయితే 2,87,112 మందికి కొత్తగా ఉద్యోగాలు లభించనున్నాయి. రూ.51,023 కోట్ల పెట్టుబడితో వచ్చిన 1,428 పరిశ్రమల ఏర్పాటు ప్రారంభ దశలో ఉంది. వీటి ఏర్పాటు పూర్తయితే మరో 2,57,323 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. అనుమతులు పొందిన పరిశ్రమల్లో ఇంకా 1,428 పరిశ్రమలు ప్రారంభం కాలేదు. రూ.20,388.85 కోట్ల పెట్టుబడులతో వచ్చిన పరిశ్రమలు ఏర్పాటైతే 1,40,550 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

### భారీగా పెరిగిన ఎగుమతులు

ఇక రాష్ట్రం నుంచి వస్తు సేవల ఉత్పత్తుల ఎగుమతులు గతేడాది భారీగా పెరిగాయి. 2017–18లో రూ.1,35,783 కోట్లు విలువ చేసే ఎగుమతులు జరగ్గా, 2018–19లో రూ.1,59,729 కోట్లకు ఎగబాకాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ స్టాటిస్టిక్స్ గణాంకాల ప్రకారం 2015–16లో రూ.35,444 కోట్లు విలువ చేసే వస్తు ఎగుమతులు జరగ్గా, 2018–19లో రూ.50,510 కోట్లకు పెరిగాయి. అంతకుముందు ఏడాదితో పోల్చితే 2018–19లో జరిగిన వస్తు ఎగుమతుల్లో 12.5 శాతం వృద్ధి కనబడింది.

### టీఎస్ ఐపాస్ కింద వచ్చిన వివిధ రంగాల పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగావకాశాల వివరాలు..

| విభాగం | పరిశ్రమల సంఖ్య | పెట్టుబడులు (రూ.కోట్లలో) | ఉపాధి పొందే వారి సంఖ్య |
|---|---|---|---|
| ఇంజనీరింగ్ | 2,422 | 3,476.63 | 45,736 |
| ఫుడ్ ప్రాసెసింగ్ | 1,839 | 4,505.37 | 50,586 |
| వ్యవసాయ ఆధార | 1,314 | 1,802.21 | 23,368 |
| సిమెంట్, కాంక్రీట్ ఉత్పత్తులు | 1,016 | 2,791.57 | 13,856 |
| గ్రానైట్ అండ్ స్టోన్ క్రషింగ్ | 1,000 | 3,738.93 | 19,871 |
| ప్లాస్టిక్ అండ్ రబ్బర్ | 869 | 3,201.57 | 23,897 |
| ఫార్మా, రసాయన | 796 | 10,861.35 | 64,646 |
| పేపర్ అండ్ ప్రింటింగ్ | 439 | 3,142.24 | 10,614 |
| టెక్స్‌టైల్స్ | 410 | 2,150.64 | 1,96,702 |
| బేవరేజెస్ | 362 | 2,016.58 | 8,727 |
| ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ | 270 | 1,869.22 | 17,121 |
| పరిశోధనలు, అభివృద్ధి | 223 | 4,435.12 | 27,765 |
| సోలార్, ఇతర పునరుత్పాదక ఇంధన | 204 | 17,519.28 | 7,642 |
| ఇతర పరిశ్రమలు | 195 | 3,151.34 | 23,975 |
| స్థిరాస్తి, పారిశ్రామిక పార్కులు, ఐటీ భవనాలు | 161 | 37,667.68 | 7,21,425 |
| కలప, తోలు | 189 | 105.07 | 3,176 |
| ఎరువులు, పురుగుల మందులు | 96 | 13,904.17 | 4,441 |
| ఆటోమొబైల్ | 23 | 1,354.73 | 3,423 |
| థర్మల్ విద్యుత్ ప్లాంట్లు | 16 | 61,374.41 | 12,760 |
| ఏరోస్పేస్, డిఫెన్స్ | 8 | 2,838.33 | 5,775 |
| ఐటీ సేవలు | 4 | 2,479.60 | 22,150 |
| రక్షణ పరికరాలు | 1 | 268.22 | 400 |
| మొత్తం | 11,857 | 1,84,655.44 | 13,08,056 |

# నిర్మాణ పనులకు బ్రేక్!

- సివిల్ వర్క్స్ చెల్లింపులు వద్దంటూ సంక్షేమ శాఖలకు ఆదేశాలు
- వసతి గృహాల బిల్లులు క్లియర్ చేసుకోవాలని ఆర్థికశాఖ సూచనలు
- వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే పెండింగ్ పనుల పూర్తికి అనుమతి
- నిలిచిపోనున్న 51 గురుకుల స్కూళ్ల నిర్మాణాలు, పలు హాస్టళ్ల మరమ్మతులు




**సాక్షి, హైదరాబాద్:** సంక్షేమ శాఖల్లో తలపెట్టిన నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. వార్షిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో సివిల్ వర్క్స్ చెల్లింపులపై ఆర్థికశాఖ ఆంక్షలు విధించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రాధాన్యత కార్యక్రమా లకు మాత్రమే నిధులు విడుదల చేస్తున్న క్రమంలో నిర్మాణ పనుల చెల్లింపులను వాయిదా వేసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో సంక్షేమ శాఖల ద్వారా కొనసాగుతున్న నిర్మాణ పనులు కొంతకాలం నిలిచిపోనున్నాయి. ప్రస్తుతం సంక్షేమ శాఖల్లో గురుకుల పాఠశాలల నిర్మాణాలు, వసతిగృహాల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వాస్తవానికి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో చేపట్టిన 51 గురుకుల పాఠశాలల నిర్మాణ పనులు ఈ పాటికే పూర్తికావాలి. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనుల్లో వేగం లేక కాస్త మందగించాయి. తాజా ఆంక్షల నేపథ్యంలో ఈ పనులు మరికొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. అలాగే ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకుంటే వాటిని మరికొంత కాలం అదే స్థితిలో ఉంచాలని ప్రభుత్వం స్పష్టంచేసింది.

### నిలిచిపోనున్న చెల్లింపులు

ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో మండలాలు, డివిజన్ కేంద్రాల్లో అంబేడ్కర్ భవనాలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నారు. కొన్ని పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మిస్తుండగా.. మరికొన్ని ఎస్సీడీడీ ద్వారా చేపడుతున్నాయి. వీటి నిర్మాణ పనులు ఏడాది కాలంగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ల ఎంపిక, ప్రభుత్వ అనుమతులు రావడంలో జాప్యం కావడంతో నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఆర్థిక శాఖ ఆంక్షల నేపథ్యంలో ఈ పనులకు చెల్లింపులు నిలిచిపోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 62 భవనాల నిర్మాణాలకు బిల్లులు చెల్లింపులు నిలిచిపోనున్నాయి. ఇక వసతి గృహాల్లో డైట్ చార్జీలు, ఇతర బిల్లులను త్వరితంగా క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో ఆయా వసతిగృహ సంక్షేమాధికారులు తక్షణమే బిల్లులు సమర్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇటు ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలను కూడా వీలైనంత మేర క్లియర్ చేయాలని ప్రభుత్వం సూచించింది. గురుకుల పాఠశాలలకు సంబంధించిన చెల్లింపుల్లో మాత్రం వేగం పెంచారు. ప్రస్తుతం సివిల్ పనులకు సంబంధించి చెల్లింపులను నిలిపివేసినప్పటికీ.. వచ్చే వార్షిక సంవత్సరంలో వాటికి క్లియరెన్స్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. 2020–21 వార్షిక సంవత్సరం బడ్జెట్ ప్రకారం నిర్మాణ పనులకు ఢోకా లేదని పేర్కొంటున్నారు.

# సీఏలకు చేతి నిండా పని

### జీఎస్టీతో పెరిగిన డిమాండ్

- చార్టర్డ్ అకౌంటెంట్స్ వద్దకు డీలర్ల క్యూ
- గతంలో కంటే రెండింతలు పెరిగిన ఆదాయం
- ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు



**సాక్షి, హైదరాబాద్:** చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు చేతినిండా పని దొరుకుతోంది. జీఎస్టీతో సీఏలకు గిరాకీ లభిస్తోంది. జీఎస్టీ రాక ముందుతో పోలిస్తే ఇటీవల డిమాండ్ బాగా పెరిగింది. గతంతో పోలిస్తే వేతనాలు కూడా రెండింతలయ్యాయి. సీఏలకు మంచి అవకాశాలు లభిస్తుండటంతో విద్యార్థులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. జీఎస్టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వెసులుబాటు ఉంటుంది. ఈ మినహాయింపుతోనే డీలర్లకు ఎంతో లాభం చేకూరుతుంది. ముడి సరుకు సప్లయిదారు నుంచి రిటైలర్ దాకా అందరూ జీఎస్టీ వ్యవస్థలో భాగస్వాములైతేనే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. కానీ వీటికి లెక్కలన్నీ సక్రమంగా చూపించాల్సి ఉంటుంది. అయితే గతంలో వ్యాట్ ఉన్న సమయంలో రిటర్న్స్ ఫైల్ చేయడం సులభంగా ఉండేది. జీఎస్టీ వచ్చాక ఇది అందరికీ సాధ్యం కావడం లేదు. జాగ్రత్తగా ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఫైలింగ్‌లో ఎలాంటి తప్పులున్నా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌పై ప్రభావం పడుతుంది. అంతేకాకుండా గతంలో వ్యాట్ ఉన్నప్పుడు పేమెంట్ చేయకున్నా ఫైల్ అయ్యేది. కానీ జీఎస్టీలో పేమెంట్ చేస్తేనే ఫైల్ అవుతోంది. సీఏలకు డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణం జీఎస్టీ చట్టం తీసుకురావడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. కంపెనీల చట్టంలో ఎప్పటికప్పుడు కొత్త మార్పులు చేస్తుండటంతో వ్యాపార సంస్థలు విధానపరంగా నడుచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఏల అవసరం పెరిగింది.

**రెట్టింపు జీతాలు..**

గతంలో బ్యాంకులు, ప్రభుత్వ శాఖల్లో ఆడిటింగ్ సంబంధిత శాఖల వారే చేసేవారు. అయితే బ్యాంకులు, ప్రభుత్వ శాఖల్లో చార్టెర్డ్ అకౌంటెంట్స్‌తో ఆడిటింగ్ జరిగే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీఎస్టీతో సీఏల అవసరంతో పాటు జీతాలు కూడా పెరిగాయి. కొత్తగా వస్తున్న సీఏలకు వార్షిక ఆదాయం రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఉంటోంది. సీనియారిటీ ఉన్నవారు ఆయా కంపెనీని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు తీసుకుంటున్నారు. ఇక గతంలో రిటర్న్స్ ఫైల్ చేయడానికి 2,050 మంది డీలర్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 1,00,300 మంది ఉన్నారని సీఏలు పేర్కొంటున్నారు. ఇలా ఒక్కో డీలర్ వద్ద సగటున ఏడాదికి రూ.30,000 నుంచి రూ.40,000 దాకా తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న ఆసక్తి..**

ప్రపంచంలో వ్యాపార, వాణిజ్య రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సీఏల అవసరం పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ఈ కోర్సును పూర్తి చేసినవారు లేరని తెలుస్తోంది. దీంతో ఇటీవల కాలంలో సీఏ చేసేవారి సంఖ్య పెరిగిందని దేశంలోని ప్రొఫెషనల్ అకౌంటింగ్ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వెల్లడించింది. మహిళలు కూడా చార్టెర్డ్ అకౌంటెంట్ కోర్సుల పట్ల మక్కువ చూపుతున్నారని, ఇటీవల సీఏ కోర్సుల్లో 45 శాతం మంది విద్యార్థినులు ఉన్నారని తెలిపింది.

### జీఎస్టీతో ఇబ్బందులు: గౌతమ్, సీఏ

గతంలో వ్యాట్ ఉన్న సమయంలో రిటర్న్స్ ఫైల్ ఈజీగా ఉండేది. జీఎస్టీ వచ్చాక ఇది ఇబ్బందిగా మారింది. ఇప్పుడు ఫైల్ చేయడం కఠినంగా ఉంటుంది. జాగ్రత్తగా ఫైల్ చేయాలి. సర్వర్ ట్రబుల్ ఇస్తుంది. ఫైల్ అప్‌లోడ్ కాదు. వ్యాట్ ఉన్నప్పుడు పేమెంట్ చేయకుండా ఫూల్ అయ్యేది. కానీ జీఎస్టీలో మాత్రం పేమెంట్ అయితేనే ఫైల్ అప్‌లోడ్ అవుతుంది.

### గిరాకీ పెరిగింది: టీవీ సుబ్బారావు, సీఏ

జీఎస్టీ రాకతో సీఏలకు డిమాండ్ పెరిగింది. రిటర్న్స్ కోసం డీలర్లు.. సీఏలను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఒక్క సీఏకు 20 నుంచి 50 మంది డీలర్లు మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం 300 మంది దాకా ఉంటున్నారు. దీంతో చేతినిండా పని దొరుకుతోంది. ఒక్కో డీలర్ వద్ద ఒక్కో విధంగా పేమెంట్ తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఆదాయం బాగానే ఉంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.షష్ఠి ఉ.10.44 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం అనూరాధ సా.5.22 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం రా.10.48 నుంచి 12.21 వరకు దుర్ముహూర్తం సా.4.29 నుంచి 5.16 వరకు, అమృతఘడియలు... ఉ.7.23 నుంచి 9.43 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం : 6.05
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఇమ్రాన్ ఖాన్ (పాక్ ప్రధాని)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

సీరియస్‌గా ఒక పనిలో ఉన్నప్పుడు, మనకు బాగా దగ్గరి వాళ్లెవరో నాన్‌–సీరియస్ పనొకటి చేసి మన మూడ్‌ని చెడగొట్టేస్తారు.

మిడతల బెడదపై ముఖ్యమైన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నప్పుడు నా మూడ్ పాడైంది.

"చూశారా మసూద్ అజార్ ఏం చేశాడో!" అన్నాను తలపట్టుకుని.

"ఇమ్రాన్‌జీ.. స్క్రీన్ మీద మీరు తలపట్టుకోవడం కనిపిస్తోంది కానీ, మీరెందుకు తలపట్టుకున్నదీ వినిపించడం లేదు" అన్నారు మఖ్దూమ్ ఖుస్రో భక్తియార్. ఫుడ్ సెక్యూరిటీ మినిస్టర్ ఆయన.

"అవును ఇమ్రాన్‌జీ.. నాకైతే మీరు తలపట్టుకోవడం కూడా సరిగా కనిపించడం లేదు. మా స్క్రీన్ మీద మీ పిక్చర్ బ్రేక్ అవుతోంది" అన్నారు డాక్టర్ అబ్దుల్ హాఫీస్ షేక్. ఫైనాన్స్ అడ్వైజర్ ఆయన.

నా పక్కనే ఉన్న డాక్టర్ ఫిర్దోజ్ ఆషిక్ అవాన్ వైపు చూశాను. ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్‌లో నా ప్రత్యేక సలహాదారు ఆమె.

"మేడమ్ ఫిర్దోజ్.. అవతలి వైపు స్క్రీన్‌ల మీద మీకు మన ఫుడ్ సెక్యూరిటీ మినిస్టర్, మన ఫైనాన్స్ అడ్వైజర్ కనిపిస్తున్నారా?" అని అడిగాను. "హా.. కనిపిస్తూనే ఉన్నారు కదా ఇమ్రాన్ జీ" అన్నారు ఆమె.

"మరి ఇక్కడున్న ప్రైమ్ మినిస్టర్ వాళ్లకెందుకు కనిపించడం లేదు" అని అడిగాను ఆశ్చర్యపడుతూ.

"కాదు కాదు ఇమ్రాన్‌జీ. మీరు కనిపిస్తూనే ఉన్నారు. కానీ సరిగా కనిపించడం లేదని మాత్రమే మేం అంటున్నాం. మీ పక్కన ఉన్న మీ ఇన్ఫర్మేషన్ అడ్వైజర్ మేడమ్ ఫిర్దోజ్‌ని కూడా మేము చూడగలుగుతున్నాం" అన్నారు



అటువైపు నుంచి ఫుడ్ సెక్యూరిటీ మినిస్టర్, ఫైనాన్స్ అడ్వైజర్.

వాళ్ల వైపు చూశాను.

"నేననుకోవడం నా కన్నా కూడా మేడమ్ ఫిర్దోజ్‌నే మీరు స్పష్టంగా చూడగలుగుతున్నారని. నేను ఇంకొకటి కూడా అనుకుంటున్నాను మిస్టర్ మినిస్టర్ అండ్ మిస్టర్ ఫైనాన్స్ అడ్వైజర్. మేడమ్ ఫిర్దోజ్ నా పక్కన ఉన్నందు వల్లనే మీరు ఆ మాత్రమైనా నన్ను చూడగలుగుతున్నారని.." అన్నాను.

ఫిర్దోజ్ ఇబ్బందిగా కదిలారు.

"ఉండండి.. రెండు నిమిషాల్లో స్క్రీన్‌లన్నీ సెట్ చేస్తాను" అని పైకి లేచారు.

"మీరు కూర్చోండి మేడమ్ ఫిర్దోజ్. ఈ ప్రపంచంలో రెండు నిమిషాల్లో ఏదీ సెట్ కాదు. సెట్ అయిందీ అంటే, తనంతటదే సెట్ అయిందనే కానీ, మనమేదో సెట్ చేసినందు వల్ల అయిందని కాదు. కరెంటు పోతుంది. మనం సెట్ చేస్తామా! దానంతటదే కదా వచ్చేస్తుంది" అన్నాను.

"వావ్!!" అన్నారు ఫిర్దోజ్.

"దేనికి వావ్ అన్నారు మేడమ్ ఫిర్దోజ్" అన్నాను.

"స్క్రీన్‌లన్నీ సెట్ అయ్యాయి" అన్నారు. అటువైపు స్క్రీన్‌ల మీద బొటనవేలెత్తి చూపిస్తున్నారు.. సెట్ అయింది అన్నట్లు.

"చూశారా మసూద్ అజార్ ఏం చేశాడో! అజార్ మిస్సింగ్ అని నేను ప్రపంచాన్ని నమ్మిస్తే, ప్రపంచానికి అతడు ఆడియో మెసేజ్ రిలీజ్ చేశాడు! వెల్‌డన్ తాలిబన్ అంటాడు. తాలిబన్‌ల నుంచి తప్పించుకోడానికే అమెరికా ఒప్పందం చేసుకుంది అంటాడు. అవసరమా మనకిప్పుడీ వెల్‌డన్‌లు, తాలిబన్‌లు" అన్నాను.

"నిజమే ఇమ్రాన్‌జీ. దేశం మిడతల సమస్యలో ఉన్నప్పుడు మసూద్ అజార్ కూడా ఒక మిడతలా సమస్య అవడం కరెక్టు కాదు" అన్నారు ఫుడ్ సెక్యూరిటీ మినిస్టర్.

"చైనా నుంచి లక్ష బాతుల్ని తెప్పిస్తున్నాం ఇమ్రాన్‌జీ. ఒక్కో బాతు రోజుకు రెండొందల మిడతల్ని తినేస్తుంది. అది పెద్ద ఇష్యూ కాదు" అన్నారు ఫైనాన్స్ అడ్వైజర్.

బాతులు మిడతల్ని తినేస్తే పర్వాలేదు. మిడతలే బాతుల్ని తరిమికొట్టి, మసూద్ అజార్‌లా ఏదైనా మెసేజ్ ఇస్తే?!!

# భయానకం కాదు, మనోహరం

జనతంత్రం



వర్ధెల్లి మురళి



కురుక్షేత్ర యుద్ధంలో దుశ్శాసనుని గుండెలు చీల్చిన భీముడు వేడి నెత్తురును దోసిట పట్టి ద్రౌపది కురులకు అలంకరించి ముడివేసిన దృశ్యం భయానకంగానే కనిపించవచ్చు. కానీ, అదే దుశ్శాసనుడు అంతఃపురంలో వున్న ద్రౌపదిని జుట్టు పట్టుకొని బరబరా ఈడ్చుకుంటూ నిండు రాజసభలోనికి లాక్కొని వచ్చి వలువలూడ్చిన వీడియోను కూడా ప్లే చేస్తే పై దృశ్యం మనోహరంగానే కనిపిస్తుంది.

భీమసేనుడి గదాఘాతాలతో తొడలు విరుగుతున్నప్పుడు దుర్యోధనుడు చేసిన ఆర్తనాదం కర్ణకఠోరంగానే వినబడి ఉండవచ్చు. కానీ, తన స్వార్థం కోసం మారణహోమానికి కారకుడైన ఒక అసూయాపరుడు చేసిన హాహాకారమని తెలిసినప్పుడు ఆ శబ్దం శ్రవణానందమే అవుతుంది.

సత్యం సాపేక్షమయినప్పుడు సంఘటన వృత్తాంతం పూర్తిగా తెలిస్తేనే నిజం నిగ్గు తేలుతుంది.

మాచర్లకు వెళ్తున్న తెలుగుదేశం నాయకుల కారును ఒక వ్యక్తి కర్రతో పొడుస్తున్న సీన్ టీవీలో పదేపదే కనిపించి కలవరాన్ని కలిగించింది. కానీ టీడీపీ నాయకులు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోని ఒక కారు విసురుగా, దురుసుగా, ఓవర్‌స్పీడ్‌తో వెళుతూ ఒక దివ్యాంగ బాలుడ్ని ఢీకొట్టి ఆగకుండా నిర్దయగా వెళ్లిపోతున్నదని తెలిసినప్పుడు, కారు నడిపిన మనుషులను వదిలేసి కేవలం అద్దాలనే పగులగొడుతున్నాడేమిటని సదరు వ్యక్తిపై కించిత్ ఆగ్రహం కూడా కలిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల ఘట్టం పూర్తయింది. ఎన్నికల మేనిఫెస్టోలో సింహభాగాన్ని ఇప్పటికే అమలు చేసిన కారణంగా పాలక పార్టీ దూకుడుగా ఉన్నది. ప్రతిపక్షానికి బెంగగా ఉన్నది. ఇక్కడ ప్రతిపక్షం అంటే చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్లస్ ఎల్లో మీడియాగా అపఖ్యాతి పొందిన రెండు మూడు ప్రధాన పత్రికలు, అరడజన్ న్యూస్ చానళ్లు, నాలుగు డజన్ల ఔట్‌సోర్సింగ్ వెబ్ ఎడిషన్లు, నెలజీతంపై పనిచేస్తున్న రెండువేల మందితో కూడిన సోషల్ మీడియా ఆర్మీ. ఇంతమాత్రమే కాదు. వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీల్లో, రాజ్యాంగ వ్యవస్థల్లో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన స్లీపర్‌సెల్స్, అజ్ఞాతవాసంలో పాండవులు విరాటరాజు కొలువులో దాక్కున్నట్టుగా, బీజేపీ పంచన దాచిపెట్టిన 'దేశం' మిత్రపక్షం జనసేన పార్టీ వగైరాలంతా ప్రస్తుతం ప్రతిపక్షంగా లెక్క. చంద్రబాబు పల్లవి పాడగానే ఈ ఊడలన్నీ కోరస్ అందుకుంటాయి. ప్రస్తుతం ఈ బృందం ఆలపిస్తున్న పాట సారాంశం... ''నామినేషన్ల ఘట్టం భయానకంగా ముగిసింది. ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారు. అధికార దుర్వినియోగం జరుగుతున్నది. ప్రభుత్వ యంత్రాంగం పాలక పార్టీకి సహకరిస్తున్నది.''

వాస్తవానికి మున్నెన్నడూ లేనంత ప్రశాంతంగా, ఎక్కడా హడావుడి లేకుండా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. మామూలుగా ఎన్నికల సందర్భంగా జరిగే అల్లర్లు కూడా ఈసారి బాగా తగ్గి స్వల్పంగా చెదురుమదురు ఘటనలు మాత్రమే జరిగాయి. మద్యాన్ని, డబ్బును ఓట్ల కోసం ఎరవేయడంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో ఈ మార్పు సాధ్యమైంది. ఈ పరిణామాన్ని ప్రతిపక్షం, మీడియా స్వాగతించి ఉండవలసింది. అలా చేసి వుంటే ప్రజాస్వామ్యం బలపడి ఉండేది. కానీ, అలా చేస్తే చంద్రబాబు పెంచి పోషించిన తరహా రాజకీయం బలహీనపడుతుంది. ప్రలోభాలు, అవకాశవాదమే ఆయన తరహా రాజకీయం. అవే ఆయనను ఇంతటి వాడిని చేశాయి. రాజకీయాల్లో వాటికి తావులేకుండా చేస్తే ఇన్నాళ్ల చంద్రబాబు రాజకీయ జీవితం పునాదులే కుప్పకూలుతాయి. ప్రస్తుత ప్రభుత్వంపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలన్నింటిపై పేటెంట్ హక్కు ఆయనదే. ఎన్నికల వ్యవస్థలో ఓట్ల కొనుగోలును ఆయనే కళాత్మక విద్యగా మార్చారు. చివరకు ప్రభుత్వ ఖజానాతోనే ఓట్లను కొనుగోలు చేసే సృజనాత్మకశైలిని కూడా మొన్నటి ఎన్నికల్లో ప్రవేశపెట్టారు. అధికార దుర్వినియోగంలో కొత్త శిఖరాలను అధిరోహించడం పాతికేళ్ల కిందటనే ఆయన ప్రారంభించారు. యువతరానికి తెలియకపోవచ్చు కానీ, పాత తరం వాళ్లకు బాగా గుర్తు. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కడప నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని ఓడించడానికి చంద్రబాబు ప్రభుత్వం చేసిన అధికార దుర్వినియోగాన్ని చూసి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నివ్వెరపోయింది. నియంతల రాజ్యంలో మొక్కుబడి ఎన్నికలు జరిపే తంతులో జరిగింది నాటి కడప ఎన్నిక. అప్పుడు జిల్లా ఎస్పీగా ఉన్న ఉమేశ్‌చంద్ర తానే వైఎస్సార్‌కు రాజకీయ ప్రత్యర్థిని అన్నట్టుగా చెలరేగిపోయారు. వైఎస్ ముఖ్య అనుచరులందరినీ బైండోవర్ కేసుల్లో ఇరికించి పూర్తిగా కట్టడి చేశారు. పోలీసులు జిల్లాల్లో టెర్రర్ వాతావరణాన్ని క్రియేట్ చేశారు. రిగ్గింగ్ చేస్తారనే ఆరోపణలు మోపి పోలింగ్‌కు రెండు మూడు రోజుల ముందుగానే కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి కార్యకర్తలను, నాయకులను అరెస్ట్ చేశారు. తెలుగుదేశం పార్టీ వాళ్లను కొంతమందిని వ్యూహాత్మకంగా అజ్ఞాతంలోకి పంపి వైఎస్ అనుచరులే వారిని నిర్బంధించారని హైకోర్టులో హెబియస్ కార్పస్ కేసులు వేయించారు. ఫలితంగా కీలకమైన ప్రచార ఘట్టంలో పాల్గొనకుండా వైఎస్ పలుమార్లు హైదరాబాద్‌కు కేసుల నిమిత్తం వెళ్లవలసి వచ్చింది. ధనప్రవాహం, ప్రలోభాల పర్వం ఆనాటికి కనీవినీ ఎరుగని స్థాయిలో నడిచాయి. అనేక గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఏజెంట్లు కూడా కూర్చోలేని స్థాయిలో స్వయంగా పోలీసులే భీతావహ వాతావరణాన్ని సృష్టించారు. వైఎస్ గెలుపును అడ్డుకోలేకపోయారు కానీ, ఆయన రాజకీయ జీవితంలో అతి స్వల్ప మెజారిటీ వచ్చేలా చేయడంలో మాత్రం విజయం సాధించారు. అటువంటి అనుభవం ఉన్న చంద్రబాబు మొన్న డీజీపీ కార్యాలయం ముందు బైఠాయించడాన్ని చూస్తుంటే వింతగా అనిపించింది. ఎంత వింతగా అనిపించినా సరే ఆయన తన వ్యూహం ప్రకారంగానే ముందుకు వెళతారు. 'నవ్విపోదురుగాక నాకేటి వెరపు' అనేది ఆయన సిద్ధాంతం. ఆ సిద్ధాంతాన్ని అనుసరించి ఇప్పటికిప్పుడు ఒక రాద్ధాంతాన్ని సృష్టించాలి. ఎందుకంటే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల విజయంకంటే స్థానిక ఎన్నికల్లో మరింత పెద్ద విజయం సిద్ధించబోతున్నదని తన నలభయ్యేళ్ల అనుభవం చెవిలో చెబుతూనే ఉంది. తనకే కాదు తన అనుచరుల్లో చాలా మందికి వారి వారి అనుభవాలు అంతరాత్మలతో సంభాషిస్తూనే వున్నాయి. వారిలో కొందరు అంతరాత్మ ప్రబోధాన్ని అనుసరిస్తున్నారు. ఈ స్థితిలో మరో దారుణ పరాజయాన్ని మౌనంగా ఆహ్వానించడం కంటే ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందన్న సాకుతో రాద్ధాంతాన్ని సృష్టించి పరువు దక్కించుకోవాలన్నది ప్రతిపక్ష పార్టీ తక్షణ కర్తవ్యంగా మారింది. పీత కష్టాలు పీతవి అన్నట్టు కొన్ని ఇతర పార్టీలకు కూడా వాటి కష్టాలు వాటివి. అందువల్ల ముఖ్య ప్రతిపక్షంతో శ్రుతికలపడానికి అవి సిద్ధపడ్డాయి.

వైఎస్ జగన్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నది. అంతకు ముందు ఐదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ముఖ్యమంత్రిగా పద్నాలుగేళ్ల అనుభవం ఆయనకు వున్నది. ఇద్దరి దృక్పథాల్లో హస్తిమశకాంతరాన్ని జనం గుర్తిస్తున్నారు. వైఎస్ జగన్ పరిపాలన జనకేంద్రకంగా సాగుతుంటే, చంద్రబాబు పరిపాలన ధన కేంద్రకంగా నడిచింది. గ్రామస్థాయి జన్మభూమి కమిటీ సభ్యుని దగ్గర నుంచి అత్యున్నతస్థాయి వరకూ ధనార్జన మీదనే దృష్టి సారించి జనంలో భ్రష్టు పట్టిన అనుభవం గత ప్రభుత్వానిది. అవినీతి మీద ఉక్కుపాదం మోపిన ఆచరణ ప్రస్తుత ప్రభుత్వానిది. పోలవరం ప్రాజెక్టును బాబు ప్రభుత్వం ఏటీఎమ్‌గా మార్చుకున్నదని స్వయంగా ప్రధానమంత్రే 'విమర్శించారు'. రీటెండరింగ్‌తో కమీషన్‌లకు కళ్లెం వేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు విషయంలో చిత్తశుద్ధిని ప్రదర్శిస్తున్నదని మెచ్చి పెరిగిన ప్రాజెక్టు వ్యయభారాన్ని భరించేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. కొత్త రాజధానిని ప్రపంచం లోనే అతి పెద్ద స్కామ్‌గా బాబు ప్రభుత్వం మారిస్తే, రాజధానిని ప్రజలకు చేరువ చేస్తామన్న కమిట్‌మెంట్‌ను జగన్ ప్రభుత్వం ప్రకటించింది. 'దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారు... దళితులు శుభ్రంగా ఉండరు... మాదిగైతే చదువేం వస్తుంది' అనే ఆలోచనా ధోరణి గత ప్రభుత్వానిదైతే, దళితుణ్ని ఉపముఖ్యమంత్రిగా, దళిత మహిళను హోం మంత్రిగా నియమించి దళిత జాతికి ఆత్మగౌరవ కిరీటాన్ని తొడిగిన అంబేడ్కర్ భావజాలం ప్రస్తుత ప్రభుత్వానిది. బీసీలు జడ్జీలుగా పనికిరారంటూ కేంద్రానికి లేఖ రాసిన చరిత్ర బాబుదైతే, బీసీలకు చట్ట సభల్లో సైతం రిజర్వేషన్లు కావాల్సిందేనంటూ పార్లమెంట్‌లో బిల్లును పెట్టించి పూలేకు నివాళులర్పించిన ఏకైక జాతీయ నాయకుడన్న ఘనత జగన్‌ది. ఐదేళ్ల పదవీ కాలంలో నాలుగున్నరేళ్ల పాటు గిరిజనుడికి మంత్రి పదవి కూడా నిరాకరించి, రాజ్యాంగబద్ధమైన గిరిజన సలహా మండలిని కూడా ఏర్పాటు చేయని అలక్ష్యం నాటి ముఖ్యమంత్రిదైతే, గిరిజన మహిళను ఉపముఖ్యమంత్రిని చేసి గౌరవించడమే గాక, గిరిజనాభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టిన ఆపేక్ష నేటి ముఖ్యమంత్రిది. పేదింటి బిడ్డల చదువును పూర్తిగా నిర్లక్ష్యం చేసి సర్కారు బడులు శిథిలమవుతున్నా జాలి చూపని నాయకుడు బాబు. సర్కారు బళ్లను తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టి, ఇంగ్లిషు మీడియాన్ని కూడా ప్రవేశపెడుతూ 'పేద బిడ్డ పెద్ద చదువులు అందుకు నేనున్నాన'ంటూ ఢంకా భజాయించిన నాయకుడు జగన్. ఇలా ఒకటి కాదు, రెండు కాదు అన్ని విషయాల్లోనూ ప్రభుత్వ పరిపాలనపై ఇరువురి దృక్పథాల్లో మౌలికమైన తేడాలున్నాయి.

అసలు ప్రభుత్వమంటే ఏమిటి? అది ఎలా కనిపిస్తుంది? ఎలా వినిపిస్తుంది అనే తాత్వికాంశంపై ప్లేటో, అరిస్టాటిల్, థామస్ హాబ్స్, జెర్మీ బెంథామ్, రూసో, మాకియవెలీ వగైరా రాజనీతి సిద్ధాంతవేత్తలు రకరకాల నిర్వచనాలు చెప్పారు. వాళ్లకంటే గొప్పగా ఇప్పుడు సామాన్య జనం ప్రభుత్వాన్ని అర్థం చేసుకుంటున్నారు. తమ జీవనగమనంలో వెంటనడిచే మిత్రునిగా వారు ప్రభుత్వాన్ని చూస్తున్నారు. తమ పురోభివృద్ధికి బాటలు పరిచే గురువుగా భావిస్తున్నారు. ఒక తండ్రిగా, తల్లిగా, అన్నగా అండగా నిలవాలని ఆశిస్తున్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 250 రోజులు పూర్తయిన సందర్భంగా ఇటీవల ఒక సంస్థ ప్రజాభిప్రాయాన్ని సర్వే చేయడానికి జిల్లాలకు ప్రతినిధులను పంపించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక ఆటోడ్రైవర్ ఈ సంస్థ ప్రతినిధికి ఇచ్చిన సమాధానం ఆసక్తికరంగా వుందట. పాత ప్రభుత్వం కంటే కొత్త ప్రభుత్వం ఎక్కువ అందుబాటులో ఉందని భావిస్తున్నారా? అని ఆ ప్రతినిధి అడిగారట. దానికి ఆటోడ్రైవర్ ఇచ్చిన సమాధానం... 'అందుబాటులో ఉండడమేమిటి? మా ఇంటికే ప్రభుత్వం వచ్చిపోతున్నది. జగనన్నతో మేము రోజూ మాట్లాడుతూనే ఉన్నామన్నా'డట. ఎలా అంటే... 'ఆటో డ్రైవర్‌గా పది వేల రూపాయల వాహనమిత్ర పథకం వర్తించింది. నా పిల్లలు బడికి బయల్దేరుతుంటే జగనన్న టాటా చెబుతున్నట్లే అనిపిస్తున్నది. ఎందుకంటే అమ్మ ఒడి పేరుతో ఏడాది ముందే వాళ్ల చదువు ఖర్చులను ప్రభుత్వం మాకు జమచేసింది. ఇళ్ల పట్టాలకు నా భార్య పేరు ఎంపికైంది. తొందర్లో పట్టా చేతికొస్తుంది. మా నాన్నకు వచ్చే పెన్షన్ వలంటీర్లు ఇంటికి వచ్చి ఒకటో తారీకునాడు ఆదివారమైనా సరే ఇచ్చి వెళ్లారు. రేషన్ ఇంటికొస్తున్నది. ఇంటి దగ్గర్నుంచి వందడుగులు వేస్తే సచివాలయం. ప్రభుత్వం అందుబాటులో కాదు, మా ఇంట్లోనే ఉంది' అని ముగించాడట సదరు ఆటోడ్రైవర్. రాష్ట్రంలో ప్రజలందరి అభిప్రాయం దాదాపు ఇదే. అందుకే చంద్రబాబులో కలవరం. తాను ప్రాతినిధ్యం వహించిన రాజకీయ వ్యవస్థ పతనమవుతున్నది. వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన ఒక కొత్త రాజకీయ వ్యవస్థ చిగురు తొడగడం ప్రారంభమైంది. ఈ పరిణామం కారణంగా నష్టపోయే శక్తులు ఖాళీగా కూర్చోవు. మార్పుకు వ్యతిరేకంగా బలంగా గొంతు విప్పుతాయి. వ్యవస్థల మీద ఉన్న పట్టు కారణంగా ఆ గొంతు స్పెషల్ ఎఫెక్ట్స్‌తో వినిపిస్తుంది. నిరసన శబ్దాలు బిగ్గరగా వినిపిస్తాయి. మరక మంచిదే అన్నట్టు ఆ శబ్దం కూడా మంచిదే. మహా విస్ఫోటం (బిగ్ బ్యాంగ్) ఫలితంగానే కదా విశ్వం ఆవిర్భవించింది. అణువును పగలగొడితేనే కదా పరమాణువు శక్తి సాక్షాత్కరించేది. శబ్దం మంచిదే. ఇక మార్పు తప్పదు.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

## సోషల్ మీడియా

### వివక్ష



"కరోనా వైరస్ వ్యాప్తికి చైనా వాళ్ల ఆహార అలవాట్లే కారణమని విమర్శించడం పూర్తిగా వివక్షతో కూడినదే. యూరప్ నుంచి ప్లేగు, రష్యా నుంచి కలరా, ఫ్రాన్స్ నుంచి స్పానిష్ ఫ్లూ, పశ్చిమ ఆఫ్రికా నుంచి ఎబోలా, బ్రెజిల్ నుంచి జికా వైరస్‌లు వ్యాపించాయని గుర్తుంచుకోవాలి"

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

### అనూహ్యం



"1720లో ప్లేగు వ్యాధి వ్యాపించింది. 1820లో కలరా, 1920లో స్పానిష్ ఫ్లూ వ్యాపించాయి. 2020లో ఇప్పుడు కరోనా వైరస్ వచ్చింది. ప్రతి వందేళ్లకు ఒక మహమ్మారి వ్యాపిస్తూ ఉంటుందనుకుంట. ప్రకృతి అనూహ్యమైనది"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### స్నేహితుడు



"నా స్నేహితుడొకడు రెండు వారాలపాటు వివిధ దేశాలు తిరిగొచ్చాడు. ఆరోగ్యమంత్రిత్వ శాఖకు చెందినవారు మొదటి, ఐదో రోజు, పద్నాలుగో రోజు అతడి ఆరోగ్యాన్ని పరీక్షించారు. కరోనా వైరస్‌పై ప్రభుత్వం ఈ స్థాయిలో పోరాటం సాగించడం చాలా ఆనందంగా ఉంది"

– కునాల్ కపూర్, నటుడు

### ఆశ



"కరోనాపై పోరాటంలో మనం ఆశ పెట్టుకోవాల్సింది అది చైనా ఉత్పత్తి అన్న అంశంపైనే. అవి మార్కెట్‌ను ముంచెత్తుతాయి. కానీ, ఎక్కువ కాలం మన్నవు కదా"

– ప్రణవ్ మహాజన్, పోలీస్ అధికారి

### పరీక్షలు



"కరోనా వైరస్ వ్యాప్తిపై తక్షణం స్పందించి రోజుకు పదివేల పరీక్షలు నిర్వహించడం దక్షిణ కొరియాకు ఎలా సాధ్యమయ్యిందో తెలుసా? అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యం కోసం బడ్జెట్ కేటాయిస్తోంది కాబట్టే. మనం కేటాయించడం లేదు. ఆరోగ్య సంరక్షణ అనేది మానవ హక్కని పోరాడాల్సిన అవసరం మనకెంతో ఉందని దయచేసి అందరూ గుర్తించండి. అన్ని ఆసుపత్రులను ప్రభుత్వమే నిర్వహించే చైనాలాంటి కమ్యూనిస్ట్ దేశం నుంచే వైరస్ వ్యాపించిందంటే దాని తీవ్రతను అర్థం చేసుకోవచ్చు"

– అలెగ్జాండ్రియా ఒకాసియో–కార్టెజ్, డెమొక్రటిక్ పార్టీ నేత

### విద్యావంతులు



"కరోనా వైరస్ పరీక్షలో పాజిటివ్ వచ్చిన ఓ విద్యావంతురాలైన మహిళ తప్పించుకుని ఢిల్లీకి విమానంలో వెళ్లి, అక్కడి నుంచి ఆగ్రాకు రైలులో చేరుకుంది. దాంతో ఆమె ఎంతో మంది ప్రాణాలను అపాయంలోకి నెట్టింది. ఇటలీ నుంచి వచ్చిన కొంతమందిని పరీక్షల నిమిత్తం నిర్బంధించినప్పుడు 5స్టార్ సౌకర్యాలను కోరుకుంటున్నారు. మళ్లీ వాళ్లే జనంతో కలిసి ప్రభుత్వాలను, రాజకీయాలను విమర్శిస్తారు. మరో వ్యవహారంలో వైరస్ సోకిందని అనుమానిస్తున్న కొందరు పంజాబ్ నుంచి తప్పించుకుపారిపోయారు. పోలీసులు వారి ఫొటోలు విడుదల చేయడంతోపాటు, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. విద్యావంతులు కూడా ఇలా ఎందుకు ప్రవర్తిస్తారో అర్థం కాదు"

– ప్రవీణ్ కస్వాన్, ఫారెస్ట్ అధికారి

# మహమ్మారి కరోనా.. ప్రపంచానికే పెనుసవాల్

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఒక ఉపద్రవం ముంచుకొచ్చింది. ఇది తీవ్రవాదం కాదు. అలా అని ప్రకృతి వైపరీత్యం కాదు. అదే కరోనా వైరస్ వ్యాధి. ఒకేసారి 1,45,341 మంది ఈ కరోనా వైరస్ బారిన పడ్డారు. ఈ సంఖ్య పెరుగుతోంది. 138 దేశాలకు కరోనా వైరస్ వ్యాపించింది. ఇప్పటికి 5,670 మందికి పైగా మరణించారు. మహాకార్చిచ్చులా వ్యాధి, దానితోపాటు సంచలనం వ్యాపించింది. ఎక్కడ చూసినా, ఆంక్షలు, నిషేధాలు. ప్రయాణాలు స్తంభించిపోయాయి. వీసాలు రద్దు చేశారు. ప్రయాణికులను వైరస్ నివారణ కోసం క్వారంటైన్ చేయడం మొదలుపెట్టారు. హాస్పిటల్స్ అన్నీ వైరస్ కోసం ప్రత్యేక వార్డులతో సిద్ధమవుతున్నాయి. స్టాక్ మార్కెట్ కుదేలైంది. ఉద్యోగులంతా ఇంటినుంచి పని చేయమని సూచనలు. సభలు, సమావేశాలు, ఆటలు చివరికి పెళ్లిళ్లు కూడా వాయిదా వేయవలసిన పరిస్థితులు. గ్లోబల్ విలేజ్‌లో కరోనా, గుసగుసల సంభాషణగా మొదలై, ఇప్పుడు ప్రధానాంశమైంది.

యుద్ధకాలంలోలాగా ఏ మూల నుంచి ఏ వార్త విన్నా మరోచోట మనిషి స్పందిస్తున్నాడు. 'విశ్వవ్యాప్త వల' ప్రభావం. మనందరం దానికి చిక్కిన చేపలమే! అది వార్తో, పుకారో! ఏదైనా కానీ, ముందు భయం. తరువాత, ఆ భయాన్ని ఎదుర్కొనే మార్గాలు వెతుకుతున్నాం. ఈ నేపథ్యంలో, ప్రజలు, ప్రభుత్వాల వైఖరి జీవితం కన్నా పెద్దది (లార్జర్ దెన్ లైఫ్) అయ్యింది.

ప్రపంచ ఆరోగ్యసంస్థ 'మెడికల్ ఎమర్జెన్సీ'గా కరోనాను ప్రకటించిన తరువాత చాలా ప్రభుత్వాలు అప్రమత్తమైపోయాయి. ప్రస్తుతం మారుమూల ప్రాంతంలో సహితం కరోనా వైరస్ హెల్ప్ సెంటర్స్, వైరస్ కనుగొనే పరిశోధనాశాలలు మొదలుపెట్టారు. అనుమానాస్పద రోగినుంచి తీసుకున్న నమూనాలను సేకరించడంలో పారామెడికల్ సిబ్బంది మునిగిపోయారు. 2.9% మాత్రమే మరణం సంభవిస్తున్న ఈ వైరస్‌పట్ల ఇంత ప్రచారం ఎందుకు జరుగుతోంది? అన్న భయాందోళనలు చదువుకున్న వారిని కూడా చుట్టుముట్టాయి.

చికిత్స కన్న నివారణ మేలు అన్నది అతి ముఖ్యమైన వైద్య ఆరోగ్య సూత్రం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు మాస్ మీడియాను ఉపయోగించడం మొదలుపెట్టాయి. ముందెన్నడూ తెలియని విధంగా ఇప్పుడు ఫోన్ చేస్తే చాలు, కాలర్ ట్యూన్‌లోని పలు ప్రాంతీయ భాషలలో సైతం వ్యాధిని నియంత్రించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను 30 నుంచి 60 సెకన్ల వరకు ప్రసారం చేస్తున్నారు. ఇక వార్తాపత్రికలు, టీవీ చానల్స్ శక్తికొలదీ వార్తలను, సంచలనాలను కూడా చేరవేస్తూ ఉన్నాయి. జెన్ గ్రీన్‌బర్గ్, షెల్డన్ సోలమన్ తదితరులు చెప్పిన 'టెర్రర్ మేనేజ్‌మెంట్' అనే సిద్ధాంతం ప్రకారం



కరోనా ప్రభావంతో శనివారం నిర్మానుష్యమైన హైటెక్ సిటీ పరిసరాలు

ఊహకు అందనంత పెద్దపెద్ద ప్రమాదాలు వచ్చినప్పుడు 'మానవజాతి మానసికస్థితి' సామూహికంగా మూడు రకాలుగా ఉంటుంది.

1. **భయాందోళన:** భయంతో విలవిలలాడటం. 2. **నిర్లక్ష్యం:** చావు ఎలాగూ తప్పదులే అన్న ఒక నిస్తేజం. 3. ప్రాంతీయ, దేశ, సంఘ, సంస్కృతులతో తరాల కొద్దీ చేసే కొన్ని ప్రక్రియలు పూజలు, చిహ్నాలు ఏర్పాటు చేయడం, సామూహిక ప్రదర్శనలు.. ఇలాంటివి. అప్పట్లో రెండో ప్రపంచ యుద్ధం కాలంలో 30 దేశాల సైనికులు పోరాడగా, ఎక్కడ ఏ మరణం సంభవించినా తమ కుటుంబంలోని ఒక వ్యక్తి అకారణంగా చనిపోయేడు అనే విషాదంతో మునిగిపోయేవారు. మరి ఇప్పుడో?

సమాజంలో సహానుభూతి కన్నా, హాస్యం, హేళన పాలు మటుకు పెరిగాయి అనిపిస్తుంది. హాస్యనటుల బొమ్మలతో... పాపం వారు వ్యక్తిగతంగా ఎంత బాధ పడుతున్నారో ! తెలియదుగానీ 'వాడు దగ్గుతున్నాడు ఎక్కడ దాచావు?' అని, వీడియోలు, సందేశాలు వచ్చేశాయి. పెద్దలు, వైద్యులు అంతా వాటిని చూసి నిర్ఘాంతపోయారు. అలా, తలాతోకా లేనట్టు కరోనా గురించిన పేరడీల పద్యాలు, పాటలు కూడా కట్టారు.

కొందరు కరోనా మంచికే వచ్చింది... అందరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తున్నారు అన్నారు. మరికొందరు ఆయా దేశాల ఆహార అలవాట్లను, పరిస్థితులను నిందిస్తున్నారు. అయితే మరో అడుగు ముందుకేసి ఇదంతా ఒక తీవ్రవాదం లేక ఇరుదేశాల మధ్య గల అంతర్గత వైషమ్యాలకు జీవులను వాడుకోవడం అంటే బయో వార్‌ఫేర్ అని తేల్చేశారు.

**ప్రభుత్వ సంయమనం.. వ్యక్తిగత నియంత్రణ**

ఇంతకూ మనం ఎలా మారుతున్నాం? నియంత్రణ ఎంతవరకు ఉంది? సంయమనం ఎంతవరకు ఉంది? ప్రభుత్వాలు సమయం ప్రకారం బులెటిన్ విడుదల చేయాలి. సమూహాలను గురించి ఆంక్షలు పెట్టవచ్చు. సంచలనాలను అదుపు చేసి, అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు మూసేయడం సంచలనాగ్నికి ఆజ్యం పోయడంగా పరిణమించవచ్చు. విధాన నిర్ణయాలు ఇంకొంచెం సంయమనంతో జరగాలి.

ఇక వ్యక్తిగత ప్రవర్తన గురించి చెప్పాల్సి వస్తే.. కింద పడకుండా ఒక ఆహార పదార్థాన్ని తినలేని సమాజం ఇప్పుడు శానిటైజర్ల కోసం పరిగెత్తడం విచిత్రంగా ఉంది. బహిరంగ ప్రదేశాలలో ఉమ్మడం ఆపుకోలేని మనుషులు ఖరీదైన మాస్కులు ధరించటం గురించి చర్చిస్తున్నారు. గొప్ప వైచిత్రి! వైవిధ్యభరిత సామూహిక మానసిక స్థితిని చూస్తున్నాం. ఇది సమంజసమేనా?

ఒక సర్వే ప్రకారం గంటలో మనం 23 సార్లు ముఖాన్ని తడుముకోకుండా ఉండలేమట! అందులోనూ 44% నోరు, ముక్కు, కళ్ళు ఏదో విధంగా చేత్తో ముట్టుకుంటాము. అంతెందుకు? మన ఫోన్ మనం తాకకుండా ఎంతసేపు ఉండగలం? అన్నది పెద్ద సమస్యే. ఈ ఒక్క నిజం గమనిస్తే తీసు కోవాల్సిన జాగ్రత్తలు, అలవరుచుకోవలసిన ఆరోగ్యకరమైన అలవాట్లు ఎన్ని ఉన్నాయి?

బహిరంగ మల, మూత్రవిసర్జననే మానలేకపోతున్నాం. వ్యర్థాలను సవ్యంగా డస్ట్ బిన్‌లో వేయలేకపోతున్నాం. కనీసం ఉతికిన బట్టలు వేసుకోవడానికి కూడా ఏదో అడ్డువస్తోంది! దాన్ని 'జీన్స్ ఫ్యాషన్' అని పేరు కూడా పెట్టుకున్నాము. ఒక మంచి అలవాటు ఇవ్వడానికి మనిషికి కనీసంగా 66 రోజులు పడుతుందట.

ఇప్పటికైనా మనిషి మేలుకొని, పూర్తి అవగాహనతో సోషల్ మీడియా హల్‌చల్ మానేసి నియంత్రణవైపు, బాధ్యతతో అడుగులు వేయాలని, వేస్తాడని ఆశిద్దాం.

నాగసూరి వేణుగోపాల్ । 94407 34392
కాళ్ళకూరి శైలజ । 98854 01882

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

చక్కగా డిగ్రీ చదివిన అమ్మాయిని
సినిమావాళ్లకిచ్చి చేస్తున్నారేమిటో..!
చుట్టు పక్కలవాళ్ల గుసగుసలు.
లోపల పెళ్లిచూపుల సీన్ మాత్రం వేరుగా ఉంది.
'ఇంతాకన్నా ఆనందమేమి, ఓ రామ రామ' అని
రాగం తీస్తోంది అమ్మాయి.
ఇకనేం.. అబ్బాయి అమ్మాయికి నచ్చేశాడు.
పెళ్లయింది. పెళ్లయి అరవై ఏళ్లూ అయింది.
ఈ అరవై ఏళ్లలో సింగీతంగారు..
ఎక్కువసార్లు పలికిన పేరు.. కల్యాణి.
ఈ అరవై ఏళ్లలో కల్యాణి గారు..
చెప్పకోడానికి ఇష్టపడిన మాట.. 'సింగీతం గారి భార్యని'
అరవై ఉగాదులు..! అరవై ఉషస్సులు..!
ఎలా గడిచాయని ఇంటర్వ్యూలో అడిగాం.
వాళ్లు చెప్పిన ప్రతి మాటా ఏడడుగుల బంధం విలువను చాటింది.
రండి... శ్రీనివాస కల్యాణం చూతము రారండి

# శ్రీనివాస కల్యాణం


సింగీతం శ్రీనివాసరావు, కల్యాణి

**ఈ నెల 20తో మీ పెళ్లయి 60 ఏళ్లవుతోంది. సుదీర్ఘ వైవాహిక జీవితం కాబట్టి ప్రత్యేకంగా జరుపుకోవడానికి ప్లాన్ చేస్తున్నారా?**

**సింగీతం:** మేమెప్పుడూ పెళ్లి రోజు అంటూ ఆర్భాటాలు చేయలేదు. పిల్లలు వచ్చి మా దంపతులకు నమస్కరించుకుని ఆశీర్వాదాలు తీసుకుంటారు.

**కల్యాణి:** అయితే మా 50 సంవత్సరాల పెళ్లిరోజుని మాత్రం అందరినీ పిలిచి చేసుకున్నాం. మా చిన్నమ్మాయి లండన్‌లో ఉంటోంది. పోయిన నెల తను ఇక్కడే ఉంది. లండన్ వెళ్లిపోయే లోపు 60 ఏళ్ల పెళ్లి రోజుని ముందే సెల బ్రేట్ చేద్దామని ఫిబ్రవరి 25న చేసుకున్నాం. ఆ వేడుక తర్వాత మా ఆమ్మాయి లండన్ వెళ్లిపోయింది. మా పిల్లల అవకాశాన్ని బట్టి ఎప్పుడు కుదిరితే అప్పుడే మేం వేడుక చేసుకుంటాం. మాకు అదే మంచి రోజు అనుకుంటాం.

**సింగీతం:** వాళ్లకి ఎప్పుడు కుదిరితే అప్పుడే మా మ్యారేజ్ డే అన్నమాట (నవ్వుతూ).

**మీ పెళ్లి ఎలా ఖాయం అయింది?**

**సింగీతం:** నేను టీచర్‌గా కొంతకాలం పనిచేశాక అక్కడక్కడా పని చేస్తూ దర్శక–నిర్మాత కేవీ రెడ్డి గారి దగ్గర చేరాను. సినిమా ఇండస్ట్రీలోకి రాగానే పెళ్లి సంబంధం వచ్చింది. చూసుకోవటం, వెంటనే ఓకే అనుకోవటం.. అలా క్విక్‌గా జరిగిపోయింది.

**కల్యాణి:** నేను ఇంటర్మీడియేట్ చదువుతున్నప్పుడే మా నాన్నగారు సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. మా నాన్నగారికి ముగ్గురం ఆడపిల్లలమే. నాది 'ఆశ్లేషా నక్షత్రం'. జాతక రీత్యా నేను చేసుకోబోయే అబ్బాయికి వాళ్ల అమ్మ బతికి ఉండకూడదు.

**సింగీతం:** ఆశ్లేషా నక్షత్రం వారికి తాను చేసుకోబోయే అబ్బాయికి తల్లి ఉంటే ప్రమాదం. అది ఆ జాతకం వారితో ఉన్న లిటికేషన్ అన్నమాట (నవ్వులు).

**కల్యాణి:** అంతకుముందు నాకో సంబంధం వచ్చింది. అబ్బాయికి తల్లి ఉన్నారు. మా నాన్న నా జాతకం విషయం చెబితే వాళ్లు ఫర్వాలేదన్నారు. మంచి సంబంధం అయినప్పటికీ నాన్న ఒప్పుకోలేదు. ఆ సంబంధం గురించి ఆ నోటా ఈ నోటా వైజాగ్‌లో ఉన్న సింగీతంగారి బాబాయ్ వరకూ వెళ్లింది. ఆయన మా నాన్నగారితో 'మా అన్నయ్యకి తెలిసిన సింగీతం రామచంద్రరావుగారి అబ్బాయి సినిమా ఇండస్ట్రీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడట. మీకు అభ్యంతరం లేదంటే నేను మా అన్నయ్యకు లెటర్ రాస్తాను' అన్నారు.

**సింగీతం:** ఆ రోజుల్లో సినిమా వాళ్లకు పిల్లనివ్వాలంటే అంత తొందరగా ఒప్పుకునేవారు కాదు.


కుమార్తెలు సుధా కార్తీక్, శకుంతలా సతీష్‌తో....

**మీరు 'శ్రీ కల్యాణం' పుస్తకం రాయడానికి స్ఫూర్తి ఎవరు?**

**కల్యాణి:** నీ చిన్నప్పటి విషయాలు, నువ్వు నాన్నని పెళ్లి చేసుకున్న తర్వాత నీ అనుభవాలతో ఓ పుస్తకం రాయొచ్చు కదా? అని మా చిన్నమ్మాయి అంది. నా ఆటోబయోగ్రఫీ రాయడానికి ముఖ్య కారణం తనే. ఎలా ప్రారంభించాలా అనుకునేదాన్ని.. 'నువ్వు అనుకున్నవన్నీ రఫ్‌గా రాస్తుండు. ఫైనల్ వెర్షన్ ఒకటి రాయొచ్చు' అని ఆయన అన్నారు. ఓ డైరీలో రాసుకునేదాన్ని. రఫ్ రాయడానికే ఆర్నెల్లు పట్టింది.

**సింగీతం:** మాకు పెళ్లైన కొత్తలో మాకు పెద్దగా వస్తువులు లేవు. రచయిత పింగళి నాగేంద్రగారు ఒక టేబుల్, నాలుగు కుర్చీలు బహుమతిగా ఇచ్చారు. ఆ టేబుల్ ఇప్పటికీ మా ఇంట్లోనే ఉంది. అది మాకు ప్రత్యేకం. దానిపై కాగితాలు పెట్టుకుని ఆ పుస్తకం రాసింది తను. అది నాకు సంతోషం.

**కల్యాణి:** 'మావాడు సినిమా ఇండస్ట్రీలో పని చేస్తున్నాడు. మీకు ఇష్టం ఉంటే మీ అమ్మాయి ఫోటో పంపగలరు' అని మా నాన్నగారికి వీళ్ల నాన్నగారు ఉత్తరం రాశారు. మా నాన్న తన అభిప్రాయం చెప్పకుండా 'అమ్మడూ.. నీ ఇష్టం' అని ఆ లెటర్ నాకు ఇచ్చారు. నేను ఆలోచిస్తుంటే మా అమ్మమ్మగారు 'వాళ్ల కుటుంబం గురించి నాకు తెలుసు. కంగారు పడకుండా ఒప్పుకో. ఆ అబ్బాయి డిగ్రీ, నువ్వు డిగ్రీ చదువుకున్నావు. అంతా మంచే జరుగుతుంది' అన్నారు. నేను 'సరే' అన్నాను.

**60 ఏళ్ల క్రితం పెళ్లంటే అమ్మాయి ఇష్టంతో సంబంధం లేకుండా పెద్దలు పెళ్లి ఖాయం చేసేవారు. అయితే మీ నాన్నగారు మీ అభిప్రాయాన్ని అడిగారంటే, ఆయన ఎంత గొప్పగా ఆలోచించారో అర్థమవుతోంది..**

**సింగీతం:** మా మామగారు ఫార్వార్డ్ థింకింగ్. పెళ్లి చేసుకోబోయే అమ్మాయి ఏది నిర్ణయించుకుంటే అదే ఫైనల్ అనుకునేవారు. మా పెళ్లికి అంతా ఓకే అనుకున్నారు కానీ, కట్నం ఎంత అడుగుతారో అనేది అందరి మనసులోనూ ఉంది. అది గ్రహించి మా నాన్నగారు 'మా వంశంలో కట్న, కానుకల ప్రసక్తే లేదు. నో డిమాండ్స్, నథింగ్' అన్నారు.

**ఈ సందర్భంగా కట్న, కానుకలు తీసుకునే వారి గురించి నాలుగు మాటలు?**

**సింగీతం:** కట్నం తీసుకోకూడదు, నేరం.. ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఏదో నాలుగు మాటలు చెప్పేస్తే సరిపోదు. దీనికి ఒకే ఒక్క సొల్యూషన్ ఏంటంటే ఆడవాళ్లు చదువుకోవాలి. స్త్రీలందరికీ మంచి ఎడ్యుకేషన్ ఇప్పించాలి. ఒకప్పుడు వాళ్ల అమ్మమ్మకు జరిగింది, తర్వాత వాళ్ల అమ్మకు జరిగింది.. ఇప్పుడు కూతురికి జరగకుండా చూసుకుంటే చాలు. మార్పు అదే వస్తుంది.

**అప్పట్లో పెళ్లి చూపుల్లో అమ్మాయిని పాడమనేవారు..**

**కల్యాణి:** 'ఇంతాకన్నా ఆనందమేమి, ఓ రామ రామ..' అని పాడాను (నవ్వుతూ). 'అబ్బాయి నచ్చాడని ఇంతకన్నా అమ్మాయి ఎలా చెబుతుంది' అని పెద్దవాళ్లు అన్నారు. మా పెళ్లి కుదిరింది. కానీ అమ్మలక్కలు చక్కగా డిగ్రీ చదువుకున్న అమ్మాయిని సినిమా వాళ్లకి ఎందుకిస్తున్నారో అని గుసగుసలాడుకున్నారు. అప్పుడు వాళ్లు అలా అన్నారు. 'సింగీతంగారి భార్యని' అని నేను ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటాను. అప్పటికీ ఇప్పటికీ నాది ఒకటే మాట... ఆయన్ని పెళ్లి చేసుకున్నందుకు నేను ధన్యురాలిని.

**పెళ్లి చూపుల్లో 'ఇంతాకన్నా ఆనందం ఏముంది..' అని పాడినట్లుగానే మీ లైఫ్ ఆనందంగా సాగుతోందన్న మాట...**

**కల్యాణి:** రెండొందల శాతం నా లైఫ్ అలానే ఉంది. పెళ్లికి ముందు నేను పక్కింట్లో పేరంటానికి కూడా వెళ్లేదాన్ని కాదు. మేం మా పుట్టింట్లో అలా పెరిగాం. ఓ సారి చెల్లెలు మద్రాసులో మా ఇంటికి వచ్చింది. నేను అందరితో మాట్లాడటం చూసి 'అదేంటే... అందరితో అంత బాగా మాట్లాడుతున్నావు! బావగారు నిన్ను భలే మార్చేశారే' అంది.

**సింగీతం:** కాలేజీ డేస్‌లోనే మోడ్రన్‌గా ఉండేవాణ్ణి. మోడ్రన్‌గా డ్రెస్ చేసుకోవడం మాత్రమే కాదు.. నా ఆలోచనలు కూడా అలానే ఉండేవి. నేను కేవీ రెడ్డిగారి దగ్గర పని చేసేటప్పుడు మద్రాసులో రెండు లైబ్రరీలు ఉండేవి. ఇద్దరం పుస్తకాలు తెచ్చుకుని, చదివేవాళ్లం. 'నేను ఏది చెబితే అది ఫైనల్ కాదు, నీకు ఈక్వల్ రైట్స్ ఉన్నాయి. మీరు ఎంత చెబితే అంతే అనే తత్వం నుంచి నీకున్న హక్కుతో నువ్వు డిమాండ్ చెయ్' అని పెళ్లయిన కొత్తలోనే తనకు చెప్పాను.

**ఇప్పుడు కూడా భార్యకి ఈక్వల్ రైట్స్ ఇవ్వడానికి చాలా మంది భర్తలు ఇష్టపడటంలేదు. 60 ఏళ్ల క్రితం 'ఈక్వల్ రైట్స్' అన్నారంటే సూపర్బ్. మేల్ డామినేషన్ అంటూ స్త్రీని చిన్నచూపు చూసేవారికి చిన్న సలహా ఏమైనా?**

**సింగీతం:** అప్పట్లో మగవాళ్లు ఆఫీసుకు వెళ్లి, తర్వాత క్లబ్‌లకు వెళ్లి, పేకాట ఆడి ఇలా ఎంతో ఎంటర్‌టైన్‌మెంట్ ఉండేది. ఎవరైనా ఇంటికి వచ్చి మాట్లాడితే తప్ప ఆడవాళ్లకు వేరే ఏమీ ఉండేది కాదు. టీవి వచ్చాక కొంత ఎంటర్‌టైన్‌మెంట్ వచ్చింది. అయితే మగవాడు ఇంటికి వచ్చినా కూడా ఆడవాళ్లు టీవి చూస్తూనే ఉంటారనే అర్థంతో కార్టూన్లు వేసేవారు. అవి వేసేది కూడా మగవాళ్లే. అన్నిరోజులూ మగవాళ్లు పేకాట ఆడినా ఒక్క కార్టూన్ రాలేదు. ఆడవాళ్ల మీద 'తిరగబడే ఆడది', 'భయపడే మొగుడు' లాంటి టైటిల్స్‌తో కార్టూన్లు వచ్చేవి. ఇదంతా మేల్ డామినేషన్. ఇది తరతరాలుగా వస్తోంది. ఈ పరిస్థితి పోవాలంటే ఎడ్యుకేషన్ ఆఫ్ ఉమెన్ ఒక్కటే పరిష్కారం. ప్రతి స్త్రీ తన హక్కుల కోసం డిమాండ్ చేయాలి. ఈ రోజుకీ ఇంట్లో అందరూ ఉన్నప్పుడు మగవాడు ఫస్ట్ అన్నట్లు చూస్తారు. 60 ఏళ్ల మా వైవాహిక జీవితం తర్వాత కూడా ఇప్పుడూ ఈమె కొన్ని విషయాల్లో 'మేల్ ప్రయారిటీ' ఇస్తుంది. అలా వద్దంటాను. స్త్రీ బతికినంతకాలం పురుషుడి మీద ఆధారపడాలనే ధోరణి మంచిది కాదు. ఆవిడకూ ఒక లైఫ్ ఉంటుంది. ఈక్వల్ రైట్స్ ఇవ్వాలి.

**కల్యాణి:** అప్పట్లో మా నాన్నగారు ఓ పత్రికకు నాతో కరస్పాండెంట్‌గా పని చేయించారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఏం జరుగుతుందో రాసి ఇచ్చేదాన్ని. అక్కడ లేడీస్ క్లబ్ మెంబర్‌గా ఉండేదాన్ని. అక్కడే పాఠాలు, టైప్ రైటింగ్ నేర్చుకున్నా. అలా మా నాన్న బాగా ఎంకరేజ్ చేసేవారు. పెళ్లయ్యాక ఈయన ఇంకా బాగా ఎంకరేజ్ చేశారు.

**మీరు డైరెక్షన్ చేసిన సినిమాల్లో కొన్నింటి కథా చర్చల్లో మీ ఆవిడ కూడా భాగం పంచుకున్నారట... ఆ విషయం గురించి?**

**సింగీతం:** ప్రతి సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ మొత్తం ముందుగా ఆమెకు వినిపించేవాణ్ణి. ఆమెతో డిస్కస్ చేసేవాణ్ణి. ఓసారి ఆమెకు ఒక ఫిలిం ఫెస్టివల్‌లో చూసిన ఓ అర్జెంటీనా సినిమా నచ్చింది. ఆ మాట నాతో అంటే.. అయితే తెలుగుకి తగ్గట్టుగా ఆ కథ రాయమన్నాను. దాన్నే 'సొమ్మొకడిది–సోకొకడిది'గా తెలుగులో తీశాను.

**కల్యాణి:** ఏ ఫిలిం ఫెస్టివల్‌కు వెళ్లినా సినిమా చూస్తూ టకటకా నోట్ చేసేదాన్ని. తర్వాత ఆయనతో డిస్కస్ చేసేదాన్ని.

**మీ 60 ఏళ్ల వైవాహిక బంధం గురించి అందరికీ స్ఫూర్తిగా ఉండే ఓ కొన్ని పాయింట్లు చెప్పండి...**

**కల్యాణి:** ఎంత అన్యోన్యంగా ఉండే దంపతుల మధ్య అయినా వాదనలు లేకుండా ఉండవు. వాదించుకున్నా కూడా ఆ తర్వాత కలిసిపోవాలి. సమస్యలు ఉన్నా విడాకులవరకూ వెళ్లకూడదు. పెళ్లికి ముందు నాకు కొంచెం కోపం ఎక్కువ. పిల్లలు పుట్టాక ఆ కోపం ఇంకా పెరిగింది. వాళ్ల అల్లరి తట్టుకోలేకపోయేదాన్ని. దాంతో పిల్లలను తిట్టి, కొట్టేదాన్ని. అలాంటి సమయాల్లో ఆయనే ఎక్కువగా సర్దుకుపోయేవారు. నాకు కోపం వచ్చింది కదా అని ఆయన ఇంకా కోపం తెచ్చుకుని సమస్యని పెద్దది చేసేవారు కాదు. మా ఇద్దరి మధ్య మంచి అండర్‌స్టాండింగ్ ఉంది.

**సింగీతం:** నాది ఆబ్సెంట్ మైండ్. అది నిజంగా పెద్ద సమస్యే అయినా తను సర్దుకుంది. నేను చిన్నప్పటి నుంచీ నాస్తికుడిని. కానీ ఆమె పూజలు చేస్తుంది. నేను దేవుణ్ణి నమ్మను కదా అని తనని మానేయమనలేదు. తనకోసం నేను అష్టోత్తరాలు చదువుతాను. ఎందుకంటే ఆవిడ అభిప్రాయానికి విలువ ఇవ్వాలి కదా. నేను అష్టోత్తరాలు చదవడంవల్ల దేవుడు నన్ను ఇష్టపడతాడని కాదు... ఈమె ఇష్టపడుతుంది కదా (నవ్వుతూ). మనం ఎవరమూ పర్‌ఫెక్ట్ పీపుల్ కాదు. ప్రపంచంలో అందరం 'ఇన్‌పర్‌ఫెక్ట్ పీపులే'. ఆ ఇన్‌పర్‌ఫెక్ట్‌ని యాక్సెప్ట్ చేస్తే అప్పుడు అందరం హ్యాపీగా ఉంటాం.

**'ఆదిత్య 369' చిత్రంలో టైమ్ మెషీన్‌ని వెనక్కి తిప్పి ప్రేక్షకులందర్నీ వెనక్కి తీసుకెళ్లిపోయారు.. ఇప్పుడు టైమ్ మెషీన్ వెనక్కి వెళితే మీకు ఏమేం చేయాలని ఉంది?**

**సింగీతం:** ఏవీ లేవమ్మా.. నిన్నటికన్నా రేపు బెటర్ అంటాను. అప్పట్లో అన్నీ అద్భుతాలే అంటుంటారు. కానీ ఇవాళ కూడా అద్భుతాలు జరుగుతున్నాయి. ఆ రోజు నేను చేయనివి ఎన్నో ఇప్పుడు ఇండస్ట్రీలో చేస్తున్నారు. వాళ్లను చూసి నేను అప్‌డేట్ అవుతుంటాను.

**ఫైనల్లీ.. మళ్లీ దర్శకత్వం ఎప్పుడు?**

**సింగీతం:** రెండు మూడు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.. స్క్రిప్ట్ విషయంలో కల్యాణికి గతంలో చెప్పినట్లు పెద్దగా చెప్పడంలేదు. కాకపోతే ఇలా చేయబోతున్నానని తనకి చెబుతుంటాను. అన్నీ తనకి చెప్పే చేస్తుంటాను.

**చెప్పకుండా చేసినది ఏదైనా మీ జీవితంలో ఉందా?**

**కల్యాణి:** అలాంటిది ఏదీ లేదు (నవ్వులు).

– డి.జి. భవాని


కల్యాణి, సింగీతం

**ఇప్పుడు మీ రోజువారి జీవితం ఎలా సాగుతోంది?**

**సింగీతం:** నేను ఉదయం 6:30 గంటలకు నిద్ర లేచి కాసేపు వాకింగ్, శ్వాసకి సంబంధించిన వ్యాయామం చేస్తాను. సాయంత్రం కూడా వాక్ చేస్తాను. ఆహారం అంతా టైమ్ టు టైమ్ జరిగిపోతుంది. రాత్రి కళ్లు మూసుకోగానే నిద్రపట్టేస్తుంది. పాపం తనకి నిద్రపట్టదు.

**కల్యాణి:** నాకు రాత్రి 12 తర్వాత నిద్రపడుతుంది. అందుకని త్వరగా నిద్ర లేవలేను. నా 55వ సంవత్సరం నుంచే చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. డాక్టర్ల సలహా మేరకు ఫిజియోథెరపీ చేయించుకున్నాను. డాక్టర్ చెప్పినట్లు కాసేపు చేతులు, కాళ్లకు సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లు చేస్తాను. నాకు 83 ఏళ్లొచ్చినా ఇప్పటికీ మా ఇద్దరికీ చపాతీలు చేయడం, దోసెలు వేయడం చేస్తాను.. వంట చేయడానికి మనుషులు ఉన్నారనుకోండి.

**సింగీతం:** మేం చెన్నైలో ఉంటున్నాం. నేను డైరెక్షన్ చేస్తున్నప్పుడు నా తమ్ముడు అసిస్టెంట్‌గా చేసేవాడు. తన అబ్బాయి పూర్ణ ప్రగ్యా, కోడలు, వాళ్ల పిల్లలు మా వద్దే ఉంటూ బాగా చూసుకుంటున్నారు.

**కల్యాణి:** ఆ అమ్మాయి మా సొంత కోడలిలా మమ్మల్ని చూసుకుంటుంది. అందుకని మాకేం ఇబ్బంది లేదు.

**'నా జీవితంలో నేను ఎక్కువగా పలికిన పేరు కల్యాణి' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు..**

**సింగీతం:** అవును. నేను ఎక్కువసార్లు పలికిన పేరు కల్యాణి. మాది చాలా సింపుల్ లైఫ్. నాకు డైరెక్షన్ తప్ప వేరే ఏదీ తెలియదు. షూటింగ్ కాగానే నేరుగా ఇంటికి వచ్చేవాణ్ణి. మాకు క్లోజ్ ఫ్రెండ్స్ ఆరుగురు మాత్రమే ఉండేవారు. సినిమాలు, ఇల్లు, ఆ ఫ్రెండ్స్.. అంతే.






# ఆగేది లేదు



● ప్రభాస్

ప్రస్తుతం ప్రపంచమంతా కరోనా కంగారులో ఉన్నారు. చాలా సినిమాల షూటింగ్స్ క్యాన్సిల్ అయ్యాయి. కానీ ప్రభాస్ కొత్త చిత్రం షూటింగ్ మాత్రం జార్జియాలో ముందు ప్లాన్ చేసిన ప్రకారమే జరుగుతోందని దర్శకుడు రాధాకృష్ణ పేర్కొన్నారు. ''పది డిగ్రీల ఉష్ణోగ్రత, వర్షం, దానికి తోడు కరోనా కంగారు. వీటన్నింటి మధ్య కూడా మా సినిమా షూటింగ్ పూర్తి చేస్తున్నాం. మా టీమ్ స్పిరిట్‌ని ఏదీ ఆపలేదు'' అని రాధాకృష్ణ ట్వీట్ చేశారు. ప్రభాస్, పూజా హెగ్డే జంటగా పీరియాడిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు రాధాకృష్ణ. యూవీ క్రియేషన్స్, గోపీకృష్ణ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల కానుంది.



● అల్లు అర్జున్

## ఫారెస్ట్‌కు పయనం

అడవుల్లో డ్రైవింగ్ చేయడానికి రెడీ అవుతున్నారట అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణను త్వరలో తూర్పు గోదావరి జిల్లా మారెడుమిల్లి ఫారెస్ట్ లొకేషన్స్‌లో ప్రారంభించాలనుకుంటున్నారట. అక్కడ అల్లు అర్జున్‌పై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు ఓ యాక్షన్ ఎపిసోడ్‌ను కూడా ప్లాన్ చేశారట. స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో లారీ డ్రైవర్ పాత్రలో అల్లు అర్జున్, ఫారెస్ట్ అధికారి పాత్రలో విజయ్ సేతుపతి, విలన్‌గా జగపతిబాబు నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# నాకు మూడు నాలుగు సార్లు పెళ్లి చేశారు

**అనుష్క అసలు పేరు స్వీటీ. అయితే సినిమా ఇండస్ట్రీకి వచ్చాక ఆ పేరు మారింది. కానీ మనిషి మాత్రం స్వీట్‌గానే ఉన్నారు. 'నిజంగానే స్వీట్ పర్సన్' అని ఇండస్ట్రీలో అంటారు. ఇంకో సంవత్సరంలో స్వీటీ స్వీట్ సిక్స్‌టీన్ ఇయర్స్‌కి చేరుకుంటారు. ఎందుకంటే ఇప్పుడు 15 ఇయర్స్ కంప్లీట్ చేసుకున్నారు కాబట్టి. అవును.. హీరోయిన్‌గా అనుష్క ఇండస్ట్రీకి వచ్చి పదిహేనేళ్లవుతోంది. ఈ సందర్భంగా స్వీట్‌గా 'సాక్షి'తో పలు విశేషాలు పంచుకున్నారు అనుష్క.**



● అనుష్క

● **'భాగమతి' తర్వాత 'నిశ్శబ్దం'తో మళ్లీ స్క్రీన్ మీద కనిపించడానికి రెండేళ్లు పట్టింది. ఎందుకీ గ్యాప్?**

'బాహుబలి, రుద్రమదేవి' సినిమాలు శారీరకంగా చాలా కష్టంతో కూడుకున్నవి. ఆ షూటింగ్ సమయాల్లో గాయపడ్డాను. ఆ గాయాలు మానడానికి బ్రేక్ తీసుకున్నాను.

● **హీరోయిన్‌గా 15 ఏళ్లు పూర్తవడం గురించి?**

15 ఏళ్లు ఎలా గడిచాయో తెలియలేదు. ...న్నారు. ఒకప్పటితో పోల్చితే ప్రస్తుతం ఎక్కువ మంది మానసిక ఒత్తిడి, డిప్రెషన్‌కి గురవడానికి కారణాలివే. మనం ఎలా ఉన్నా మనల్ని మనం అంగీకరించాలి. ఎదుటివాళ్లను కూడా అంగీకరించాలి. పైపై మెరుగులకు ప్రాధాన్యం ఇచ్చి మన ఒరిజినాలిటీని కోల్పోకూడదు.

అయితే ఆ పదిహేనేళ్లదే ప్రపంచం కాదు. మనకి మనం కొంత సమయం కేటాయించుకోవాలి. రియాలిటీ చెక్ చేసుకోవాలి. అందుకే ఇప్పటినుంచి మధ్య మధ్యలో బ్రేక్ తీసుకోవాలనుకుంటున్నాను.

● **ఈ బ్రేక్‌లో బరువు తగ్గుతున్నట్లున్నారు?**

మెల్లిగా తగ్గుతూ వస్తున్నాను. ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బరువు తగ్గుతున్నాను.

● **లావు, సన్నం, తెలుపు, నలుపు.. ఇలా చాలా మంది బాహ్య సౌందర్యానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లనిపిస్తోంది. ఒకప్పుడు ఆరోగ్యంగా ఉన్నారా...**

(మధ్యలో అందుకుంటూ).. నిజమే ఇప్పుడు ఎవర్ని కలిసినా ఎలా ఉన్నావు? ఆరోగ్యం బావుందా? అని అడగడం మానేసి సన్నబడ్డావేంటి? లావయ్యావేంటి? అని అడుగుతున్నారు. లేకపోతే నల్లబడ్డావంటారు. ప్రస్తుతం అందరం పైపై విషయాల్నే గమనిస్తున్నాం కానీ లోపల వాళ్లు ఎలా ఫీల్ అవుతున్నారో పట్టించుకోవడం లేదు. ఎవరు ఎవర్ని కలిసినా ముందు ఇలాంటి విషయాల గురించి కాకుండా హ్యాపీగా ఉన్నావా? ఆరోగ్యంగా ఉన్నావా? అని అడగాలి. కానీ ఫిజికల్ అపియరెన్స్‌కి ఇంపార్టెన్స్ ఇస్తు...

● **'బాహుబలి, రుద్రమదేవి' ఎక్కువ ఫిజికల్ వర్క్ అన్నారు. 'నిశ్శబ్దం'లో మూగ, చెవిటి అమ్మాయి సాక్షిగా నటించారు. వరుసగా చాలెంజింగ్ రోల్స్ చేయడం ఎలా అనిపిస్తోంది?**

'నిశ్శబ్దం' కథను కోన వెంకట్‌గారు చెప్పగానే ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో నాకు ఎదురైన పెద్ద చాలెంజ్ ఏంటంటే తెలుగులో డైలాగ్స్ ఎలా చెప్పాలి అని. ఇప్పుడు డైలాగ్స్ లేకుండా నటించాను (నవ్వుతూ). ఈ పాత్ర కోసం సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నాను. ముందు ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌తో చేయాలనుకున్నాం. కానీ కథ అమెరికాలో ఉంటుంది. దాంతో అమెరికన్ సైన్ లాంగ్వేజ్‌లో చేశాం.

**'సాహో'లో మిమల్ని ఒక స్పెషల్ సాంగ్ చేయమన్నారట?**

అడిగారు. అప్పుడు నేను అమెరికాలో షూటింగ్ చేస్తున్నాను. షెడ్యూల్ కుదర్లేదు.

**డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి ఎంటరవుతారా?**

నా ప్రాధాన్యం సినిమాలకే. సినిమా మ్యాజిక్ థియేటర్‌లోనే ఉంటుంది. ఒకవేళ అద్భుతంగా ఉందనిపిస్తే అప్పుడు డిజిటల్‌కి ఓకే చెబుతా.

**ఈ 15 ఏళ్లల్లో ఎన్నో మాస్ సాంగ్స్‌కి డ్యాన్స్ చేశారు. ఇప్పుడు అది మిస్సవుతున్నట్లు ఉందా?**

అవును. సెట్ సాంగ్స్ మిస్ అవుతున్నాను. మంచి మాస్ నంబర్‌కి డ్యాన్స్ చేసే క్యారెక్టర్ కోసం చూస్తున్నాను. ఓ పక్కా కమర్షియల్ సినిమా చేయాలనుంది. లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్నప్పుడు కమర్షియల్ సినిమాలు, కమర్షియల్ మూవీ చేసినప్పుడు లేడీ ఓరియంటెడ్ మూవీ వస్తే బాగుండు అనిపిస్తుంది. సినిమా మ్యాజిక్కే అది.

**నెక్ట్స్ ప్రాజెక్ట్?**

గౌతమ్ మీనన్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నాను. ఓ రెండు స్క్రిప్ట్స్ చర్చల దశలో ఉన్నాయి. జూన్ నుంచి షూటింగ్స్ మొదలుపెడతాం.

● **ఈ ఇయర్ మీ పెళ్లి అంటున్నారు. ఎవరో క్రికెటర్‌తో అని, ఓ దర్శకుడి కుమారుడితో అనీ వార్తలు...**

అవును.. నాకు పెళ్లి అంటున్నారు. నాక్కూడా తెలియదు (నవ్వుతూ). ప్రేమ అయినా పెళ్లి అయినా ఒక మనిషి జీవితంలో చాలా ముఖ్యమైనది. ఒకవేళ నేను రిలేషన్‌షిప్‌లో ఉంటే దాన్ని సీక్రెట్‌గా దాచను. పదేళ్ల నుంచి ప్రతీ మూడు నాలుగు నెలలకోసారి నాకు పెళ్లి చేస్తూనే ఉన్నారు. నేను వార్తలు చూడను, పేపర్ చదవను. బయట ప్రపంచాన్ని ఫాలో అవ్వను. నా పని పూర్తయ్యాక కటాఫ్ అయిపోతాను. నీ గురించి ఇలాంటి ఒక వార్త వచ్చిందని నాకు ఎవరో చెబుతారు. క్రికెటర్‌ని పెళ్లి చేసుకుంటున్నట్టు వచ్చిన వార్తను దర్శకుడు హేమంత్ చెప్పారు. అప్పుడెలా రియాక్ట్ కావాలో అర్థం కాలేదు. ఒకరి పర్సనల్ విషయాల గురించి ఉన్నవీ లేనివీ కల్పించి ఎందుకు రాస్తారో తెలియదు. రాసేవాళ్లకూ ఫ్యామిలీ ఉంటుంది కదా. వాళ్ల గురించి అలా రాస్తే వాళ్లు ఫీల్ అవ్వరా?

**– గౌతమ్ మల్లాది**



● కాజల్ అగర్వాల్

## మళ్లీ జోడీ?

చిరంజీవితో కాజల్ అగర్వాల్ మళ్లీ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్ నగర్ వర్గాలు. చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో 'ఆచార్య' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కథానాయికగా త్రిషను తీసుకున్నారు. అయితే క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల 'ఆచార్య' నుంచి తప్పుకున్నట్లు తెలిపారు త్రిష. ఇప్పుడు త్రిష ప్లేస్‌లో కాజల్‌ను తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట చిత్రబృందం. ఇందుకు సంబంధించిన చర్చలు కూడా మొదలయ్యాయట. చిరంజీవి కమ్‌బ్యాక్ మూవీ 'ఖైదీ నంబర్ 150' (2017)లో కాజల్ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే. మరోసారి ఈ జంట స్క్రీన్‌పై కనిపిస్తుందా? వెయిట్ అండ్ సీ.

# విడుదల వాయిదా



● నాని

తన 25వ చిత్రాన్ని ఈ నెల 25న ఆడియన్స్‌కు చూపించాలనుకున్నారు నాని. అయితే ప్లాన్ మారింది. కరోనా వైరస్ కారణంగా 'వి' చిత్రం విడుదల వాయిదా పడింది. నాని, సుధీర్ బాబు, అదితీ రావ్ హైదరీ, నివేదా థామస్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'వి'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించారు. ఇది నాని కెరీర్‌లో 25వ సినిమా. ఈ సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారు నాని. ఉగాది రోజున ఈ సినిమాను విడుదల చేయాలనుకున్నారు. కరోనా కారణంగా ఈ సినిమా విడుదలను ఏప్రిల్‌కు వాయిదా వేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ''మార్చిలో కరోనాను చంపేద్దాం. ఏప్రిల్ నెలలో ఉగాదిని జరుపుకుందాం'' అని ట్వీట్ చేశారు నాని.

# తోట బావిలో...

యాంకర్ రవి, గౌతమి జంటగా నటిస్తున్న చిత్రం 'తోట బావి'. గద్వాల్ కింగ్ సమర్పణలో ఆలూర్ ప్రకాశ్‌గౌడ్ నిర్మించారు. అంజి దేవండ్ల దర్శకుడు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు ఎన్.శంకర్ విడుదల చేసి మాట్లాడుతూ– ''రవిని చాలాకాలంగా టీవీలో చూస్తున్నాను. మంచి టైమింగ్ ఉన్న నటుడు'' అన్నారు. ''రవి ఇచ్చిన సపోర్ట్‌తో సినిమా చాలా బాగా వచ్చింది'' అన్నారు అంజి దేవండ్ల. ''యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో మా దర్శకుడు సినిమాను ఇంట్రెస్టింగ్‌గా తీశారు. మొదటి సినిమా అయినా అనుభవం ఉన్న దర్శకునిలా తీశారు'' అన్నారు ప్రకాష్ గౌడ్. ఈ చిత్రానికి దౌలు, చిన్న స్వామి, అభిషేక్ .బి సహనిర్మాతలు.



● అభినేష్, అంజి, ఎన్.శంకర్, చిన్న స్వామి

# కొత్త జీవితం



● సంతోష్ రెడ్డి, షీలా

నటి షీలా వివాహం చేసుకున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారామె. ''మా పెళ్లి రోజు మాకెంతో ప్రత్యేకమైనది. మేం ఇద్దరం కలిసి ఓ నూతన జీవితాన్ని ఆరంభించాం. నా వివాహం జరిగింది'' అంటూ తన పెళ్లి ఫొటోను షేర్ చేశారు షీలా. చెన్నైకి చెందిన సంతోష్ రెడ్డి అనే వ్యాపారవేత్తను షీలా పరిణయమాడారు. 2000–2010 సమయంలో తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో హీరోయిన్‌గా పలు సినిమాలు చేశారామె. తెలుగులో 'పరుగు' (2008), 'మస్కా' (2009), 'అదుర్స్' (2010) వంటి సినిమాల్లో నటించారు. 2011లో వచ్చిన 'పరమవీర చక్ర' తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు షీలా.

# ప్రేమికుల అడ్డా

అక్షయ్ కుమార్, రూప, కవిత ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న చిత్రం 'ప్రేమికుల అడ్డా'. 'విడిపోయిన హృదయాలను కలుపుతుంది' అనేది ఉపశీర్షిక. గేయరచయిత వేల్పుల వెంకటేష్ ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రాన్ని వీవీ నాయుడు నిర్మిస్తున్నారు. ''టైమ్‌పాస్ ప్రేమికులకు, నిజమైన ప్రేమికులకు మధ్య ఉండే తేడాను మా సినిమాలో చూపించబోతున్నాం. మంచి ప్రేమకథా చిత్రం. వేసవిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రబృందం వెల్లడించింది. ఈ సినిమాకు కెమెరా: శివరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నూకబోయిన వెంకట్రామ్.



● అక్షయ్ కుమార్, రూప

# ఆరువందల ఏళ్ల కథ



● శేఖర్ వర్మ, వివ్య శాన్త్

దీపక్, శేఖర్‌వర్మ, వివ్య శాన్త్‌లు ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'అంగుళీక'. ప్రేమ్ ఆర్యన్ దర్శకత్వంలో కోటి తూముల, ఎ.జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారు. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సినిమా విలేకరుల సమావేశంలో ప్రేమ్ మాట్లాడుతూ– ''మొత్తం ఏడు రకాల సూర్యగ్రహణాలు ఉంటాయి. సూర్య భగవానుడి అంశలో జన్మించిన ఒక అమ్మాయికి, అంగుళీక సూర్యగ్రహణానికి ఒక లింక్ ఉంది. ఆరువందల ఏళ్ల క్రితం జరిగిన వాస్తవ కథను తీసుకొని ఈ సినిమా తీశాం'' అన్నారు. కోటి మాట్లాడుతూ– ''ఎంతో కష్టపడి, ఇష్టపడి చేసిన చిత్రమిది. కొన్ని కారణాల వల్ల సినిమా డిలే అయ్యింది'' అన్నారు. ''మంచి సినిమాలో భాగం కావటం సంతోషంగా ఉంది. ఈ సినిమా రిలీజ్ వరకూ వచ్చిందంటే మా నిర్మాత, దర్శకుడే కారణం'' అన్నారు హీరో శేఖర్.

# విట్టల్ వాడిలో ఏం జరిగింది?



● రోహిత్, సుధా రావత్

రోహిత్ రెడ్డి, సుధా రావత్ జంటగా నటించిన చిత్రం 'విట్టల్ వాడి'. హైదరాబాద్‌లోని ఓ ప్రాంతం పేరు విట్టల్ వాడి. ఆ నేపథ్యంలోనే సినిమా ఉంటుంది. ఎన్.ఎన్. ఎక్స్‌పీరియన్స్ ఫిలిమ్స్ పతాకంపై జి.నరేశ్ రెడ్డి నిర్మించారు. నాగేందర్ దర్శకత్వం వహించారు. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రోహిత్ మాట్లాడుతూ– ''కొన్ని వాస్తవ సంఘటనలతో రూపొందించిన చిత్రం ఇది. నాగేంద్ర బాగా తెరకెక్కించారు'' అన్నారు. నాగేంద్ర మాట్లాడుతూ– ''నన్ను నమ్మి ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత నరేశ్ గారికి థ్యాంక్స్. రోహిత్ ఈ కథకు కరెక్ట్‌గా సరిపోయాడు. కొత్త హీరో అయినా అనుభవం ఉన్న నటునిలా నటించారు'' అన్నారు. ''రియల్ ఇన్సిడెంట్‌లతో తీసిన ఈ సినిమాని చాలా సహజంగా తెరకెక్కించారు దర్శకుడు'' అన్నారు నరేశ్.

## మనసు మాట వినండి



● అదితీ రావ్ హైదరీ

ప్రతి ఒక్కరిలోనూ బలాలు, బలహీనతలు ఉంటాయి. తనలో ఉన్న ఓ బలహీనత తాను సెన్సిటివ్‌గా ఉండటమే అని అంటున్నారు హీరోయిన్ అదితీ రావ్ హైదరీ. ఈ విషయం గురించి ఆమె చెబుతూ – ''నేను చాలా సున్నితమనస్కురాలిని. కొన్ని విధాలుగా ఇది నాకు ఉపయోగం. కానీ కొన్ని పరిస్థితుల్లో ఇలాంటి మనస్తత్వం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. త్వరగా హర్ట్ అవుతాను. ఫీల్ అయిన విషయం నా ముఖం మీద కనిపించేస్తుంది. అలా నా ఫీలింగ్స్‌ని బయటపెట్టకూడదని ఫిక్స్ అయ్యాను. అలా ఉండగలనో లేదో చూడాలి'' అన్నారు. ఏదైనా విషయంలో నిర్ణయం తీసుకోవాలంటే మీరు ఎవరి మీద ఆధారపడతారు? అనే ప్రశ్నకు – ''జనరల్‌గా మనం మన మనసు చెప్పే మాటను వినాలి. మనసు చెప్పినది ఎంత కష్టమైనా దాన్ని యాక్సెప్ట్ చేయాలి. నమ్మకంతో ముందుకెళ్లాలి '' అని పేర్కొన్నారు అదితీ రావ్.

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
15-3-2020

గురు సన్నిధి

## స్వామి దయానంద సరస్వతి

నవీన భారతదేశ సంస్కర్తలలో అగ్రగణ్యులు స్వామి దయానంద. వీరి అసలు పేరు మూల శంకర్. బాల్యంలోనే భగవంతుడ్ని దర్శించాలనే తలంపుతో ఇల్లువదలి వెళ్ళగా, ఎందరో యోగులు, మహానుభావుల సాంగత్యం వీరికి లభించింది. చివరికి మధురలో స్వామి విరజానంద సరస్వతి పరిచయం వీరి జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. దాంతో అక్కడే వేద, వేదాంత విద్యలను అభ్యసించి, సమాజం పట్ల అవగాహన కోసం దేశాటనకు



బయల్దేరారు. ఆనాటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చూసి తన జీవితం ఇక సమాజసేవకే అంకితమని నిశ్చయించుకున్నారు.

### సంఘసంస్కారం–ఆర్యసమాజం

దయానంద సరస్వతి సతీ సహగమనం, బాల్యవివాహాలపై తీవ్రంగా పోరాడి జనాలలో గణనీయాత్మక మార్పు తీసుకొచ్చారు. కర్మ సిద్ధాంతాన్ని, పునర్జన్మను గట్టిగా విశ్వసించే దయానందులు ఆచార వ్యవహారాలను మాత్రం వ్యతిరేకించారు. ఆర్యసమాజాన్ని స్థాపించి స్త్రీ సముద్ధరణకు నడుం బిగించారు. స్వధర్మానికి తిరిగి చేరుకునే వారికోసం ఆర్య సమాజం ద్వారా శుద్ధి కార్యక్రమం నిర్వహించేవారు. వీరు చేపట్టిన సంస్కరణలకు ఆనాటి నాయకులు సైతం ప్రభావితమయ్యారు.

### దయానంద భాష్యం

వేదాలు మానవులు రచించినవి కావనీ, సాక్షాత్తూ పరమాత్మ నుండే ఉద్భవించాయని బలంగా నమ్మిన వీరు ''సత్యార్థ ప్రకాశ్'' పేరుతో వేదాల సారాన్ని సామాన్యుడి దాకా చేర్చే ప్రయత్నం చేశారు. అంతటితో ఆగకుండా వేదాలను ఆధునిక కోణంలో చూడాలన్న దృక్పథంతో వీరు చేసిన యత్నం దయానంద భాష్యం' పేరుతో సుప్రసిద్ధం. ''వేదాల వైపు మరలు'' అన్న వీరి నినాదం ఆనాడు మారుమ్రోగింది. వేదాలు చెప్పిన స్త్రీ సమానత్వం గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. వేదాలతో పాటు ప్రాథమిక విద్య అవసరాన్ని గుర్తించి అనేక కళాశాలలు నెలకొల్పి విద్యాదానం చేశారు.

జాతీయవాదిగా తన బోధనలతో భారత దేశాన్ని సాంఘికంగా, మతపరంగా సంఘటిత పరచి ప్రజలలో దేశభక్తిని, జాతీయభావాన్ని పెంపొందించేలా అవిరళ కృషి సల్పారు. హిందూధర్మానికి దయానందులు చేసిన సేవ తరువాతి సమాజ సంస్కర్తలకు ఆదర్శంగా నిలిచింది.

– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని
వేదపండితులు

ఆలయం ఆగమం

# సంప్రదాయ సంస్కృతీనిలయం

**ఆలయం భగవంతుని సన్నిధిగానే కాదు.. ఎన్నో విశేషాలకు, నిగూఢ రహస్యాలకు నిలయం. మనం తెలుసుకోదగిన ఆసక్తికరమైన అంశాలెన్నో ఆలయంలో అడుగడుగునా కనబడుతుంటాయి. అయితే వాటిని గురించి వివరించేవారు లేక అవి సందేహాలుగానే మిగిలిపోతాయి. ఈ లోటు తీర్చేందుకే ఆలయంలోని అనేక భాగాలను ఆగమ, వాస్తు, శిల్పశాస్త్రాల మేళవింపుతో వివరిస్తూ గత నలభై వారాలుగా ఇదే పేజీలో ‘ఆలయం ఆగమం’ పేరిట ఆలయ విశేషాలను తెలియస్తూ వస్తున్న ఈ శీర్షిక సాక్షి సన్నిధి పాఠకులందరినీ అలరించిందని ఆశిస్తున్నాం.**



ఆలయం సంప్రదాయనిర్మాణం మాత్రమే కాదు. ఓ వ్యవస్థ. ఆ వ్యవస్థను చక్కగా కొనసాగించడానికి సాక్షాత్తూ భగవంతుడే ఆగమాలని అనుగ్రహించాడు. ఆగమాల్ని అనుసరించి నిత్య పూజాది కైంకర్యాలు జరిగే ఆలయం నిరంతరం భగవంతుని సాన్నిధ్యంతో అలరారుతుంది. ఆలయనిర్మాణం ఎంత ముఖ్యమో నిర్వహణ కూడా అంతే ముఖ్యం. పూజాదికాలలో సమయపాలన విధిగా అనుసరించాలి. ఇందుకై ఆగమాలలో పూజ ఎంతసేపు జరగాలి? అభిషేకం, నైవేద్యం మొదలైన అన్నిటికీ నిర్దిష్టమైన కాలనిర్ణయం ఉంది. ఆలయంలో ఈ సంప్రదాయాన్ని పాటించడం తప్పనిసరి చేయాలి. భక్తులకు స్థానిక సంప్రదాయాలను తెలియజేయడం, వాటిని వారిచే పాటించేలా చేయడం అత్యవసరం. ఆలయపరిసరాల పరిశుభ్రతను, అలాగే చుట్టూ అనాచార నివారణ మొదలైన వాటి పట్ల నిర్దిష్టమైన ప్రణాళిక.. వాటిని భక్తులకు తెలియజెప్పే ప్రయత్నం చేస్తూ ఆధ్యాత్మికభావనను పెంచే విధంగా ఏర్పాట్లు, ఆలయ శిల్పసంపదను పాడుచేయకుండా రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే నిత్యార్చన, ఉత్సవాలకు ఉపయోగించే దీపస్తంభాలు, పూజాపాత్రలు, ఆభరణాలు, ఛత్రచామరాలు, వాహనాలు, పల్లకి, ఘంటలు మొదలైన వస్తువులన్నింటినీ కలిగి ఉండటంతోపాటు ప్రతి ఏటా జరిపే ఉత్సవాల నిర్వహణ వంటి ఎన్నో విషయాలు ఆలయ నిర్వహణ పరిధిలోకి వస్తాయి.



### జీర్ణోద్ధరణ

జీర్ణోద్ధరణ, నవీకరణ, పునరుద్ధరణ మొదలైనవన్నీ ఒకే మాటకున్న పలుపేర్లు. సాధారణంగా మనమంతా కొత్త ఆలయాల నిర్మాణానికే శ్రద్ధ చూపుతాం. పాతదేవాలయాల్నీ, పాడుపడిపోయిన వాటిని తాకడానికి ఎవరికీ ధైర్యం రాదు. ఎందుకంటే వాటిని ముట్టుకుంటే ఏమౌతుందో అని చాలామందిలో తెలీని భయం నెలకొంది. ఆగమశాస్త్రం నూతనాలయానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో.. అంతకుమించి జీర్ణోద్ధరణ గొప్పదని చెప్పింది. నూతన దేవాలయం నిర్మిస్తే కలిగే ఫలితంతో పోలిస్తే పాతదేవాలయాన్ని పునరుద్ధరిస్తే అంతకు పదిరెట్లు కలుగుతుంది. మనం ఎప్పుడూ పాడైన వస్తువులను బాగుచేయించుకుని వాడుకుంటాం. అలాగే ఆలయం కూడా పాతబడుతూ ఉంటే దానికి కావాల్సిన మరమ్మతులు చేయించడం, పాడైన భాగాన్ని పునరుద్ధరించడం భక్తుల ముఖ్యవిధి. ముఖ్యంగా ప్రతి పన్నెండేళ్లకోసారైనా లోటుపాట్లను సవరించి మరలా ఆలయాన్ని నూత్నరీతిలో తీర్చిదిద్ది కుంభాభిషేకం చేయడం తప్పనిసరి. అప్పుడే ఆ ఆలయంలోని శక్తి మరింత పుంజుకుంటుంది. ఆలయం నిర్మాణంలో ఎంత పురాతనం అయితే అంత శక్తి. ఎప్పటికప్పుడు జరగాల్సిన నవీకరణలో దూరం అయితే అంత పాడుపడుతుంది. అప్పుడు ఆ ఆలయంలోని దైవశక్తి విగ్రహాన్ని విడిచి వెళ్లిపోతుంది. ఆ ఆలయం భక్తులకు మంచి ఫలితాలివ్వదు. భిన్నమైన విగ్రహాన్ని పూజించినా.. బాగున్న గుడిలో పూజాదికాలు జరగకపోయినా అది ఆ రాష్ట్రానికి, ప్రాంతానికీ మంచిది కాదు. కనుక అందరూ పూనుకుని పాతదేవాలయాల్ని పునరుద్ధరించడం లోకక్షేమం, జగత్కల్యాణకరం. నిర్మాణ, నిర్వహణ, నవీకరణలపై ఆగమశాస్త్ర గ్రంథాలలో అలనాటి నుంచి నేటి ఆధునికుల వరకూ చెప్పిన సలహాలు, సూచనలను అనుసరించి ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవడం అందరి విధి.

### ఆలయంలో ఇవి చేస్తే దోషం

ఆలయంలో చేయగూడని వాటిని దైవాపరాధాలంటారు. మనస్సంతా దేవునిపైనే లగ్నం చేసుకుని ఆలయంలోకి ప్రవేశించాలి. అంతేగానీ ఆశౌచం(మైల)తో, స్నానాదికాలు చేయకుండా, కాళ్లు కడుక్కోకుండా, తలకు నూనె రాసుకుని, కాళ్లకు చెప్పులు, తలకు పాగా ధరించి, పాత, చిరిగిన వస్త్రాలు కట్టుకుని, చొక్కా ధరించి, ఉత్తరీయం లేకుండా, నుదుటన బొట్టు పెట్టుకోకుండా, ఒంటిపై కంబలి ధరించి, ఇతర ఆలోచనలతో, ఆలయంలోకి ప్రవేశించరాదు.

అలాగే ఆలయంలో లౌకిక విషయాలు మాట్లాడటం, పరిహాసాలు ఆడుకోవడం, భగవంతునికి ఒకచేతితో నమస్కరించడం, ప్రదక్షిణ చేయకపోవడం, దేవుడి సన్నిధిలో కాలిపై కాలు వేసుకుని, దేవునికి ఎదురుగా కాళ్లు చాపుకుని కూర్చోవడం, అబద్ధాలాడటం, గట్టిగా మాట్లాడటం, వాదులాటచేయటం, తోటి భక్తులను ఇబ్బంది పెట్టడం, బాధించడం, భగవంతునికి తప్ప ఇతరులకు నమస్కరించడం, అలాగే ఆశీర్వదించడం, మరొకర్ని పొగడటం లేదా నిందించడం, సన్నిధికి వీపుచూపడం మొదలైన 32 దైవాపరాధ దోషాల్ని అర్చనానవనీతం పేర్కొంది. ఆలయానికి వెళ్లే ప్రతీ భక్తుడూ తప్పకుండా ఈ విధినిషేధాల్ని తలపులో ఉంచుకుని విధులను పాటిస్తూ.. నిషేధాల్ని గుర్తెరిగి నడుచుకుంటూ భగవదనుగ్రహం పొందే ప్రయత్నం చేయాలి. అలాగే ఆలయంలో ఈ విధినిషేధాల్ని ఓ చోట లిఖించి భక్తులకు అందుబాటులోకి తెస్తే తప్పక మంచి ఫలితం ఉంటుంది.

దేవాలయానికి వెళ్లి పుణ్యం సంపాదించుకోవాలన్నా.. పాపం కూడకట్టుకోకూడదన్నా ఈ విధినిషేధాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం, ఆచరించడం చాలా అవసరం. ఇవి ఆలయ ధర్మాలు. ఆ ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ దేవుడు మనల్ని రక్షిస్తాడు.

– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు
E-mail: brahmaji.kvs@gmail.com

– నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

స్త్రీ వైశిష్ట్యం-31

## జాతికి జోలపాట పాడారు


లతామంగేష్కర్


ఎం.ఎస్. సుబ్బులక్ష్మి

ఎం.ఎస్. సుబ్బులక్ష్మి... జాతికి సంస్కృతిని నేర్పిన తల్లి. సంగీత విదుషీమణి. తమిళంలో రాజాజీ (స్వాతంత్ర్య సమర యోధుడు రాజగోపాలాచారి) రాసిన ‘కురై ఒన్రుమ్‌ఇల్లై, గోవిందా’(నీకు విన్నవించుకోవడానికి నాకెటువంటి సమస్యలు లేవు ప్రభూ) అనే కీర్తనను పాడారు. ఎంత గొప్పగా పాడారంటే.. మహాత్మాగాంధీ అంతటివారు దీనిని చాలా ఇష్టంగా వినేవారు. ''నేను సాధారణంగా కర్తవ్యనిష్ఠ వలన నిరాశకు లోనుకాను. నేను ఎప్పుడయినా నిరాశచేత మానసిక స్తబ్దతను పొందితే వెంటనే ఈ కీర్తన వింటాను. అది విన్న వెంటనే నాకు మళ్ళీ ఉత్సాహం పుడుతుంది'' అని చెప్పుకున్నారు.

మహాత్మాగాంధీగారు చనిపోతే సంతాపదినాలు 12 రోజులు కూడా ఆకాశవాణి ఈ కీర్తనను ప్రసారం చేసింది. అలాగే ఆమె శరీరం విడిచిపెట్టినప్పుడు కూడా ఇదే కీర్తనను వినిపించారు. ఎన్నివేల కీర్తనలు పాడిందో మహాతల్లి. ఆవిడ పాడిన ‘భజగోవిందం’ ఇప్పటికీ ప్రతి ఇంటా వినపడుతుంది. నుదుట పెద్దబొట్టు, తలకొప్పు, పట్టు చీర.. ఆ తల్లి మూర్తిని చూస్తే ఎంత ఆనందం కలుగుతుందో! దేశనాయకులు, స్వాతంత్ర్య సమరయోధులనుంచీ సామాన్యులవరకూ ఎంతమందికో శాంతినిచ్చిన ఆమె వ్యక్తిగత జీవితంలో ఎంత క్రమశిక్షణగల వ్యక్తో, ఎంత విధేయత కలిగిన భార్యో, ఎంత సమున్నత వ్యక్తిత్వం ఉన్న వారో తెలుసుకుంటే మన కళ్ళు చెమ్మగిల్లుతాయి. ఇటువంటి స్త్రీలు పుట్టిన గడ్డ ఇది. ఈ దేశానికి ఎంతటి పేరు ప్రఖ్యాతులు తీసుకు వచ్చారో!!!


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అలాంటి మరో మహోన్నత శిఖరం లతామంగేష్కర్– దీనానాథ్ మంగేష్కర్ గారికి ముగ్గురు కుమార్తెలు. వారితో కలిసి నాటక సంస్థను స్థాపించి తినడానికి అన్నం లేకపోతే, ముగ్గురు కూతుళ్ళతోటి నాటకాలు వేయిస్తూ ఒక పూట తిని ఒక పూట తినక కాలం గడిపిన రోజులు వారివి. అలా మొదలయిన జీవితం... తరువాతి కాలంలో కొన్ని లక్షల మందికి కోట్లమందికి జోలపాడగలిగింది ఆమె స్వరం. అత్యున్నత శిఖరాలకు చేరుకుని కూడా అంత పరమ భక్తితో, పరమ క్రమశిక్షణతో జీవించిన వారు బహు అరుదు. ఏదో పాట నేర్చుకుని పాడడం కాదు, భావాన్ని తెలుసుకుని తాదాత్మ్యతతో పాడిన పాటలు వేలకు వేలుగా ఉన్నాయి. ఎంత ఆర్ద్రతతో పాడతారంటే...1962లో భారతదేశం మీద చైనా దండయాత్ర చేసినప్పుడు ఆ తల్లి కచేరీ చేస్తున్నారు. అప్పటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూగారు కూడా అక్కడే ఉన్నారు. ఆమె పాట ముగించే సరికి నెహ్రూగారి కనుల వెంట నీరు ధారాపాతంగా కారిపోతున్నది. సభలో దాదాపు అందరి పరిస్థితి ఇంచుమించు అలాగే ఉంది. తరువాత ప్రసంగాలు కొనసాగించడానికి ఎవరూ ముందుకు రాలేదు. గొంతులు గాద్గదికమై పోయాయి.

ఒకపాట పాడితే అలా పాడాలి. అలా కొన్ని వేల పాటలు పాడిన ఆ మహాతల్లి జీవితంలో అన్ని కష్టాలు పడి పైకి వచ్చి...అయినా క్రమశిక్షణ తప్పకుండా, భక్తిని నరనరాన నింపుకుని ఎందరికో ఆదర్శంగా నిలిచింది. ఎవరి పేరు చెబితే మొత్తం జాతి పులకించిపోతుందో అటువంటి స్త్రీమూర్తులను కన్న భూమి ఇది.

ప్రశ్నోత్తర భారతం



## అస్త్రవిద్యాప్రదర్శన

1. ఒకనాడు ద్రోణుడు ధృతరాష్ట్రునితో ఏమన్నాడు?
2. రంగస్థలం ఏర్పాటుచేయమని ఎవరికి చెప్పాడు?
3. రంగస్థలం ఏ విధంగా ఉంది?
4. ధృతరాష్ట్రుని కోసం ఏర్పాటైన స్థలం ఏ విధంగా ఉంది?
5. ధృతరాష్ట్రుని పక్కన ఎవరు కూర్చున్నారు?
6. విదురుని పని ఏమిటి?
7. రంగస్థలంలో ఇంకా ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారు?
8. ద్రోణాచార్యుడు ఎక్కడ, ఏ విధంగా ఉన్నాడు?

జవాబులు: 1) మహారాజా! రాజకుమారులు అస్త్ర విద్యలు నేర్చారు. వారి సామర్థ్యాన్ని పరిశీలించాలి.. అన్నాడు. ధృతరాష్ట్రుడు అంగీకరించాడు 2) విదురునితో చెప్పాడు 3) శాస్త్ర ప్రకారం కొలతలు కలిగి ఉంది. చెట్లు, పొదలు, గుంటలు, దిబ్బలు, రాళ్ళు, ఎముకలు లేకుండా చదును చేయబడి ఉంది. దుమ్ము లేకుండా చేయబడింది. అరటి స్తంభాలు కట్టారు. పూలమాలలు వ్రేలాడదీశారు. రంగస్థలం కన్నులపండువుగా సిద్ధం అయింది. రంగస్థలం మేరు పర్వతంలా తేజరిల్లింది 4) ఆయన కోసం ప్రత్యేకశాల నిర్మించారు. దానికి ముత్యాల దండలు కట్టారు. మరకత, వజ్ర వైడూర్య పద్మరాగ ప్రవాళాలు అమర్చారు. రత్నకాంతులు ఇంద్రధనుస్సులా ప్రకాశించాయి 5) గాంధారి. ఆమె పక్కన కుంతి కూర్చుంది. ఆ పక్కనే విదురుడు కూర్చున్నాడు 6) రంగస్థలం మీద జరుగుతున్నదంతా ధృతరాష్ట్రునికి వివరించటం విదురుని పని. అతడు వ్యాఖ్యాత 7) బ్రాహ్మణులు ఒక శాలలో ఉన్నారు. వేదవ్యాసుడు వారి ముందు న్నాడు. కృపాచార్యుడు, శల్యుడు, శకుని, భీష్ముడు, సోమదత్తుడు మొదలైనవారంతా తమతమ ఆసనాల ముందు ఉన్నారు. మంత్రులు, సామంతులు, తాళాలవారు, వాద్యాలవారు తమ తమ స్థానాలలో ఉన్నారు 8) ద్రోణాచార్యుడు మరొక శాలలో కూర్చుని ఉన్నాడు. అతడు తెల్లని వస్త్రాలు ధరించాడు. తెల్లని ఆభరణాలు, పూలమాలలు, సుగంధం, యజ్ఞోపవీతం, తెల్లని వెంట్రుకలతో తేజరిల్లుతున్నాడు. ఆయన పక్కన అశ్వత్థామ ఉన్నాడు. ఆ పక్కన రాజకుమారులు నిలిచారు.

– నిర్వహణ
డా. వైజయంతి పురాణపండ

సువార్త

## క్షమించని వారికి ప్రార్థించే హక్కు లేదు

దృశ్యమైన, అశాశ్వతమైన భూగ్రహం నుండి అదృశ్యమైన, నిత్యజీవప్రధానమైన మహోన్నత పరలోకంలో దైవసన్నిధికి రెప్పపాటులో చేరే ‘శక్తి’ విశ్వాసి చేసే ప్రార్థనకు ఉంది. ‘నా పిల్లలు రెండు రోజులుగా పస్తు లున్నారు. ఈ రాత్రికి వారికి భోజనం వండి పెట్టేందుకు అవసరమైనన్ని సరుకులివ్వండి’ అనడిగింది ఒక నిస్సహాయురాలైన గృహిణి. ‘నీ వద్ద డబ్బుందా?’ అనడిగాడు ఆహార సరుకుల కొట్టు యజమాని.‘నా భర్త యుద్ధానికి వెళ్లి అక్కడే చనిపోయాడు. నా వద్ద డబ్బు లేదు, ఒక చిన్న ‘ప్రార్థన’ మాత్రముంది’ అన్నదావిడ. దేవుడు, ప్రార్థన లాంటి విశ్వాసాలేవీ లేని ఆ యజమాని ‘ఒక కాగితం మీద ఆ ప్రార్థన రాసివ్వు. తూనిక రాయిగా దాన్ని త్రాసులో పెట్టి దాంతో ఎంత సరుకు తూగితే అంతిస్తాను’ అన్నాడు వెక్కిరింతగా. ఆమె ‘దేవా, దయచేసి నా పిల్లల ఆకలి తీర్చు’ అని చిన్న కాగితంపై రాసిస్తే, అతను దాన్ని త్రాసులో ఒక వైపుంచాడు. ఆశ్చర్యకరంగా ఆ వైపు పూర్తిగా కిందికి దిగింది. త్రాసులో మరోవైపు ఆమెకు అవసరమైన సరుకులు అతను ఎన్ని పెడుతున్నా, ఆ వైపు మాత్రం కిందికి దిగడం లేదు. చివరికతను విసిగి, ‘నా త్రాసు తెగిపోతుందేమో. ఇవన్నీ తీసుకొని ఇక వెళ్ళిపో’ అన్నాడు. వణికే చేతులతో, కన్నీళ్లతో, కృతజ్ఞతతో ఆమె వాటిని తీసుకొని వెళ్ళిపోయింది.

యేసుప్రభువు ప్రార్థనాశక్తిని చూసిన శిష్యులు తమకు కూడా ప్రార్థించడం నేర్పమన్నారు ఒకసారి (లూకా 11–1–13). అప్పుడాయన ‘పరలోక మందున్న మా తండ్రీ’ అన్న సంబోధనతో ఆరంభమై, పరిశుద్ధత, క్షమాపణ వంటి ఉదాత్తమైన అంశాలతో, ఆకలి తీర్చే అనుదినాహారం, ఆపదలో సాయం పొందటం వంటి అతి సామాన్యమైన, సున్నితమైన అవసరతలతో కూడిన ఒక చిన్న ప్రార్థన వారికి నేర్పించాడు. అదే ప్రభువు నేర్పిన పరలోక ప్రార్థనగా ప్రసిద్ధి చెందింది. మహోన్నతుడైన దేవుణ్ణి, పాపియైన మనిషిని ఆ ప్రార్థన తండ్రీ కుమారులను చేసి, ఈ విశ్వాన్నంతా ఒక దైవకుటుంబంగా మార్చేసింది. ‘ఆకలి’, ‘భయం’ మన స్వభావ సిద్ధమైన లక్షణాలు. కాని క్షమించడం మాత్రం మనకు అలవాటు లేదు. అయితే ప్రాథమికావసరతలైన అనుదినాహారాన్ని, కీడులో భద్రతనివ్వమని అడగడమే కాక, తనపట్ల తప్పులు చేసిన వారిని ఎప్పటికప్పుడు క్షమించి, ఆ విషయాన్ని దేవునికి నివేదించే సులక్షణాన్ని కూడా విశ్వాసి అలవర్చుకోవాలని పరలోకప్రార్థన ద్వారా ప్రభువు లోకానికి నేర్పించాడు. ‘అడగండి, మీకిస్తాను’ అన్న వాగ్దానంతో తనను ‘అడిగే హక్కును’ దేవుడే విశ్వాసికి ప్రసాదించాడు. అయితే, ఆ హక్కును వాడుకోవడానికి, క్షమాహృదయం, క్షమించిన అనుభవం అర్హత అని కూడా ప్రభువు పరోక్షంగా నిర్దేశించాడు. క్షమించే అలవాటు, అనుభవం లేనివారికి తమకు కావలసిన అనుదినాహారాన్ని, దేవుని భద్రతను కూడా అడిగే హక్కు లేదన్నది పరలోక ప్రార్థన సారాంశం!! అందుకే, ఎంతో సామాన్యమైనదిగా కనిపించే ‘పరలోకప్రార్థన’ నిజానికి చాలా సంక్లిష్టమైనది. అద్భుతమైన పదాలతో చేసే ప్రార్థనే చాలా గొప్పదనుకుంటారు చాలామంది. కాని హృదయపు లోతుల్లో నుండి పైకి పొర్లే స్వచ్ఛమైన, సరళమైన భావాలు, పదాలున్న ప్రార్థన మాత్రమే పరలోకాన్ని చేరుతుంది. ఒక పరిసయ్యుడు ఆలయంలో చేసిన స్వనీతితో కూడిన సుదీర్ఘమైన ప్రార్థన ఆలయం పైకప్పు కూడా దాటలేదు కాని, అదే ఆలయం వెలుపల ఒంటరిగా నిలబడి, పశ్చాత్తాపంతో రొమ్ము బాదుకొంటూ దేవా పాపినైన నన్ను కరుణించమంటూ ఒక సుంకరి హృదయావేదనతో చేసిన ప్రార్థన, పరలోకపు తలుపులు తట్టి, వెళ్లి, ప్రభువు పాదాల మీద వాలింది (లూకా 18:10). మనది క్షమించే హృదయమైతే, మనం చేసే ప్రార్థన శక్తివంతమైనది. తోటి వారిని ఎప్పటికప్పుడు క్షమిస్తూ, మనం చేసే నిస్సహాయ ప్రార్థనలు, అసమానమైన ప్రభువు శక్తిని మనకోసం మోసుకొస్తాయి. అదే పరలోకప్రార్థనలోని ఆత్మీయ మర్మం!!



– రెవ.డా. టి.ఎ. ప్రభుకిరణ్
సంపాదకుడు– ఆకాశ ధాన్యం

బౌద్ధ ధమ్మం

## ముక్కోపి సన్యాస దీక్ష

''మనస్సు మలినంగా ఉన్నవారు, ఇంద్రియ లోలురు, సత్యవిహీనులు కాషాయం ధరించడానికి అనర్హులు'' అంటుంది ధమ్మపదం.

రాజయ్య ముక్కోపి. ప్రతివారితో తగాదాలకు దిగుతాడు. ఇంట్లో వాళ్లను కూడా ఈసడించుకుంటాడు. ఇక భార్యమీదకైతే ఒంటి కాలిమీద లేస్తాడు. చివరికి అతనికి రాజయ్య అనే అసలు పేరు పోయి ‘ముక్కోపి’ అనే పేరు స్థిరమై పోయింది.

ఒకసారి ఒక సాధువు ఆ గ్రామానికి వచ్చాడు. కోపం వల్ల కలిగే చేటు గురించి చక్కగా వివరించి చెప్పాడు. సన్యాసం వల్ల కలిగే మానసిక ఉల్లాసం గురించి ప్రబోధించాడు. అతని ప్రబోధం విన్న ముక్కోపికి జ్ఞానోదయం అయ్యింది. ఆ సన్యాసికి జరిగే ఆదర సత్కారాలు, గౌరవాలు చూసి తానూ సన్యసించాలి అనుకున్నాడు. మర్నాడు కుటుంబ సభ్యులందరినీ సమావేశ పరచి విషయం చెప్పాడు. భార్య తప్ప మిగిలిన వారంతా సంతోషించారు. మంచి నిర్ణయం అని మెచ్చుకున్నారు. భార్య మౌనంగా ఉండటం చూసి ముక్కోపికి చిర్రెత్తుకొచ్చినా, రేప్పొద్దునే ఇల్లు వదిలి బయల్దేరతాను కదా అనుకుని, ''ఉదయానికి కాస్త ఫలహారం చెయ్యి. మధ్యాహ్నం తింటానికి అన్నం మూట కట్టు. ఇక అదే ఇంట్లో తినే ఆఖరి భోజనం'' అన్నాడు.

మర్నాడు ఫలహారం తిని, అన్నం మూట కర్రకు కట్టుకుని బయల్దేరాడు. మధ్యాహ్నానికి నాలుగైదు ఊళ్లు దాటి వెళ్లాడు. దారిలో ఒక చెట్టు దగ్గర మంచినీటి బావిని చూసి ఆగాడు. అన్నం మూట విప్పాడు. అన్నంలో కూర కలుపుకున్నాడు. ఆకలిగా ఉండడంతో గబ గబా రెండు ముద్దలు నోట్లో కుక్కుకున్నాడు. అన్నం రుచీ పచీ లేదు. కూరలో ఉప్పు తగ్గింది. చప్పగా ఉంది.

''ఎంత నిర్లక్ష్యం! నేను ఉప్పు ఎక్కువ తింటానని తెలిసి కూడా తక్కువ వేసింది. వెళ్లి దాని అంతు చూడాలి'' అని తిట్టుకుంటూ లేచి ఇంటికి బయల్దేరాడు. సాయంత్రానికి ఇంటికి చేరి భార్యను చెడామడా తిట్టేశాడు. ఆమె నవ్వుకుని మంచి కూర వండి పెట్టింది. సుష్టుగా తిని గుర్రుపెట్టి నిద్రపోయాడు. మరునాడు వైరాగ్యం ఊసే ఎత్తలేదు.

కోపం, కోరికలు లేనివాడే కాషాయధారి కావడానికి అర్హుడు. కాషాయ వస్త్రాలు త్యాగానికి చిహ్నంగా ఎంచి ధరించిన తొలి పరిత్యాగులు బౌద్ధ భిక్షువులే!

– డా. బొర్రా గోవర్ధన్



ఇస్లాం వెలుగు

## మేఘమా! అక్కడే వర్షించు!!

ముహమ్మద్ ప్రవక్త (స) పూర్వ సమాజానికి చెందిన ఒక వృత్తాంతం వినిపించారు. అదేమిటంటే, ఒక వ్యక్తి ఒక నిర్జన ప్రదేశం గుండా ప్రయాణిస్తున్నాడు.

అంతలో అతనికి ఆకాశం నుండి మాటలు వినిపించాయి. తలపైకెత్తి చూశాడు. ఆకాశమంతా నిర్మలంగా ఉంది. కాని మాటలు వినిపించిన ప్రదేశం మాత్రం మేఘావృతమై ఉంది. ఫలానా వ్యక్తి పంటచేనుకు నీటి అవసరం ఉంది, అక్కడ వర్షించమని మేఘాలకు ఆదేశం అందడంతో మేఘాలు అటువైపుకు కదిలాయి. అక్కడ సన్నని వర్షం ప్రారంభమైంది. అది చిన్న కాలువలా తయారై ఆ వ్యక్తి పంట చేను వైపు ప్రవహిస్తోంది. ఆ మాటలు విన్న వ్యక్తి, ప్రవహిస్తున్న కాలువను అనుసరిస్తూ.. ఆ ఫలానా అతని చేను దగ్గరికి చేరుకున్నాడు. అక్కడ ఒక వ్యక్తి చేతిలో పార పట్టుకొని ఆ వస్తున్న నీటి కాలువను తన చేలో పంటకు పెట్టుకుంటూ కనిపించాడు. ఆశ్చర్యంతో ఆమనిషినే తదేకంగా కొద్దిసేపు చూసి, కాస్త భయభయంగా అతన్ని సమీపించాడు. అతనితో మాటలు కలిపి పేరేమిటని ఆరా తీశాడు. అదే పేరు. అంతకు ముందు తాను విన్న పేరు. ఆకాశవాణి వినిపించిన పేరు. అతను మరింత ఆశ్చర్యానికి గురై, ''నువ్వు చేసే సత్కార్యాలు ఏమిటి?'' అని ప్రశ్నించాడు.



ఆ వ్యక్తి సమాధానంగా ''ఏముందీ.. నేను పండించిన పంటలో పెట్టుబడి తీసేసి, పంటను మూడు భాగాలుగా విభజిస్తాను. ఒక భాగాన్ని పేదసాదల కోసం ఖర్చుపెడతాను. ఒక భాగం నాకు, నా కుటుంబ పోషణ కోసం ఉంచుకుంటాను. మరోభాగం మరో పంటకు విత్తనంగా వాడతాను. ఇది తప్ప మరేమీ లేదు'' అని చెప్పాడు.

అంటే ఆ వ్యక్తి తన సంపాదనలో ఖచ్చితంగా ఒక నిర్ణీత భాగాన్ని పేదలు, అగత్య పరులకోసం వెచ్చించేవాడు. ఇతరుల కోసం ఖర్చుపెట్టడం అనేది అల్లాహ్‌కు ఎంతగా నచ్చిందంటే, ఏకంగా ఆ వ్యక్తి పేరునే ఉచ్చరిస్తూ, నేరుగా ఆకాశం నుండి అతని పంట చేలోనే వర్షం కురిపించమని మేఘాలను ఆదేశించేంతగా! పరులను ఆదుకునే వారికోసం ఆకాశ ద్వారాలు తెరుచుకోవడం అంటే ఇదే.

అందుకే ముహమ్మద్ ప్రవక్త (స) పేద సాదలను ఆదుకోవాలని, అనాథలను అక్కున చేర్చుకోవాలని, అగత్యపరుల అవసరాలు తీర్చాలని, రుణగ్రస్తులను రుణవిముక్తులను చెయ్యాలని, అమాయక ఖైదీల విడుదలకు కృషి చెయ్యాలని, ఎవరు ఏవిధమైన కష్టనష్టాల్లో ఉన్నా, బాధల్లో ఉన్నా, వారు తెలిసిన వారయినా, తెలియని వారైనా, బంధువులైనా, కాకపోయినా, రాగ ద్వేషాలకు అతీతంగా వారి కష్టాలు, బాధలు తొలగించే ప్రయత్నం చెయ్యాలని పదే పదే ఉపదేశించారు.

ఎవరైతే కష్టాల్లో ఉన్న వ్యక్తి కష్టాన్ని దూరం చేస్తారో, అల్లాహ్ వారి కష్టాలను దూరం చేస్తాడని ప్రవక్త మహనీయులు బోధించారు. భూ వాసులపై కరుణ చూపేవారిపై ఆకాశవాసి కరుణ చూపుతాడని ఆయన చెప్పారు. కనుక అన్నిరకాల సంకుచితాలకు దూరంగా, సమస్త మానవులపై, ప్రాణులపై ప్రేమ, సానుభూతి కలిగి, ఉన్నంతలోనే అగత్యపరులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. దైవం మనందరికీ మంచి బుద్ధిని ప్రసాదించాలని, మనందరిలో సేవా గుణాన్ని నింపాలని మనసారా కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

నీతి రాజం

## యామున రాజనీతి-3 (ఆముక్త మాల్యద)

*దుర్గములాప్త ద్విజ వర వర్గమునకె*
*యిమ్ము దుర్గవత్త్వతిక*
*తృర్గళధరాధి రాజ్య వినిర్గత సాధ్వసత*
*పొదమ నిలుపకు కొలదిన్*



భావం: వీటిని కలిగిన ఆ బ్రాహ్మణ సమూహాలు, భూమండలాధిపత్యం చేత, పోయినటువంటి భయం కలిగేలా కొద్దిగా మాత్రమే ఉంచకూడదు. ప్రభుత్వంలో ఉండి పరిపాలన సాగించేవారికి నిత్యం శత్రు భయం ఉంటుంది. ఉత్తములైన బ్రాహ్మణులకు.. స్థల జల గిరి వన దుర్గాలను ప్రభువులు తప్పక ఇవ్వాలి. ఎటువంటి శత్రువు వచ్చినా భయపడకుండా ఎదిరించడానికి కావలసిన యుక్తమైన బలమైన సేనా సహకారం కోసం ఇటువంటి వానిని భరించాలి అని యామునాచార్యులు చెబుతున్నారు.




**సైకతం** కరోనాపై అవగాహన కల్పించేందుకు ఒడిశాలోని పూరీలో సముద్రతీరంలో శిల్పి సుదర్శన్ చెక్కిన సైకత శిల్పం.



**నో షేక్** షేక్ హ్యాండ్ బదులు మోచేతులు తాకించి పలకరించుకుంటున్న ట్రంప్, ఎల్‌హెచ్‌సీ అధికారి బ్రూస్



**విరామం** అమెరికాలో కరోనా కారణంగా దాదాపుగా నిర్మానుష్యమైన న్యూయార్క్ విమానాశ్రయం




**నివారణం** కోవిడ్‌ను ఆవు మూత్రం నివారిస్తుందంటూ ఢిల్లీలో గోపంచకం సేవిస్తున్న అఖిల భారత హిందూ మహాసభ సభ్యులు

# కోవిడ్.. జాతీయ విపత్తు

**న్యూఢిల్లీ:** కోవిడ్‌ను భారత్ జాతీయ విపత్తుగా ప్రకటించింది. వ్యాధి కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు హోంశాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు శనివారం రాసిన ఒక లేఖలో పేర్కొంది. కోవిడ్ ఉధృతి నేపథ్యంలో ప్రపంచబ్యాంకు ఈ వ్యాధిని మహమ్మారిగా ప్రకటించిన కారణంగా కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలని నిర్ణయించినట్లు తెలిపింది. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ కింద రాష్ట్రాలకు సాయం అందించేందుకు నిర్ణయించింది. కోవిడ్ చికిత్సకు ఆసుపత్రుల్లో చేరేవారి కోసం ఈ నిధులు రాష్ట్రాలకు అందిస్తామని, ఇందుకు తగిన రేట్లను ఆయా రాష్ట్రాలే నిర్ణయిస్తాయని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు కోవిడ్ బాధితులకు తాత్కాలిక వసతి ఇచ్చేందుకు, ఆహారం, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులను వాడుకోవచ్చు. క్వారంటైన్ క్యాంపుల సంఖ్య, ఎంత కాలం కొనసాగాలి? ఎంత మందిని ఈ క్యాంపుల్లో ఉంచాలన్నది రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయించుకుంటాయి. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులను థర్మల్ స్కానర్లు, వెంటిలేషన్ తదితర పరికరాల కొనుగోలుకూ వాడవచ్చునని హోం శాఖ తెలిపింది.

**మార్గదర్శకాలను ట్వీట్ చేసిన ప్రధాని**

కోవిడ్ వైరస్‌ను నిరోధించేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 'వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఇళ్లలోనే గడిపే సందర్భంలో తీసుకోవాల్సిన ఈ జాగ్రత్తలు మిమ్మల్నీ, మీ వాళ్లను రక్షించుకునేందుకు ఉపయోగపడతాయి' అని ట్వీట్ చేశారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు అటాచ్డ్ బాత్రూమ్ ఉండే, గాలి, వెలుతురు బాగా వచ్చే గదిలో ఉండాలని సూచించారు. ఎక్కువ మంది అదే గదిలో ఉండాల్సి వస్తే 3అడుగుల కంటే ఎక్కువ దూరంలో ఉండాలని చెప్పారు. వీలైనంత వరకు వృద్ధులు, గర్భిణులు, పిల్లలకు దూరంగా ఉండాలన్న ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను ట్వీట్‌లో పేర్కొన్నారు.

**పద్మ ప్రదానోత్సవాలు వాయిదా**

మార్చి 26, ఏప్రిల్ 3వ తేదీల్లో ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో జరగాల్సిన పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలను కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రప్రభుత్వం వాయిదావేసింది. వేర్వేరు రంగాల్లో విశేష కృషిచేసిన 141 మందికి కేంద్రప్రభుత్వం పద్మ అవార్డులు ప్రకటించడం తెల్సిందే. ఏడుగురికి పద్మ విభూషణ్, 16 మందికి పద్మభూషణ్, 118 మందికి పద్మశ్రీ అవార్డులను గతంలో ప్రకటించారు.

**అంత్యక్రియలపై మార్గదర్శకాలు**

ఢిల్లీలో వైరస్ కారణంగా మృతి చెందిన 68 ఏళ్ల మహిళ అంత్యక్రియలపై వివాదం చెలరేగిన నేపథ్యంలో కరోనా మృతుల అంతిమ సంస్కారాలపై మార్గదర్శకాలను రూపొందించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ సిద్ధమవుతోంది. మృతుల శరీరాల నుంచి ఇతరులకు వ్యాధి సోకే అవకాశం లేకపోయినప్పటికీ ప్రజల్లో అవగాహన పెంచేందుకు, అపోహలను తొలగించేందుకు ఈ మార్గదర్శకాలు దోహదంచేస్తాయి. శ్వాస సంబంధిత వ్యాధి అయిన కోవిడ్ దగ్గు, తుమ్ముల వల్ల బయటకు వచ్చే ద్రవాల ద్వారా మాత్రమే వ్యాపిస్తుందని, మార్చురీ నుంచి లేదా మృతదేహం నుంచి వ్యాపించే అవకాశం లేదని ఆరోగ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఎబోలా, నీపా వంటి వైరస్‌లు మృతుల శరీరాల నుంచి వెలువడే ద్రవాలను తాకడం ద్వారా రావచ్చుకానీ కరోనా అలా కాదని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం శరీరాన్ని తగు విధంగా చుట్టి దహనం/ఖననం చేయవచ్చునని పేర్కొనడం గమనార్హం.

## చిన్నారులపై చింత వద్దు



**మెల్‌బోర్న్:** వైరస్‌కు చిన్నారుల ఆరోగ్యం అంతగా ప్రభావితం కావడంలేదని శాస్త్రవేత్తలు గత కొద్దిరోజులుగా గుర్తిస్తున్నారు. తాజా పరిశోధనలోనూ కరోనా బాధితుల్లో చిన్నారుల సంఖ్య అత్యల్పమని, వైరస్ సోకినప్పటికీ దాని తీవ్రత వారిపై అంతగా లేదన్నది స్పష్టమైంది. పీడియాట్రిక్ ఇన్ఫెక్షియస్ డిసీజ్ జర్నల్‌లో ప్రచురితమైన వ్యాసంలో వైరస్ లక్షణాలు పిల్లల్లో తక్కువగా కనిపిస్తున్నాయనీ, వైరస్ సోకినప్పటికీ పెద్దవారితో పోల్చుకుంటే వ్యాధి తీవ్రత చాలాస్వల్పమని తేలింది. పెద్దలతో పాటు పిల్లలు వైరస్ ఇన్‌ఫెక్షన్‌కి గురవుతున్నారనీ, అయితే పెద్దల్లో మాదిరిగా తీవ్రమైన లక్షణాలు చిన్నారుల్లో కనిపించడంలేదని వెల్లడయ్యింది.

- కరోనా.. వైరస్ కుటుంబానికి చెందినవి.
- మనుషుల్లో వ్యాపించే కరోనావైరస్‌లు 4 రకాలు
- ఇవి ఎక్కువగా శ్వాసకోశ, జీర్ణాశయంలో ప్రభావం కలిగిస్తాయి.
- పెద్దలతో పోలిస్తే పిల్లలపై తక్కువ ప్రభావం చూపుతోంది.
- వృద్ధులపైనా, అనారోగ్యం బారినపడిన వారిపైనే ఎక్కువ ప్రభావం చూపుతోంది.
- పిల్లల నుంచి ఇతరులకు ఈ వైరస్ సంక్రమించడం కూడా అత్యల్పమే.
- వైరస్ సోకిన పిల్లలు సైతం ఒకటి రెండు వారాల్లో కోలుకుంటున్నారు.
- ఫిబ్రవరి 2020 నుంచి కరోనా కారణంగా మరణించిన పిల్లలు లేరు.
- ప్రధానంగా ఇంట్లో కుటుంబసభ్యుల నుంచే కోవిడ్ వైరస్ పిల్లలకు సంక్రమిస్తోంది.

## భారత్‌లో పాజిటివ్ కేసులు 88

**న్యూఢిల్లీ:** భారత్‌లో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 88కి పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, ఢిల్లీలకు చెందిన ఏడుగురు చికిత్స తరువాత ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు ఆరోగ్యశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కర్ణాటక, ఢిల్లీలలో ఆరుగురు చొప్పున ఉత్తరప్రదేశ్‌లో 11 మంది కొత్తగా వ్యాధి బారిన పడ్డారని రాజస్తాన్, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లలో ఒక్కొక్కరు కోవిడ్ బారిన పడ్డారని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో శుక్ర, శనివారాల్లో నలుగురు కరోనా వైరస్ బాధితులను గుర్తించడంతో ఆ రాష్ట్రంలో ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 26కు పెరిగింది. కేరళలో మొత్తం 19 మంది కోవిడ్ బారిన పడగా.. వీరిలో ముగ్గురు చికిత్స తరువాత డిశ్చార్జ్ అయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని పబ్‌లు, బహిరంగ ప్రదేశాలను మూసివేస్తున్నట్లు గోవా ప్రభుత్వం శనివారం ప్రకటించింది. విద్యాసంస్థలు, కేసినోలు, స్విమ్మింగ్‌పూల్స్ బంద్ చేయనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజిత్ రాణే తెలిపారు. మొత్తమ్మీద దేశంలో 88 మంది కరోనా వైరస్‌తో బాధపడుతూంటే వీరితో సన్నిహితంగా మెలిగిన మరో నాలుగు వేల మందిని గుర్తించి, వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి తెలిపారు.

**అన్ని రకాల ఏర్పాట్లూ చేశాం: ఆరోగ్యశాఖ**

కరోనా వైరస్‌ను నిరోధించే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లూ చేసిందని ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజీవ కుమార్ తెలిపారు. సామాజిక నిఘాతోపాటు, క్వారంటైన్, ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులు, శిక్షణ పొందిన సిబ్బంది, ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను అందుబాటులో ఉంచామని, రానున్న కాలంలో అన్ని రకాల ఆరోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు.

**ఇంటికి వెళ్లిపోయిన కోవిడ్ అనుమానితులు**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నలుగురు కరోనా బాధితులు ఆసుపత్రి సిబ్బంది విజ్ఞప్తులన్నింటినీ తోసిపుచ్చుతూ తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు. పరీక్షల ఫలితాలు అందాల్సి ఉందని చెబుతున్నా వారు పట్టించుకోకుండా శుక్రవారం ఇందిరాగాంధీ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి నుంచి వెళ్లిపోయినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. అయితే వీరిలో ముగ్గురు శనివారం మధ్యాహ్నానికి ఆసుపత్రికి తిరిగి రాగా నాలుగో వ్యక్తి అధికారుల ఆదేశాల మేరకు మళ్లీ ఆసుపత్రిలో చేరనున్నట్లు సమాచారం. మహారాష్ట్రలో శనివారం మరో ఇద్దరికి కరోనా వ్యాధి సోకినట్లు తేలడంతో రాష్ట్రంలో ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 26కి చేరుకుంది.

**పార్లమెంటులో సందర్శకులకు నో**

వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా పార్లమెంటు లోపలికి సందర్శకుల రాకను నిషేధించనున్నట్లు లోక్‌సభ సెక్రటేరియట్ శనివారం ప్రకటించింది. పార్లమెంటు ప్రాంగణంలోకి ప్రవేశానికి సంబంధించిన పాస్‌ల జారీ ప్రక్రియను నిలిపివేసింది.

# అమెరికాలో ఎమర్జెన్సీ

- ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- వ్యాధి నియంత్రణకు భారీ ఎత్తున నిధులు
- పరిస్థితి క్షీణించవచ్చునని హెచ్చరిక

**వాషింగ్టన్:** వైరస్ విస్తృతి నేపథ్యంలో తమ దేశంలో అత్యవసర పరిస్థితిని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. కరోనా కారణంగా జాతీయ ఎమర్జెన్సీని ప్రకటించిన నేపథ్యంలో వ్యాధి నియంత్రణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిధులు సుమారు 3.6 లక్షల కోట్ల రూపాయలు అందుబాటులోకి రానున్నాయి. వైరస్ కారణంగా ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా 5,700మందికిపైగా మరణించగా, 137 దేశాల్లో 1.51లక్షల మందికిపైగా వ్యాధి బారిన పడ్డారు. అమెరికాలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు రెండు వేల మంది కోవిడ్ బారిన పడ్డారు. 'పరిస్థితి క్షీణించే అవకాశం ఉంది' అని వైట్‌హౌస్‌లో ట్రంప్ మీడియాతో చెప్పారు. ప్రభుత్వం ఈ వ్యాధిపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టేందుకు వీలుగా నేషనల్ ఎమర్జెన్సీని విధించినట్లు ప్రకటించారు. అమెరికా చట్టాల ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ద్వారా భారీ ఎత్తున నిధులు అందుతాయి. దేశంలోని అన్ని ఆసుపత్రులు అత్యవసర పరిస్థితులకు సంబంధించిన ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితి విధించినప్పుడు అమెరికా ఆరోగ్య, ప్రజా సేవల మంత్రికి విశేష అధికారులు లభిస్తాయి. వైద్యులు, ఆసుపత్రులు, ఆరోగ్య కార్యకర్తలకు కోవిడ్ చికిత్సకు సంబంధించి తగిన చర్యలు తీసుకునేందుకు వెసులుబాటు లభిస్తుంది. ప్రజలందరికీ వైద్యసేవలు అందించేందుకు వీలుగా అన్ని అడ్డంకులను తొలగిస్తున్నట్లు ట్రంప్ విలేకరులతో చెప్పారు. ముడిచమురు ధరలు తగ్గివస్తున్న నేపథ్యంలో వ్యూహాత్మక నిల్వలను భారీగా పెంచాలని ట్రంప్ అధికారులను ఆదేశించారు.

**పరీక్షలు చేయించుకున్నా: ట్రంప్**

వ్యాధి లక్షణాలేవీ లేకున్నా... తాను కూడా కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నానని, ఫలితాల కోసం వేచిచూస్తున్నానని ట్రంప్ తెలిపారు. తనను కలసిన బ్రెజిల్ కమ్యూనికేషన్స్ చీఫ్ ఫాబియో వాజ్న్‌గార్టేన్‌కు వైరస్ సోకిన నేపథ్యంలో ట్రంప్ ఈ విషయం చెప్పారు.

- వైరస్ నేపథ్యంలో ఇటలీ వీధులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వారాంతపు రోజైన శనివారం రోమ్‌లో ఖాళీ వీధులు, మూసివేసిన దుకాణాలే దర్శనమిచ్చాయి. ఇటలీలో 17,660 మంది కోవిడ్ బారిన పడటం, 1226 మంది మరణించారు. ప్రధాని గుసెపీ కాంటే శుక్రవారం వ్యాపారవేత్తలతో, సంఘాలతో భేటీ అయ్యారు. దేశం స్తంభించిపోలేదని, ఉద్యోగాలు చేసుకునే వారికి రక్షణ కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు.
- కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు మరిన్ని మాస్కులు, మందులు పంపాల్సిందిగా ప్రధాని మోదీని కోరినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ తెలిపారు.
- ఆఫ్రికా దేశం రువాండాలో ఒక భారతీయుడు కోవిడ్ బారిన పడ్డాడు. ముంబై నుంచి మార్చి 8న కిగాలికి వచ్చిన వ్యక్తికి కోవిడ్ సోకిందని రువాండా ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి అతడి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.
- స్పెయిన్‌లో శుక్ర, శనివారాల మధ్య సుమారు 1500 మంది కరోనా బారినపడ్డారు. ఈ కొత్త కేసులతో ఇటలీ తరువాత అత్యధిక (5753) కేసులున్న దేశంగా స్పెయిన్ మారింది. స్పెయిన్‌లో ఇప్పటివరకూ ఈ వ్యాధి కారణంగా 136 మంది మరణించారు. వారం రోజుల్లో పదిరెట్లు పెరిగిన రోగబాధితులను దృష్టిలో ఉంచుకుని దేశం మొత్తమ్మీద నియంత్రణ చర్యలు తీసుకునేందుకు ప్రధాని పెడ్రో శాంచెజ్ సిద్ధమవుతున్నారు.
- కోవిడ్‌పై పోరాడేందుకు దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సమాఖ్య (సార్క్) ఏర్పాటు చేస్తున్న సమావేశం మన పౌరులకు ఉపయోగపడే ఫలితాన్ని ఇస్తుందని భావిస్తున్నట్లు ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఈ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానుంది. ప్రధాని ఈ భేటీని నడిపించనున్నారు. మోదీ నాయకత్వంలో ఈ భేటీ సాగేందుకు శ్రీలంక అధ్యక్షుడు గోతబయ రాజపక్స, మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీమ్ మొహమ్మద్ సోలిహ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి, భూటాన్ ప్రీమియర్ లోతయ్ షెరింగ్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, అఫ్గానిస్తాన్ ప్రభుత్వాలు అంగీకరించాయి. చివరగా పాకిస్తాన్ కూడా దీనికి అంగీకరించింది.

**కోవిడ్-19 (కరోనా వైరస్)**

| | |
|---|---|
| వ్యాప్తి చెందిన దేశాలు | 137 |
| కేసులు | 1,51,797 |
| మరణాలు | 5,764 |
| మరణాల రేటు | 3.79% |

**కోవిడ్ మరణాల రేటు (వయసుల వారీగా)**

| | |
|---|---|
| 80 ఏళ్లకి పైబడిన వారు | 18% |
| 70-79 మధ్య వయసు | 9.8% |
| 60-69 మధ్య వయసు | 4.6% |
| 50-59 | 1.3% |
| 40-49 | 0.4% |
| 30-39 | 0.18% |
| 20-29 | 0.09% |
| 10-19 | 0.02% |
| 0-9 | 0.01%కన్నా తక్కువ |

## ఇరాన్‌లో ఒక్కరోజే 97మంది బలి

- కరోనా మహమ్మారికి ఇరాన్‌లో శనివారం ఒక్కరోజే సుమారు 97 మంది బలి అయ్యారు. దీంతో ఇప్పటివరకూ ఈ వ్యాధి కారణంగా మరణించిన వారి సంఖ్య 611కు చేరుకుందని, 12,729 మంది వ్యాధి బారిన పడ్డారని ఇరాన్ అధికార టెలివిజన్ ఛానెల్ ప్రకటించింది. చైనా, ఇటలీల తరువాత ఇరాన్‌లోనే అత్యధిక సంఖ్యలో కోవిడ్ బాధితులున్నారు.
- చైనాలో మరణాలు గణనీయంగా తగ్గిపోయాయి. తాజాగా శుక్రవారం చైనా మొత్తమ్మీద 13 మంది కోవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోగా కొత్తగా వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 11గా ఉంది. నిర్ధారిత కేసుల సంఖ్య 80,8254కు చేరుకున్నట్లు ఆరోగ్య కమిషన్ అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ చైనాలో 3,189 మంది కోవిడ్ కారణంగా మరణించారు.

# సెల్‌ఫోన్లపై జీఎస్టీ ఇకపై 18%

- 6 శాతం పెంపు
- జీఎస్టీ నెట్‌వర్క్ డిజైన్ మార్పు బాధ్యత ఇన్ఫోసిస్‌కు
- ఆర్థిక మంత్రి సీతారామన్




**న్యూఢిల్లీ:** మొబైల్ ఫోన్లపై జీఎస్టీని 18 శాతానికి పెంచాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. ఇది ఏప్రిల్ 1నుంచి అమలవనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఇక్కడ జరిగిన 39వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఈ మేరకు అంగీకరించింది. వినియోగదారుల సమస్యలను అధిగమించేలా జీఎస్టీ నెట్‌వర్క్ డిజైన్ మెరుగుపరచాలని ఈ సమావేశం ఇన్ఫోసిస్‌ను కోరింది.

- పూర్తి స్థాయిలో జీఎస్టీ నెట్‌వర్క్ సామర్థ్యం పెంపు, నిపుణులైన సిబ్బంది నియామకం, సమస్యలకు సులభ పరిష్కారాలు చూపడం వంటివి ఈ ఏడాది జూలై కల్లా పూర్తి కావాలి. కొత్త వ్యవస్థ 2021 జనవరి నుంచి అమల్లోకి వస్తుంది.
- మొబైల్ ఫోన్లు, కొన్ని కీలక విడిభాగాలపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 18 శాతానికి పెంచింది.
- విమానాల మెయింటెనెన్స్ అండ్ రిపైర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో)సేవలపై జీఎస్టీ రేటును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. దీనివల్ల ఎంఆర్‌వో సేవలు దేశంలోనే ప్రారంభం కావడానికి అవకాశం ఏర్పడుతుంది.
- ఈ-వాయిస్, క్యూఆర్ కోడ్ అక్టోబర్ ఒకటి నుంచి అమలు చేయాలని నిర్ణయించింది.
- ఎగుమతిదారులకు ఈ-వాలెట్ స్కీం నమోదు గడువును 2021 మార్చి 31కి పొడిగించింది.
- ఆలస్యమైన జీఎస్టీ చెల్లింపులపై వడ్డీని జూలై 2017 నుంచి అమలయ్యేలా చట్టాన్ని సవరణకు నిర్ణయం.
- మార్చి 14 వరకు జీఎస్టీ రిజిస్ట్రేషన్లు రద్దయిన వారు కావాలనుకుంటే తిరిగి జూన్ 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- 2018–19 సంవత్సరంలో రూ.5 కోట్ల లోపు టర్నోవర్ ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యశ్రేణి వ్యాపార సంస్థలకు జీఎస్‌టీఆర్–9సీ దాఖలు చేయనవసరం లేకుండా మినహాయింపు నిచ్చింది.
- జీఎస్టీ కింద రిజిస్టరయిన ప్రతి వ్యక్తి తన వ్యాపారానికి అనుగుణంగా సరఫరాదారుల ప్రాథమిక సమాచారం తెలుసునేందుకు వీలుగా త్వరలో 'నో యువర్ సప్లయర్' పేరుతో కొత్త సౌకర్యం.



**కుంభ వృష్టి** ఢిల్లీలోని విజయ్ చౌక్‌లో శనివారం భారీగా కురుస్తున్న వర్షం. (ఇన్‌సెట్లో) రోడ్డుపై పడిన వడగళ్లు

## మందుపాతర పేల్చిన మావోలు

### ఇద్దరు జవాన్లు మృతి

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు రెచ్చిపోయారు. బస్తర్ జిల్లాలో శనివారం మందుపాతర పేల్చారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు జవాన్లు మృతి చెందగా మరో జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌రాజ్ కథనం ప్రకారం.. జిల్లాలోని బాన్సూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొద్దీ–బాల్వాయి గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు పనుల వద్ద భద్రతగా నిలిచేందుకు బాన్సూర్ పోలీస్ స్టేషన్ నుంచి సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక బలగాలు వెళ్తుండగా, మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ఉపేందర్ సాహూ, దేవేందర్ సాహూ మృతిచెందారు. సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు తీవ్ర గాయాలు కాగా ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించి వైద్య సేవలనందిస్తున్నారు. మందుపాతర పేల్చిన అనంతరం మావోయిస్టులు, పోలీసులకు మధ్య 15 నిమిషాల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. తప్పించుకున్న మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున కూంబింగ్ చేపట్టారు.

# కమల్‌నాథ్‌కు 'కోవిడ్' ఊరట?

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వాయిదా?
- భద్రత కల్పించాలంటూ గవర్నర్‌కు 22 మంది ఎమ్మెల్యేల లేఖ

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని కమల్‌నాథ్ ప్రభుత్వానికి కోవిడ్‌తో తాత్కాలిక ఊరట లభించనుందా? అంటే అవుననే సమాధానం వస్తుంది. ఈ నెల 16వ తేదీ నుంచి బడ్జెట్ సమావేశాలు మొదలు కానుండగా ఎమ్మెల్యేల వేరు కుంపటితో ప్రభుత్వ మనుగడే ప్రమాదంలో పడిన విషయం తెలిసిందే. కోవిడ్ భయంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు అప్రమత్తత ప్రకటించాయి. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పలు చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన కీలకమైన బడ్జెట్ సమావేశాలను వాయిదా వేయనున్నట్లు సూచనప్రాయంగా ప్రకటించింది. శనివారం మధ్యప్రదేశ్ ఆర్థిక మంత్రి తరుణ్ భానోత్ మీడియాతో మాట్లాడారు. 'వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపైనా నిపుణులతో చర్చిస్తున్నాం' అని తెలిపారు. అసెంబ్లీ వాయిదాపడితే విశ్వాస పరీక్షను ఎదుర్కొనే అవసరం కూడా ప్రస్తుతానికి కమల్‌నాథ్ ప్రభుత్వానికి తప్పనుంది.

**విశ్వాసపరీక్ష జరపాలి: బీజేపీ**

బడ్జెట్ సమావేశాల కంటే ముందుగానే మధ్యప్రదేశ్ ప్రభుత్వం విశ్వాస పరీక్ష చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని ప్రతినిధి వర్గం గవర్నర్ టాండన్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం శివరాజ్ సింగ్ చౌహాన్ మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్‌కు చెందిన 22 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. ప్రభుత్వం మైనారిటీలో పడింది. బడ్జెట్ సమావేశాలకు ముందుగా ఆదివారమే బలపరీక్ష చేపట్టాలి' అని గవర్నర్‌ను కోరామన్నారు. కాగా, శుక్రవారం సాయంత్రం విమానాశ్రయం నుంచి వెళ్తున్న బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా ఎదుట నల్ల జెండాలు ప్రదర్శించిన 35 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

# పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు

- పెట్రో ధరలు యథాతథం
- వినియోగదారునికి చేరని లబ్ధి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల తగ్గుదల ఫలితం ఇకపై దేశీయ వినియోగదారుకు అందదు. ఎందుకంటే, ఆ మేరకు కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున ఎక్సైజ్ డ్యూటీ పెంచింది. ఈ నిర్ణయంతో పెట్రో ధరల్లో ఎలాంటి మార్పు ఉండదు. దీని ఫలితంగా కేంద్రానికి రూ.39వేల కోట్ల ఆదాయం అదనంగా సమకూరనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మొత్తాన్ని అభివృద్ధి పథకాలు, మౌలికరంగ వసతుల కోసం వెచ్చించనున్నట్లు కేంద్రం తెలిపింది. తాజా పెంపుతో లీటరు పెట్రోల్‌పై స్పెషల్ ఎక్సైజ్ డ్యూటీ రూ.8 వరకు చేరుకోగా డీజిల్‌పై స్పెషల్ ఎక్సైజ్ డ్యూటీ రూ.4కు పెరిగినట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ శనివారం జారీ చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. అదనంగా రోడ్ సెస్సు.. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.1 చొప్పున పెరిగి రూ.10కి చేరింది. అంతిమంగా ఎక్సైజ్ డ్యూటీ లీటరు పెట్రోల్‌పై రూ.22.98కు, డీజిల్‌పై 18.83కు చేరుకున్నట్లయింది. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.69.87, డీజిల్ రూ.62.58కి అందుబాటులో ఉంది. మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన సమయంలో పెట్రోల్‌పై ఎక్సైజ్ పన్ను లీటరుకు రూ.9.48, డీజిల్‌పై రూ.3.56గా ఉంది.

**కాంగ్రెస్ మండిపాటు**

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపును కాంగ్రెస్ విమర్శించింది.అంతర్జాతీయంగా తగ్గిన ధరల ప్రభావం ఆ మేరకు వినియోగదారుకు అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరింది.



రాజస్తాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లాలో షెఘర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నూతన దంపతులు సహా 11 మంది మృతి చెందారు. వీరంతా కారులో గుడికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
15-3-2020

- ఐపీఎల్ షెడ్యూల్‌పై బీసీసీఐ తర్జనభర్జన
- ఎప్పుడు మొదలయ్యేది చెప్పనేలేదు
- ఒకవేళ జరిగినా... కుదింపే: గంగూలీ
- బోర్డు దగ్గర పలు ప్రత్యామ్నాయాలు

# వేచి చూద్దాం!


బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ, కార్యదర్శి జై షా

**ఐపీఎల్ 13వ సీజన్‌పై 'కరోనా' కమ్ముకుంది. ఇప్పుడైతే నిలిపివేశారు కానీ ఎప్పుడు జరిగేది ఎవరికీ తెలియదు. ఆపాలన్నా... జరపాలన్నా... ఏ నిర్ణయం తీసుకోవాలన్నా వేచి చూసే ధోరణి తప్ప కచ్చితమైన నిర్ణయం తీసుకునే స్థితిలో క్రికెట్ బోర్డు కూడా లేదు. రాష్ట్ర ప్రభుత్వాలన్నీ స్కూళ్లను, సినిమా హాళ్లను, షాపింగ్ మాల్స్‌ను మూసివేయిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో విదేశీయులతో కలిసి ఆడే మ్యాచ్‌లను అనుమతిస్తాయని ఏమాత్రం ఆశించలేం. దీంతో దాదాపు ఈ సీజన్ విజేత 'కరోనా'యే కావొచ్చు. అంటే మ్యాచ్‌లన్నీ రద్దు కావచ్చు!**


షారుఖ్ ఖాన్ (కోల్‌కతా నైట్ రైడర్స్)


నెస్ వాడియా (కింగ్స్ ఎలెవన్ పంజాబ్)


పార్థ్ జిందాల్ (ఢిల్లీ క్యాపిటల్స్)


ఆకాశ్ అంబానీ (ముంబై ఇండియన్స్)

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఒక టోర్నీ! ఓ ఎనిమిది ఫ్రాంచైజీలు ఆడేది! ఎనిమిది నగరాల్లో జరిగేది! కానీ వేలాది మందిని ప్రత్యక్షంగా మురిపించేది. కోట్ల మందిని పరోక్షంగా అలరించేది. వేసవంతా డిజిటల్, టీవీ, మల్టీస్క్రీన్, ఓపెన్ ప్రొజెక్టర్ స్క్రీన్ ఇలా తెరల నిండా ఐపీఎల్ మ్యాచ్‌లే కనువిందు చేస్తాయి. వేల కోట్ల రూపాయల సామ్రాజ్యానికి ఐపీఎల్ వేదిక. అందుకేనేమో భారత క్రికెట్ నియంత్రణ మండలికి (బీసీసీఐ) ఐపీఎల్‌ను ఆపేసేందుకు మనసు రావడం లేదు. అలా అని ఆడించేందుకు ముందుకు రావడం లేదు. ఏదైనా సరే వేచి చూద్దాంలే అనే ధోరణిలో ఉంది. కానీ బయటి పరిస్థితులు (భారత్‌లో) వేగంగా మారిపోతున్నాయి. కాదు... కాదు... మారిపోయాయి కూడా. రాష్ట్రాలన్నీ సమూహ వేదికల్ని మూసేస్తున్నాయి. పాఠాలు ఆగాయి. ప్రదర్శన (సినిమా)లు నిలిచిపోయాయి. వాణిజ్య సముదాయాల్ని మూసేశాయి. ఇంత చేసిన రాష్ట్ర ప్రభుత్వాలు ఐపీఎల్ ఆటల్ని సాగనిస్తాయా అనేదే అసలు ప్రశ్న. దీనికి సమాధానం అందరికీ తెలిసిందే. కచ్చితంగా 'కుదరదు', 'జరగనివ్వదు'! అంతే.

### ఆలస్యం సరే! మరి జరిగే మార్గమేది?

కరోనా ప్రభావం ప్రపంచానికే తెలిసిపోయింది. అందుకే వణికిపోతోంది. అలాంటిది బీసీసీఐకి మాత్రం తెలియకుండా ఉంటుందా... కచ్చితంగా తెలుసు! ఎప్పటికప్పుడు తెలుసుకొనే ఉంటుంది. కానీ ఫక్తు వ్యాపార కేంద్రమైనా లీగ్‌ను ఒక్క మాటతో రద్దు చేయలేదు. అలా చేస్తే వందల కోట్లు వెచ్చించిన ఫ్రాంచైజీలు, కోట్లు వెచ్చించిన స్పాన్సర్లు, వేల కోట్లు గుమ్మరించిన బ్రాడ్‌కాస్టింగ్ చానెళ్లు, గ్రౌండ్ రైట్స్ కొన్న పబ్లిసిటీ సంస్థలు, కాంట్రాక్టులు పొందిన లాజిస్టిక్ కంపెనీలు ఏమాత్రం ఊరుకోవు. తమకు ఆర్థిక సర్దుబాటు చేయాల్సిందేనని అమాంతం బోర్డు మీద పడిపోతాయి. అందుకే మొదట వచ్చేనెల 15 దాకా నిలిపివేత అని ప్రకటించింది క్రికెట్ బోర్డు. కానీ 16 నుంచి జరుగుతుందని మాత్రం చెప్పలేదు. చెబితే షెడ్యూల్ విడుదల చేస్తుంది. చూస్తుంటే ఈ సూచనలన్నీ రద్దుకేనా అన్నట్లు కనబడుతున్నాయి.

### 'దాదా' చెప్పింది అదే!

తాజాగా బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ మీడియాతో మాట్లాడుతూ 'ఒక వేళ నిర్వహిస్తే... టోర్నీని 'కట్... కట్...'లతో ముగిస్తాం' అని చెప్పారు. అంటే జరిపే పరిస్థితి అంటూ ఉంటేనే... కుదింపు అని చెప్పకనే చెప్పారు. బీసీసీఐ నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఫ్రాంచైజీల యజమానులు పాల్గొన్నారు. పంజాబ్ సహ యజమాని నెస్ వాడియా మాట్లాడుతూ 'ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏమీ చెప్పలేం. ఏమీ చేయలేం. ఇది అందరికీ తెలిసిన సంగతే. ఇలాంటి తరుణంలో ఎప్పుడు మొదలయ్యేది ఎలా చెబుతాం. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూనే ఉన్నాం. రెండు, మూడు వారాల తర్వాత గానీ ఏ విషయంపై స్పష్టత రాదేమో' అని చెప్పారు. బోర్డు దగ్గర ఆరు, ఏడు ఆప్షన్లు ఉన్నాయని పరిస్థితిని బట్టి వాటిని వెల్లడించవచ్చని బోర్డు వర్గాలు తెలిపాయి. టోర్నీ జరిగే పక్షంలో ఒకప్పటిలా రెండు నెలల సుదీర్ఘ షెడ్యూలు నిర్వహించే పరిస్థితి ఈ సీజన్‌కు లేదు. ఇంకా చెప్పాలంటే రెండు వారాలు లేదంటే 20 రోజుల్లోనే ముగించే అంశాల పైనే బోర్డు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## 'దేశవాళీ'ది... అదే గతి!

### అన్ని మ్యాచ్‌లనూ నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటన

కరోనా మహమ్మారి వల్ల ఈ సీజన్ ఒక్క రంజీ ట్రోఫీతోనే సరిపెట్టుకునే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే బీసీసీఐ ఐపీఎల్–13ను వచ్చేనెల 15 వరకు వాయిదా మాటున నిలిపివేసింది. ఇక దేశవాళీ టోర్నీలది అదే దారి. రెస్టాఫ్ ఇండియా, రంజీ చాంప్ సౌరాష్ట్ర జట్ల మధ్య జరిగే ఇరానీ కప్ సహా, విజయ్ హజారే ట్రోఫీ, సీనియర్ మహిళల వన్డే నాకౌట్ టోర్నీ, సీనియర్ మహిళల వన్డే చాలెంజర్ ట్రోఫీ, జూనియర్ మహిళల టోర్నమెంట్లు, అండర్–19 వన్డే నాకౌట్ టోర్నీ, అండర్–19 టి20 లీగ్, సూపర్ లీగ్, నాకౌట్ టోర్నీ, చాలెంజర్ ట్రోఫీ, అండర్–23లో నాకౌట్, వన్డే చాలెంజర్ టోర్నీలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా ఒక ప్రకటనలో తెలిపారు.

# కరోనా కల్లోలం...

## వాయిదా పడ్డ హాకీ ప్రొ లీగ్

**లుసానే:** కరోనా (కోవిడ్–19) దెబ్బకు స్పోర్ట్స్ ఈవెంట్‌ల వాయిదా పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే ఐపీఎల్, ఈపీఎల్, ఎన్‌బీఏ, ఫార్ములావన్, బ్యాడ్మింటన్, టెన్నిస్‌లాంటి విఖ్యాత స్పోర్ట్స్ ఈవెంట్స్ వాయిదా పడగా... తాజాగా ఆ జాబితాలోకి హాకీ ప్రొ లీగ్ కూడా జరిగింది. ప్రస్తుతం జరుగుతోన్న ఈ లీగ్ రెండో సీజన్‌లో ఏప్రిల్ 15 వరకు జరిగే అన్ని మ్యాచ్‌లను రద్దు చేస్తున్నట్లు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) శనివారం ప్రకటించింది. అయితే వీటిని తిరిగి నిర్వహించేది లేనిది తెలియాల్సి ఉంది. 'కరోనాపై మాకు అందుతున్న సమాచారం, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆదేశాలతో పాటు వివిధ దేశాల ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను పరిగణలోకి తీసుకుంటూ... ఏప్రిల్ 15 వరకు జరిగే ప్రొ లీగ్ మ్యాచ్‌లను రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నాం' అని ఎఫ్ఐహెచ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ లీగ్‌లో ఆడుతున్న హాకీ దేశాల సంఘాలతో చర్చించాకే ఎఫ్ఐహెచ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ నాటికి కరోనా ఉధృతి తగ్గినట్లయితే... అదే నెల చివర్లో ఈ లీగ్ పునఃప్రారంభమయ్యే అవకాశం ఉందని ఎఫ్ఐహెచ్ పేర్కొంది. ఈ లీగ్‌లో మొత్తం 9 జట్లు పాల్గొంటుండగా... భారత్ తన తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 26న బెర్లిన్ వేదికగా జర్మనీతో ఆడాల్సి ఉంది.

### 31 వరకు దేశంలో 'నో' ఫుట్‌బాల్

**న్యూఢిల్లీ:** దేశంలో జరిగే అన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లను ఈ నెల 31 వరకు రద్దు చేస్తూ అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) శనివారం నిర్ణయం తీసుకుంది. దాంతో ఐ–లీగ్, డివిజన్–2, యూత్ లీగ్, గోల్డెన్ లీగ్, జాతీయ టోర్నీలు రద్దయ్యాయి. ఐ–లీగ్‌లోని 28 మ్యాచ్‌లను ప్రేక్షకులు లేకుండానే నిర్వహించాలని ఏఐఎఫ్ఎఫ్ తొలుత అనుకున్నా... కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సలహా మేరకు ఈ నెల చివరి వరకు దేశంలో ఎటువంటి ఫుట్‌బాల్ మ్యాచ్‌లను నిర్వహించరాదని నిర్ణయించింది.

### ఫెర్గూసన్‌కు కరోనా లేదు...



**సిడ్నీ:** న్యూజిలాండ్ పేసర్ లూకీ ఫెర్గూసన్‌కు కరోనా లేదని తేలింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తొలి వన్డే అనంతరం తనకు గొంతు నొప్పి ఉందని ఫెర్గూసన్ చెప్పడంతో అతడికి వెంటనే కరోనా పరీక్షలు నిర్వహించారు. శనివారం వచ్చిన ఫలితాల్లో కరోనా లేదని తేలడంతో అతడు న్యూజిలాండ్ వెళ్లడానికి మార్గం సుగమం అయింది.



### ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్ రద్దు

**సిడ్నీ:** ప్రేక్షకులు లేకుండా ఖాళీ మైదానంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి వన్డే జరిగింది. అయితే కరోనా వైరస్ వ్యాప్తి ప్రమాదకరంగా మారడంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) న్యూజిలాండ్‌తో జరిగే తదుపరి రెండు వన్డేలతోపాటు మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను కూడా అర్ధంతరంగా రద్దు చేసింది. సిడ్నీలో జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ జట్టు 71 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం కూడా చేసుకోలేదు. మోచేతులను తాకించుకుంటూ అభినందించుకున్నారు.

### ఫ్రెండ్లీ మ్యాచ్ రద్దు



**బెర్లిన్:** జర్మనీ, ఇటలీ ఫుట్‌బాల్ జట్ల మధ్య ఈ నెల 31న జరగాల్సిన ఫ్రెండ్లీ మ్యాచ్ రద్దయింది. ఈ మ్యాచ్ బవేరియా ప్రాంతం (జర్మనీలో)లోని న్యూరెమ్‌బర్గ్‌లో జరగాల్సి ఉండగా... ప్రస్తుతం అక్కడ కరోనా ఉధృతి అధికంగా ఉండటంతో బహిరంగ ప్రదేశాల్లో 100 మందికి మించి జనం గుమికూడదని ఆ దేశ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో నిర్వాహకులు ఈ మ్యాచ్‌ను రద్దు చేశారు. తొలుత ప్రేక్షకులు లేకుండా మ్యాచ్‌ను జరపాలని అనుకున్నా... జట్టు సభ్యులు, వారి సిబ్బంది, మీడియా ప్రతినిధులు, సెక్యూరిటీతో స్టేడియంలోని జనం సంఖ్య 100 మందికిపైగా చేరుకుంటుండటంతో రద్దు చేయడానికే జర్మనీ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయించుకుంది.



### భారత హాకీ కోచ్ ప్రయాణం వాయిదా

**న్యూఢిల్లీ:** వారం రోజుల పాటు కుటుంబంతో గడపడానికి స్వదేశానికి వెళ్లాలనుకున్న భారత హాకీ మహిళల జట్టు కోచ్ జోయర్డ్ మరీనే (నెదర్లాండ్స్)ను కరోనా అడ్డుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ వైరస్ విజృంభిస్తుండటంతో ప్రయాణాన్ని చివరి నిమిషంలో రద్దు చేసుకున్నట్లు అతను తెలిపాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణం చేయడం మంచిది కాదని తాను భావించడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు 45 ఏళ్ల మరీనే పేర్కొన్నాడు.

# కోల్‌కతాకే ఐఎస్ఎల్ కిరీటం

- ఫైనల్లో చెన్నైయిన్‌పై గెలుపు
- మూడు సార్లు టైటిల్ నెగ్గిన తొలి జట్టుగా ఘనత



**గోవా:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్ చరిత్రలో అట్లెటికో డి కోల్‌కతా జట్టు చరిత్ర సృష్టించింది. శనివారం జరిగిన ఆరో సీజన్ ఫైనల్లో కోల్‌కతా 3–1 గోల్స్ తేడాతో చెన్నైయిన్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. దాంతో ఐఎస్ఎల్ టైటిల్‌ను అత్యధికంగా మూడుసార్లు గెలిచిన తొలి జట్టుగా గుర్తింపు పొందింది. ఇప్పటివరకు ఆరు సీజన్‌లు జరగ్గా... అందులో కోల్‌కతా (2014, 2016, 2019–20), చెన్నైయిన్ రెండు సార్లు (2015, 2017–18), బెంగళూరు ఒకసారి (2018–19) విజేతలుగా నిలిచాయి. ప్రేక్షకులు లేకుండా ఖాళీ మైదానంలో నిర్వహించిన ఫైనల్లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన కోల్‌కతా అందివచ్చిన ఏ అవకాశాన్ని వదల్లేదు. కోల్‌కతా ప్లేయర్ జావీ (10వ, 90+3వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... గార్సియా (48వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. చెన్నైయిన్ తరఫున వాల్‌స్కిస్ (69వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. రెండో అర్ధభాగంలో చెన్నైయిన్ ప్లేయర్లు గోల్ కోసం చేసిన ప్రయత్నాలను కోల్‌కతా గోల్ కీపర్ అరిందామ్ భట్టాచార్య సమర్థవంతంగా అడ్డుకున్నాడు. సీజన్ చాంపియన్ కోల్‌కతాకు రూ. 8 కోట్లు... రన్నరప్ చెన్నైయిన్ రూ. 4 కోట్లు ప్రైజ్‌మనీగా లభించాయి. 15 గోల్స్ సాధించిన చెన్నైయిన్ ఆటగాడు వాల్‌స్కిస్‌కు 'గోల్డెన్ బూట్' అవార్డు దక్కింది. గోల్డెన్ గ్లవ్ అవార్డును బెంగళూరు ఎఫ్‌సీ గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు గెల్చుకున్నాడు. ఎమర్జింగ్ ప్లేయర్ సుమీత్ (కోల్‌కతా)... 'హీరో ఆఫ్ ద లీగ్'గా హ్యూగో బౌమౌస్ (గోవా ఎఫ్‌సీ) నిలిచారు.

## దృఢంగా ఉండండి వ్యాప్తి చెందకుండా చూడండి

### 'కరోనా'పై కోహ్లి సందేశం



**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి ట్విట్టర్‌లో స్పందించాడు. ముందు జాగ్రత్త చర్యలతో వైరస్ రాకుండా చూసుకోవడంతో పాటు ఇతరులకు వ్యాప్తి చెందకుండా వ్యవహరించాలని సందేశమిచ్చాడు. 'ఇలాంటి సమయంలోనే మనమంతా దృఢచిత్తంతో ఉండాలి. కోవిడ్–19పై పోరాడాలి. వైరస్ వ్యాపించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలి. అందరూ అప్రమత్తంగా ఉండండి. నేను చెప్పేది గుర్తుంచుకోండి. వచ్చాక నివారించడం కంటే రాకుండా నిరోధించడమే ఉత్తమం' అని కోహ్లి ట్వీట్ చేశాడు. శుక్రవారం భారత కెప్టెన్ లక్నో విమానాశ్రయంలో ముఖానికి నలుపు మాస్క్‌తో కనిపించాడు. భారత దిగ్గజం, హైదరాబాద్ స్టయిలిష్ బ్యాట్స్‌మన్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా ట్విట్టర్ వేదికగా జాగ్రత్తలు సూచించాడు. 'అందరికీ విన్నపం. ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలి. లక్షణాలుంటే... పరీక్ష చేసుకోవాలి. పాజిటివ్ రిపోర్ట్ వస్తే... బయటికి రాకుండా, ఇంకొకరికి సోకకుండా ఐసోలేషన్ వార్డులో చికిత్స తీసుకోవాలి. కలిసికట్టుగా కోవిడ్–19పై విజయం సాధించాలి' అని లక్ష్మణ్ ట్వీట్ చేశాడు.

### ఆల్ ఇంగ్లండ్ టోర్నీ ఫైనల్లో చెన్ యుఫె



**బర్మింగ్‌హామ్:** ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ చెన్ యుఫె (చైనా) ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో టాప్ సీడ్ చెన్ యుఫె 21–14, 23–21తో నాలుగో సీడ్, ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై నెగ్గింది. పురుషుల సింగిల్స్‌లో గతేడాది రన్నరప్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. సెమీఫైనల్లో అక్సెల్‌సన్ 17–21, 21–13, 21–19తో లీ జి జియా (మలేసియా)ను ఓడించాడు.

## షెడ్యూల్ ప్రకారమే ఒలింపిక్స్: జపాన్ ప్రధాని

**టోక్యో:** కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్నప్పటికీ అన్ని జాగ్రత్తలతో టోక్యో ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని జపాన్ ప్రధాని షింజో అబే స్పష్టం చేశారు. ఇటీవల టోక్యో మెగా ఈవెంట్‌ను వాయిదా వేయాలనే ఒత్తిళ్లు వస్తున్న నేపథ్యంలో ఆయన స్వయంగా స్పందించారు. షెడ్యూల్‌పై భరోసా కూడా ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశ్వక్రీడల్ని వాయిదా వేయాలని సలహా ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో జపాన్ ప్రధాని షింజో శనివారం మీడియాతో మాట్లాడుతూ 'మేం వైరస్‌పై అప్రమత్తంగా ఉన్నాం. సంబంధిత వర్గాలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తోనూ సంప్రదింపులు జరుపుతున్నాం. అయితే టోక్యోలో మెగా ఈవెంట్ నిర్వహణలో ఎలాంటి మార్పుల్లేవు. షెడ్యూల్ ప్రకారం పోటీలను నిర్వహిస్తాం. ఎవరికీ ఇబ్బందుల్లేకుండా... పక్కా ప్రణాళికతో, వైరస్ వ్యాప్తిని నిరోధించే జాగ్రత్తలతో ఒలింపిక్స్‌ను ఘనంగా నిర్వహిస్తాం. విశ్వక్రీడలు విజయవంతమయ్యేందుకు అమెరికాతో కలిసి సమన్వయంతో పనిచేస్తాం' అని అన్నారు.



epaper.sakshi.com





# కరోనా ప్రభావం చూపించేది ఇలా...

కరోనా మన శరీరంపై ఎలా ప్రభావం చూపిస్తుందో ప్రముఖ జర్నల్ లాన్సెట్ తాజా సంచికలో ఒక నివేదిక ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం ఈ వైరస్ సోకిన అయిదు రోజుల వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఆ తర్వాత జ్వరం, గొంతు నొప్పి, జలుబుతో ప్రభావం మొదలవుతుంది.. ఒక్కోసారి లక్షణాలు బయటపడడానికి 14 రోజులు కూడా పడుతుంది. కరోనా వైరస్ శరీరంపై ప్రభావం చూపించడం మొదలు పెట్టిన దగ్గర్నుంచి ఏయే రోజుల్లో ఎలా ఉంటుందంటే ..



### 1-3 రోజులు

- కరోనా వైరస్ శరీరంపై ప్రభావం చూపించగానే మొదట ఒళ్లు వెచ్చబడుతుంది.
- గొంతు నొప్పి, దగ్గు, జలుబు వంటివి మూడో రోజు నుంచి కనిపిస్తాయి.

**కరోనా బాధితుల్లో లక్షణాలు ఇలా మొదలైన వారు: 80%**



### 4-9 రోజులు



- మూడు నుంచి నాలుగు రోజుల మధ్య ఈ వైరస్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. దీంతో శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతాయి. జ్వరం కూడా పెరుగుతుంది. తొమ్మిది రోజులు గడిచేసరికి ఊపిరి అందడం చాలా కష్టమవుతుంది. కొందరిలో గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వస్తాయి.

**శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నవారు : 14%**

### 8-15 రోజులు



- ఊపిరితిత్తుల నుంచి ఇన్‌ఫెక్షన్ రక్తంలోకి చేరుతుంది. ఇది అత్యంత ప్రమాదకరమైన స్థితి. ప్రాణాంతకమైన సెప్సిస్ (బ్లడ్ ఇన్ ఫెక్షన్) ఒక వారం తర్వాత మొదలవుతుంది. అప్పట్నుంచి రెండు వారాల పాటు బాధితుల్ని కాపాడుకోవడానికి అత్యంత జాగరూకత అవసరం. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి వారికి చికిత్స అందించాలి.

**బాధితుల్లో ఈ పరిస్థితి వచ్చిన వారు : 5%**

### 3 వారాల తర్వాత

- రోగనిరోధక శక్తి అధికంగా ఉండి మరే ఇతర జబ్బులు లేని వారు కరోనాను జయించడం సులభమే. హైపర్ టెన్షన్, షుగర్, గుండె జబ్బులు ఉన్నవారు, 60 ఏళ్ల పైబడిన వారికి ఈ వ్యాధితో ఎక్కువ ముప్పు.

**కరోనా మృతుల శాతం : 3 నుంచి 4 శాతం**





వేములవాడ పురవీధుల్లో రాజన్న రథోత్సవం

## వైభవంగా రాజన్న రథోత్సవం

### భారీగా తరలివచ్చిన జనం

**వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శ్రీరాజరాజేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దారిపొడవునా భక్తులు రంగులు చల్లుకుని వేడుక చేసుకున్నారు. రథోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

## నీటి సంపులో పడి బాలుడు మృతి



అశ్వంత్ (ఫైల్)

**జగదేవ్‌పూర్ (గజ్వేల్):** నీటి సంపులో పడి పది నెలల పసి బాలుడు మృతి చెందాడు. కళ్లముందే కన్న కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో శనివారం ఈ విషాద కరమైన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బరిగె ప్రభాకర్, అనూష దంపతుల కొడుకు అశ్వంత్. మధ్యాహ్నం బాబు అరుగుపై ఆడుతుండగా, తల్లి నీటి సంపు వద్ద బట్టలను ఉతుకుతోంది. ఈ క్రమంలో బాబు తల్లి వద్దకు వస్తూ పక్కనే ఉన్న నీటి సంపులో పడిపోయాడు. వెంటనే తల్లి కొడుకును కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ సంపు నిండా నీరు ఉండటంతో బాబు మునిగిపోయాడు. ఆమె అరుపులకు చుట్టు పక్కల వారు వచ్చి బాబును సంపులో నుంచి బయటకు తీశారు. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు బాబును పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కళ్ల ముందే కొడుకు మృతి చెందడంతో తల్లి రోదనలు మిన్నంటాయి.

## ఇంటర్ ఒకేషనల్ ప్రశ్నపత్రం తారుమారు

### సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో ఘటన

**మిరుదొడ్డి (దుబ్బాక):** ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ఎన్‌పీహెచ్‌డబ్ల్యూ (నర్స్‌కోర్స్) ఒకేషనల్ పరీక్ష రాసే మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం ఇవ్వాల్సిన ప్రశ్నపత్రం తారుమారైంది. విషయం తెలుసుకున్న పరీక్ష నిర్వాహకులు ఉన్నతాధికారుల దృష్టికి తేచ్చి అసలు పరీక్ష పత్రం తెప్పించారు. దీంతో ఒకేషనల్ పరీక్ష గంట ఆలస్యంగా ప్రారంభమైంది. సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి మండల కేంద్రంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 41 మంది విద్యార్థులు ఎన్‌పీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ పరీక్షలు రాస్తున్నారు. శనివారం హెల్త్ ప్రమోషన్ ఎగ్జామ్ పేపర్ విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ పేపర్‌కు బదులు బయో కెమిస్ట్రీ పేపర్‌ను ఇచ్చారు. దీనిని గుర్తించిన విద్యార్థులు పరీక్షల నిర్వహణ అధికారిణి డీఓ రమాదేవి దృష్టికి తెచ్చారు. సీల్డ్ కవర్‌పై హెల్త్ ప్రమోషన్ ఎగ్జాం పేపర్ అని రాసి ఉన్నప్పటికీ, దానిని తెరిచి చూస్తే బయో కెమిస్ట్రీ ప్రశ్న పత్రాలు ఉన్నట్లు గ్రహించారు. విషయం తెలుసుకున్న అధికారులు జిల్లా డీఐఈఓ సుధాకర్‌కు సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే అసలైన ప్రశ్న పత్రాలు తెప్పించి విద్యార్థులకు అందించారు.

**ప్రజానీకమునకు హెచ్చరిక / తెలియజేయు ప్రకటన**

సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఇండస్ టవర్స్ లిమిటెడ్ (ఇండస్) ఎయిర్‌టెల్, వొడాఫోన్ మరియు ఐడియా యొక్క జాయింట్ వెంచర్ మరియు మొబైల్ టవర్లు వెలిగ్ఫాట్ కొరకు అద్దెపై [illegible] ... www.industowers.com [illegible] ...

సం/- ఇండస్ టవర్స్ లిమిటెడ్,
ఎస్‌ఎల్‌ఎన్ టెర్మినస్, సర్వే నెం.133, 4-51, 8వ అంతస్తు, బొటానికల్ గార్డెన్ ప్రక్కన, గచ్చిబౌలి, హైదరాబాద్-500032.

**SAINIK SCHOOL KALIKIRI**
CHITTOOR DISTRICT (AP)
(Under the aegis of MoD, Govt of India)

**TEACHERS REQUIRED**

| Sl. No. | Vacancy Particulars | No. of vacancies | Age Limit | Pay Scale |
|---|---|---|---|---|
| 1 | PGT (Physics) | 01 Regular Unreserved | 21 to 40 years as on 01 Apr 2020 | Pay level 08 Rs. 47,600/- + allowances and free messing with cadets |

Kindly visit www.kalikirisainikschool.com for detailed advertisement with eligibility and other details. Last date for receiving duly filled in applications is 06 Apr 2020. The school administration reserves the right to cancel any or all the vacancies due to administrative reasons. Qualification and experience without relevant certificate proof will not be taken into consideration for the purpose of shortlisting or for awarding weightage. School will not contact the candidates in this regard. Enclosures after last date of receipt will not be accepted

Sd/- PRINCIPAL

# బీటెక్ కొత్త కోర్సుల్లో 21వేల సీట్లు!

**జేఎన్‌టీయూ పరిధిలో ఇప్పటికే 20,700 సీట్ల కోసం దరఖాస్తు**
- కొత్త కోర్సుల అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేస్తున్న యాజమాన్యాలు
- అఫిలియేషన్ దరఖాస్తుల గడువు 12వ తేదీ నుంచి 16కు పొడిగింపు
- మరో 1,500 సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం
- ఉస్మానియా, కాకతీయ పరిధిలో 800 వరకు రానున్న దరఖాస్తులు
- 2020–21 విద్యా సంవత్సరంలో 100కు పైగా కాలేజీల్లో కొత్త కోర్సులు

**సాక్షి, హైదరాబాద్:** బీటెక్‌లో ఆరిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నెట్‌వర్క్స్), కంప్యూటర్ ఇంజనీరింగ్ వంటి కొత్త కోర్సుల్లో ఈసారి 21 వేల వరకు సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొత్త కోర్సుల్లో 20,700 వరకు సీట్లు నింపుకునేందుకు అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ఇవ్వాలని యాజమాన్యాలు జేఎన్‌టీయూకు దరఖాస్తు చేసుకోగా, మరో 1,500 సీట్ల కోసం దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 800 వరకు సీట్లలో కొత్త కోర్సులు నిర్వహించేందుకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. దీంతో 2020–21 విద్యా సంవత్సరంలో కొత్త కోర్సుల్లో 23 వేల సీట్లకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తులు రానున్నాయి. అయితే ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలు కాలేజీల్లో తనిఖీలు చేపట్టి, లోపాల మేరకు కోతపెట్టినా కనీసం 21 వేల వరకు కొత్త కోర్సుల్లో సీట్లకు అనుబంధ గుర్తింపు లభించే అవకాశం ఉంది.

**న్యాక్, ఎన్‌బీఏ ఉంటేనే..**

యూనివర్సిటీలు విధించిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని 100కు పైగా ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులు రానున్నాయి. జేఎన్‌టీయూ పరిధిలో ఇప్పటికే 90 వరకు ఇంజనీరింగ్ కాలేజీలు కొత్త కోర్సులకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల పరిధిలో మరో 10కి పైగా కాలేజీల్లో కొత్త కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం అయ్యాయి. దీంతో 2020–21 విద్యా సంవత్సరంలో కొత్త కోర్సులను ఆఫర్ చేసే కాలేజీల సంఖ్య వందకు పైనే ఉండనుంది. కొత్త కోర్సులకు అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు యూనివర్సిటీలు పలు నిబంధనలు విధించాయి. కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీతో పాటు నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) అక్రెడిటేషన్ ఉన్న కాలేజీలకు, కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) కలిగిన కోర్సులు ఉన్న కాలేజీల్లోనే కొత్త కోర్సులకు అనుబంధ గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించారు.

**ఇంకా ఉన్న సమయం**

జేఎన్‌టీయూ పరిధిలో అనుబంధ గుర్తింపు కోసం ముందుగా ఇచ్చిన దరఖాస్తుల గడువు ఈనెల 12తో ముగిసినా, యూనివర్సిటీ 16 వరకు పొడిగించింది. ఉస్మానియా యూనివర్సిటీ దరఖాస్తుల గడువు మరో 20 రోజుల వరకు ఉంది. జేఎన్‌టీయూ పరిధిలోని కాలేజీల్లో ఎంటెక్ కోర్సుల్లోనూ సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి కొత్త కోర్సులు నిర్వహించేందుకు అనుబంధ గుర్తింపు ఇవ్వాలని యాజమాన్యాలు దరఖాస్తు చేశాయి. ఇప్పటికే 618 సీట్లలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు దరఖాస్తు చేయగా, ఎం.ఫార్మసీలోనూ 45 సీట్లలో, ఫార్మ్–డీలోనూ 10 సీట్లలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇలా మొత్తం జేఎన్‌టీయూ పరిధిలో ఇప్పటి వరకు 21,373 సీట్లలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నాయి.



**240 కాలేజీల్లో 75 శాతం దరఖాస్తు**

జేఎన్‌టీయూ పరిధిలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రైవేటు కాలేజీలు 240 ఉన్నాయి. అందులో 161 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా, 69 ఫార్మసీ కాలేజీలు, 10 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు 75 శాతం కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. ఈనెల 16 వరకు గడువు పొడిగించినందున మిగతా కాలేజీలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

– జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్

# టార్గెట్.. 100 రోజులు!

**'ఉపాధి హామీ'లో 100 రోజుల పని పొందిన కుటుంబాలు 1.6 లక్షలే..**
- మొత్తం పనులకు వచ్చిన వారితో పోలిస్తే ఇది కేవలం 6.6 శాతం
- 100 పని దినాల కుటుంబాల సంఖ్య పెంచేందుకు ప్రయత్నాలు
- ఇప్పటికే 75 పనిదినాలు పూర్తయిన కుటుంబాలపై ప్రత్యేక దృష్టి
- ఆయా మండలాల ఏపీవోలకు పూర్తిస్థాయి బాధ్యతలు..

**సాక్షి, హైదరాబాద్:** ఉపాధి హామీ కార్యక్రమంలో భాగంగా కనీసం 100 రోజుల పనిదినాలు కల్పించిన కుటుంబాల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ఇప్పటికే 75 పనిదినాలను పూర్తి చేసుకున్న కుటుంబాలను గుర్తించే పనిలో పడింది. ఈనెలాఖరు వరకు వీరికి క్రమం తప్పకుండా పని కల్పించడం ద్వారా 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్యను గణనీయంగా పెంచాలని క్షేత్రస్థాయికి ఆదేశాలు వెళ్లాయి. ఆయా మండలాల సహాయ ప్రోగ్రామింగ్ అధికారుల (ఏపీవో)కు ఈ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు ఇటీవల అన్ని జిల్లాల గ్రామీణాభివృద్ధి అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

**కేవలం 6.6 శాతమే..**

ఈ ఏడాది మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు కల్పించిన కుటుంబాల సంఖ్య కేవలం 1.6 లక్షలు మాత్రమేనని ఇటీవల అధికారులు తేల్చారు. మొత్తం పని డిమాండ్ ఉన్న వారితో పోలిస్తే ఇది కేవలం 6.6 శాతమే. అయితే, 75 పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వీరందరినీ 100 రోజుల పనిదినాల జాబితాలో చేర్చాలనే ఆలోచనతో ఈ నెలాఖరు వరకు ఆ కుటుంబాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించింది. వీరి కోసం అడిషనల్ పీవో లాగిన్‌లో 'హౌజ్‌హోల్స్ రీచింగ్ పర్మిటెడ్ మ్యాన్‌డేస్' ప్రత్యేక లింకును తయారుచేసి ఆయా కుటుంబాలను ఈ లింక్‌తో అనుసంధానం చేయనున్నారు. ఆయా మండలాల ఏపీవోలు తమ మండలంలోని గ్రామ పంచాయతీల వారీగా ప్రతి వారం ఈ కుటుంబాలకు కల్పించిన పనిదినాల జాబితాను తయారు చేయాల్సి ఉంటుందని, బుధ, శని వారాల్లో జరిగే మండల స్థాయి సమావేశాల్లో పురోగతిపై చర్చించాలని, ఈ నెలాఖరు వరకు 75 పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలకు 100 రోజులు పూర్తయ్యేలా పని డిమాండ్ కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



**పట్టించుకోని సీఈవోలు, డీపీవోలు**

ఉపాధి హామీ పథకం అమలును జిల్లా పరిషత్ సీఈవోలు, పంచాయతీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ అధికారులకు పని మార్గదర్శకాలను జారీ చేసింది. పని డిమాండ్‌కు అనుగుణంగా పనిదినాలు కల్పించడం, మండల వారీ లక్ష్యాలను సాధించడం, ఏడు రోజుల్లో నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవడం, పెండింగ్‌లో ఉన్న వేతనాలను క్లియర్ చేయించడం, సోషల్ ఆడిట్ రికార్డులు తయారు చేయించడం లాంటి బాధ్యతలను సీఈవోలకు అప్పగించింది. ఎంపీడీవోను సమన్వయం చేసుకునే బాధ్యతలు కూడా వీరికే అప్పగించింది. ఈ పథకం అమలు కోసం గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి నివేదిక ఆధారంగా క్రమం తప్పకుండా జాబ్‌కార్డుల జారీ, నర్సరీలు, ప్లాంటేషన్ల పర్యవేక్షణ, వైకుంఠ ధామాల పనులకు వేతనాల చెల్లించేలా చర్యలు తీసుకునే బాధ్యతలను డీపీవోలకు అప్పగించింది.

# సింగరేణి వృద్ధిపై మేధోమథనం

**పంచవర్ష ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్న యాజమాన్యం**
- 16 నుంచి మూడు రోజులు సింగరేణి భవన్‌లో సమీక్ష
- 80 మిలియన్ టన్నుల బొగ్గు సాధించడమే లక్ష్యం

**గోదావరిఖని:** సింగరేణి సంస్థ పంచవర్ష ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. సంస్థ సాధించే వృద్ధి లక్ష్యాలపై మేధోమథనం జరపాలని యాజమాన్యం నిర్ణయించింది. రాబోయే ఐదేళ్లలో ఏటా 10 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ సదస్సులో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 66 మిలియన్ టన్నులు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 67.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించారు. ఈ క్రమంలో రాబోయే ఐదేళ్లలో 80 నుంచి 85 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమే లక్ష్యంగా మేధోమథన సదస్సు ఏర్పాటు చేసింది. దీనికోసం సంస్థ సీఅండ్ ఎండీ నడిమెట్ల శ్రీధర్, డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, అన్ని విభాగాల కార్పొరేట్ జీఎంలను ఆహ్వానించింది. రాబోయే ఐదేళ్లలో భారీ వృద్ధి సాధించడమే లక్ష్యంగా మేధోమథన సదస్సును మూడు రోజుల పాటు నిర్వహించనుంది.

**భూగర్భ గనుల్లో టెక్నాలజీ**

హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మొదటి రోజు జరిగే సదస్సులో భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వృద్ధి చేయాలని నిర్ణయం తీసుకోనున్నారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న 26 భూగర్భగనుల్లో ఈ ఏడాది జనవరి చివరి నాటికి సుమారు 1,600 కోట్ల నష్టాల్లో ఉన్నట్లు అంచనా. ఈ క్రమంలో గనుల్లో మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్పత్తి పెంచేందుకు ఈ సదస్సులో చర్చించనున్నారు. రాబోయే రోజుల్లో ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ, లాంగ్‌వాల్, కంటిన్యూస్ మైనర్ యంత్రాల ప్రవేశపెట్టడం, ప్రస్తుతం ఉన్న యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రతిపాదనలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



**ఓసీపీల్లో ఉత్పత్తి, ఓబీ పెంపు**

సింగరేణి వ్యాప్తంగా లాభాల బాటలో సాగుతున్న ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత పెంచడమే లక్ష్యంగా రెండో రోజు మేధోమథనంపై చర్చించనున్నారు. బొగ్గు నిల్వలు అడుగంటి పోయే ఓసీపీల స్థానంలో నూతన ఓసీపీల ఏర్పాటుపై చర్చించనున్నారు. అలాగే బొగ్గు ఉత్పత్తికి కీలకంగా మారిన ఓబీ వెలికితీతపై కూడా పూర్తిస్థాయిలో చర్చించనున్నారు. ఈమేరకు ఆయా ఏరియా జీఎంలకు సంస్థ సీఅండ్ఎండీ దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే సీహెచ్‌పీ, కోల్‌వాషరీష్ ఏర్పాటుపై కూడా చర్చించనున్నారు.

**ఆర్అండ్ఆర్, భూసేకరణ**

నూతన ప్రాజెక్టుల ఏర్పాటు, పాత ప్రాజెక్టుల విస్తరణలో కీలకంగా మారిన భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీల విషయంలో మూడో రోజు చర్చించనున్నారు. బొగ్గు ఉత్పత్తికి నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకోసం భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వేగవంతం చేసే విధంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఇలా మూడు రోజుల పాటు రాబోయే పంచవర్ష ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకు యాజమాన్యం కీలక సదస్సు నిర్వహించనుంది.

## ఫాంహౌజ్‌ల రూపంలో నయా భూస్వామ్య వ్యవస్థ: చాడ



**హుస్నాబాద్:** అంతరం లేని సమాజం కోసం పోరాటం చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరుల చరిత్ర, త్యాగాలు నేటి యువతకు తెలియజేయాల్సిన అవసరముందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో తెలంగాణ సాయుధ పోరాట వీరులు అనబేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి 72వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. చాడ మాట్లాడుతూ నిజాం పాలన, పట్వారీ, వతన్‌దారులకు వ్యతిరేకంగా పోరాడి భూస్వాములకు చెందిన వేలాది ఎకరాలను పేదలకు పంచి పెట్టిన చరిత్ర ప్రభాకర్‌రావుది అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మళ్లీ భూ సమస్య తెరపైకి వచ్చిందన్నారు. దేవాదాయ, వక్ఫ్ బోర్డుల భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఫాంహౌజ్‌లు, రియల్ ఎస్టేట్ రూపంలో నయా భూస్వామ్య వ్యవస్థ వచ్చిందన్నారు. కరీంనగర్‌లో అనబేరి ప్రభాకర్‌రావు విగ్రహం, కమాన్‌ను ఏర్పాటు చేస్తే మంత్రి గంగుల దేవాలయానికి అడ్డు ఉందని కమాన్‌ను తొలగించి, ప్రభాకర్‌రావు విగ్రహాన్ని తొలగించే ప్రయ త్నం చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు భూములను పంచేందుకు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## వైద్యం వికటించి యువకుడి మృతి

**మృతదేహంతో ఆసుపత్రి ఎదుట బంధువుల ధర్నా**

**మద్దూరు:** ఆస్పత్రిలో ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వైద్యం చేయడంతో అది వికటించి నిండు ప్రాణం బలైంది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. లద్నూర్ గ్రామానికి చెందిన కాసర్ల ప్రభాకర్ (30) శనివారం సాయంత్రం శ్వాస సంబంధమైన సమస్యతో ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. అక్కడ వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్సులు ఎవరూ లేకపోవడంతో ఆరోగ్య కేంద్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి, ప్రభాకర్‌కు ఇంజక్షన్ ఇవ్వడంతో అర గంట పాటు దమ్ము తగ్గింది. అనంతరం అతను బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి లోపలికి వస్తుండగా గేటు ముందు పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది ఉండి ఉంటే ప్రభాకర్ మృతి చెందేవాడు కాదని మృతదేహంతో బంధువులు ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. న్యాయం జరిగే వరకు ఆసుపత్రి ముందు నుంచి మృతదేహాన్ని తీసేది లేదని బంధువులు భీష్మించుకు కూర్చున్నారు. ఈ ఘటనపై డాక్టర్ సుధారాణిని వివరణ కోరగా ప్రభాకర్ కొంత కాలంగా ఆస్తమాతో బాధపడుతున్నాడని, ఆస్తమా ఎక్కువై గుండె పోటుతో మృతిచెందే ఆస్కారం ఉందని తెలిపారు.

epaper.sakshi.com

# ముఖం మార్చేస్తారు!

సాక్షి, హైదరాబాద్:

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆడవారిపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వీడియో అమెరికాలో కలకలం రేపింది. తరువాత అది నకిలీదని తేలింది.**

**ఓ హాలీవుడ్ హీరోయిన్ పోర్న్ క్లిప్ ఇంటర్నెట్‌లో ప్రత్యక్షం.. అందులో ఉన్నది తాను కాదన్నా ఎవరూ నమ్మలేదు. కానీ, ఆమె చెప్పేది నిజమే.**

మనకు నచ్చిన సెలబ్రిటీల శరీరానికి సామాన్యుల ముఖాలను అంటించి మురిసిపోయే వీలున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పని చేసే 'డీప్‌ఫేక్'సాఫ్ట్‌వేర్ సృష్టిస్తోన్న మాయాజాల మిది. ఈ యాప్ వచ్చిన కొత్తలో తమకు ఇష్టమైన హీరో, గాయకులు, రాజకీయ నాయకులను అనుకరిస్తూ.. పలు ఫొటోలు, వీడియోలు సృష్టించి, వాటిని సోషల్ మీడియా వేదికలపై పంచుకునే వారు. వాటికి వచ్చే లైకులు చూసి సంబరపడిపోయే వారు. అక్కడి వరకే పరిమితమైతే సరిపోయేది. కానీ, కొందరు మరో అడుగు ముందుకేసి.. సంచలనం సృష్టించాలని, తమ టీవీ చానళ్లకు రేటింగులను పెంచాలనే దురుద్దేశంతో డీప్‌ఫేక్‌ను వాడుకుని సెలబ్రిటీల ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు సందేశాలు, అసభ్య వీడియోలు సృష్టించి వాటిని వైరల్ చేస్తున్నారు. అవి నకిలీవని నిరూపించుకునేందుకు బాధితులు నానా తంటాలు పడుతున్నారు.

- క్షణాల్లో ఫేస్ స్వాపింగ్ చేసి వీడియోలు, ఫొటోలు
- సెలబ్రిటీల ఫేక్ వీడియోలతో పోర్న్ క్లిప్‌ల తయారీ
- ప్రముఖులకు తలనొప్పిగా మారిన డీప్‌ఫేక్ సాఫ్ట్‌వేర్



### పలు దేశాల్లో నిషేధం..

టిక్‌టాక్‌లో బ్యాక్‌గ్రౌండ్‌లో మ్యూజిక్‌తో డ్యాన్సులు, డబ్‌స్మాష్‌తో భారీ డైలాగులు చెబుతూ చాలామంది సంబరపడిపోతారు కదా! ఈ యాప్ కూడా దాదాపు అలాంటిదే. కాకపోతే.. అడ్వాన్స్‌డ్ వర్షన్. ఎంపిక చేసుకున్న సెలబ్రిటీ, అనుసరించాలనుకున్న ముఖం కవళికలను ఈ సాఫ్ట్‌వేర్ ముందే పసిగడుతుంది. మీ బాడీకి ఏ సెలబ్రిటీ శరీరమైతే సరిగ్గా సరిపోతుందో సూచిస్తుంది. దాని ప్రకారం.. మీరు ఏదో వీడియోను చేసి, అందులో మీకు నచ్చిన సందేశం ఇచ్చేయాలి. తరువాత మీ ముఖంపై ఎంపిక చేసుకున్న సెలబ్రిటీ ఫేస్ సూపర్ ఇంపోజ్ అవుతుంది. అలా.. మీకు నచ్చిన ప్రముఖుల ముఖంలో మీ ముఖం ఇమడ్చడం, లేదా మీ ముఖంలో ప్రముఖుల ముఖం అమర్చే ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ ఇది. ముఖ కవళికలను ఎవరూ గుర్తుపట్టనంత స్పష్టంగా, నాణ్యంగా ఫొటోలు, వీడియోలు సృష్టించడం దీని ప్రత్యేకత. ఇంకో విషయమేమిటంటే.. ఇందులో సెలబ్రిటీల గొంతుతోనే వీడియో వస్తుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లలోని ప్లేస్టోర్లలో ఈ సాఫ్ట్‌వేర్లను అందించే యాప్‌లు అనేకం ఉన్నాయి. వీటిలో చాలా యాప్‌లను ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు నిషేధించాయి. ఉగ్రవాదులు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ల సాయంతో మోసాలు, దాడులకు పాల్పడే అవకాశాలున్నాయని, వీటిని నిషేధించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ఎన్‌ఐటీలో ఏప్రిల్ 3 వరకు తరగతులు రద్దు

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ ఎఫెక్ట్‌తో తరగతులు సహా పాఠ్య కార్యక్రమాలన్నింటినీ వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) ఏప్రిల్ 3వ తేదీ వరకు రద్దు చేసింది. తదుపరి కార్యక్రమాలను తమ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు తెలియజేస్తామని వరంగల్ ఎన్‌ఐటీ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు వెల్లడించారు. రాష్ట్రంలో పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు అన్ని విద్యా సంస్థలు సెలవులు పాటించాల్సిందేనని సీఎం కె.చంద్రశేఖర్ రావు స్పష్టం చేసిన నేపథ్యంలో వెంటనే ఎన్‌ఐటీ ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు వీలైనంత వరకు తమ ఇళ్లకు వెళ్లిపోవాలని, ముందస్తు సమాచారం ఇవ్వాలని పేర్కొంది. ప్రయాణ సంబంధ ఇబ్బందులు ఉన్నవారు తెలియజేయాలని, విదేశీ విద్యార్థులు హాస్టళ్లలోనే ఉండాలని తెలిపింది.

### టెన్త్ విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాల్సిందే

ఈనెల 31వ తేదీ వరకు పాఠశాలలు మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 19 నుంచి ప్రారంభం అయ్యే పదో తరగతి పరీక్షలకు ఇళ్లలోనే సిద్ధం కావాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. తరగతుల నిర్వహణ, పాఠ్యాంశాల రివిజన్ ఉండదు కాబట్టి జాగ్రత్తగా పరీక్షలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. మరోవైపు వచ్చే నెల 7 నుంచి 16వ తేదీ వరకు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. 31 తర్వాత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు తగిన చర్యలు చేపట్టవచ్చని వెల్లడించారు.



# మందులు ఎగురుకుంటూ వస్తాయ్!

### డ్రోన్ల ద్వారా రోగులకు మెడిసిన్స్ సరఫరా

- గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని వారికి వైద్య సేవలు
- మొబైల్ యాప్ ద్వారా డ్రోన్ల నియంత్రణ
- మ్యాప్స్ ద్వారా గమ్యస్థానాలకు
- రాష్ట్ర ప్రభుత్వం, స్టార్టప్ మారుట్ డ్రోన్స్, అపోలో ఆస్పత్రుల మధ్య ఒప్పందం
- డ్రోన్ల ద్వారా వైద్య సేవలందించనున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ

**మన దేశంలో డ్రోన్ల ద్వారా వైద్య సేవలను అందించనున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలవనుంది. డ్రోన్ టెక్నాలజీ ద్వారా ప్రజలకు మందులు, డయాగ్నస్టిక్ శాంపిల్స్ సేవలను అందించేందుకు సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ మారుట్ డ్రోన్స్, అపోలో ఆస్పత్రుల మధ్య ఒప్పందం కుదిరింది. బేగంపేటలో జరుగుతున్న వింగ్స్ ఇండియా-2020 కార్యక్రమంలో మెడికల్ డ్రోన్ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా మారుట్ డ్రోన్స్ ఫౌండర్ అండ్ సీఈఓ వీ ప్రేమ్ కుమార్ 'సాక్షి బిజినెస్ బ్యూరో'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మెడికల్ డ్రోన్ ఎలా పని చేస్తుందో ఆయన మాటల్లోనే..** - హైదరాబాద్, బిజినెస్ బ్యూరో


డ్రోన్‌కు అమర్చేందుకు మెడికల్ కిట్ సిద్ధం చేస్తున్న దృశ్యం


డ్రోన్ ద్వారా వచ్చిన మెడికల్ కిట్ తీసుకుంటున్న దృశ్యం

### డ్రోన్లు ఎక్కడ ఉంటాయంటే?

ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు, బ్లడ్ బ్యాంకుల్లో మారుట్ డ్రోన్స్ ఉంటాయి. ఆర్డర్ రాగానే ఇక్కడి డ్రోన్స్‌లో సంబంధిత సిబ్బంది మందులను అమర్చితే డ్రోన్లు టేకాఫ్ అవుతాయి. 8 నిమిషాల్లో 12 కిలోమీటర్ల దూరం డ్రోన్లు ప్రయాణిస్తాయి.

### ఎవరికి సేవలందిస్తారంటే?

గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలకు, రోడ్లు, రవాణా సౌకర్యం సరిగా లేని మారుమూల ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా మందులను సరఫరా చేస్తారు. వర్షాకాలంలో, రాత్రి సమయాల్లో ఆయా మారుమూల ప్రాంతాలకు వెళ్లటం కష్టం కాబట్టి ఇక్కడి ప్రజలకు డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందిస్తారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణిలు, పాము కాటు, గుండెపోటు వంటి అత్యవసర రోగులకు మందులను సరఫరా చేస్తారు. ఈ డ్రోన్ల ద్వారా రక్తం, వ్యాక్సిన్స్, డయాగ్నస్టిక్ శాంపిల్స్, దీర్ఘకాలిక ఔషధాలను సరఫరా చేస్తారు. మెడికల్ అవసరాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అపోలో ఆస్పత్రితో ఒప్పందం చేసుకుంది.

### డ్రోన్ ఎలా పని చేస్తుందంటే?

ఇవి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనుసంధానిత డ్రోన్స్. దీన్ని మొబైల్ యాప్ ద్వారా నియంత్రణ చేస్తారు. ఓలా, ఉబర్‌లు ఎలాగైతే గమ్య స్థానాన్ని మ్యాప్‌లో చూపిస్తాయో అలాగే ఈ డ్రోన్స్ మ్యాప్స్ ఆధారంగా గమ్య స్థానానికి చేరుకుంటుంది. అంతేకాదు మందులను బుక్ చేయగానే వచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తేనే మందులు డెలివరీ అవుతాయి. దీంతో సరైన మనిషికే మందులు అందుతాయన్న మాట. డ్రోన్ ఎంత దూరంలో ఉంది? ఎంత సమయం పడుతుంది? వంటి సమాచారం లైవ్‌లో కనిపిస్తుంటుంది. దీంతో రోగికి ఒత్తిడి తగ్గుతుంది. 'మెడికల్ డ్రోన్స్ సాంకేతికత మీద ఏడాది కాలంగా పని చేస్తున్నాం. సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసినట్లు'ప్రేమ్ కుమార్ తెలిపారు.

### డ్రోన్లతో దోమల నిర్మూలన!

గతంలో మారుట్ డ్రోన్స్ జీహెచ్‌ఎంసీ భాగస్వామ్యంతో మియాపూర్, రాయదుర్గంలోని చెరువుల్లో దోమ మందులను పిచికారి చేసింది. సిరిసిల్ల జిల్లాలో హరితహారం కార్యక్రమంలో భాగంగా డ్రోన్ల సహాయంతో సీడ్ బాల్స్‌లను నాటింది. మస్కిటో డ్రోన్స్‌లోని ఏఐ సాంకేతికత పిచికారితో పాటు దోమల సంఖ్య, లార్వా లెక్కింపు, దోమల జాతి, లింగ బేధాలు వంటి రియల్ టైం నివేదికలను కూడా అందిస్తుంది. గంటకు 6 ఎకరాలకు పిచికారి చేస్తుంది. ప్రస్తుతం మూసీ పరివాహక ప్రాంతంలో 52 కిలోమీటర్లు, తెలంగాణలోని 70 చెరువుల్లో యాంటి లార్వా అరాడికేషన్‌ను ప్రాజెక్టులను చేపట్టామని ప్రేమ్‌కుమార్ తెలిపారు.

# యూఎస్ వీసాలకు కోవిడ్ దెబ్బ!

### రేపటి నుంచి అన్ని ఇంటర్వ్యూలు రద్దు

- ప్రకటించిన యూఎస్ ఎంబసీ వెబ్‌సైట్
- అయోమయంలో హెచ్1బీ వీసాదారులు
- ఎన్నారై భర్తలకు దూరంగా నవ వధువులు

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ ప్రపంచాన్ని వణికిస్తోన్న దరిమిలా.. ఆ ప్రభావం అమెరికా వీసాలపైనా పడింది. ఇప్పటికే నేషనల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన అమెరికా ఐరోపా దేశాలకు విమాన సర్వీసులనూ నిలిపివేసింది. విదేశీ ప్రయాణికులతో వైరస్ విస్తరిస్తున్న క్రమంలో.. ఈ నెల 16 నుంచి భారత్‌లోని అన్ని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయాల్లో వీసా ఇంటర్వ్యూలను నిలిపివేస్తున్నట్లు యూఎస్ ఎంబసీ వెబ్‌సైట్ ప్రకటించింది. దేశంలోని చెన్నై, ముంబై, కోల్‌కతాలోని అమెరికన్ సెంటర్లలోకి ప్రజల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీసా ఇంటర్వ్యూలను తిరిగి ఎప్పటి నుంచి నిర్వహించేది మాత్రం ప్రకటించలేదు. దీంతో ఈ నెలలో ఇంటర్వ్యూలకు హాజరై, ప్రయాణాలు చేద్దామనుకున్న వారంతా అయోమయంలో పడ్డారు.

**హెచ్1–బీ వీసాదారుల ఇబ్బందులు**

అమెరికాలో ఉద్యోగాలు చేసేందుకు హెచ్1–బీ వెళ్లాలనుకుని విజిటింగ్, బిజినెస్ వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వారూ డీలాపడ్డారు. ఇటీవలే పెళ్లిళ్లయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల భార్యలకు చిక్కొచ్చి పడింది. భర్తలు అమెరికాలో, భార్యలు ఇక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు శుభకార్యాలు, వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు ఎన్నారైలు కూడా ఇక్కడే చిక్కుకుపోయారు. ఎంబసీ ఆంక్షలపై స్పష్టత లేకపోవడంతో తమ వ్యాపారాలపై బెంగపెట్టుకున్నారు. అమెరికాలో ఉద్యోగులందరికీ వర్క్‌ఫ్రం హోం సదుపాయం కల్పించడంతో ఇక్కడ చిక్కుకుపోయిన పలువురు ఇండియా నుంచే పని చేసుకుంటున్నారు.

**ఏడాదిలో నాలుగుసార్లు అవకాశం**

వాస్తవానికి అమెరికాకు పలు రకాల వీసాలపై ఇంటర్వ్యూకు హాజరవ్వాలనుకునేవారు అనివార్య కారణాలతో ఒక్కోసారి హాజరు కాలేకపోవచ్చు.



వీసా ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తోన్న ఆశావహులు అమెరికా ఎంబసీ ప్రకటనతో నీరుగారిపోయారు. ఓవైపు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో వీసా ఇంటర్వ్యూల నిలిపివేత వార్త పిడుగులా పడటంతో వీరికి ఏం పాలుపోవడం లేదు. దీంతో అమెరికాలోని పలు కంపెనీలకు ఫోన్లుచేసి విషయాన్ని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇంటర్వ్యూలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయో స్పష్టత లేకపోవడం వారిని గందరగోళపరుస్తోంది. మరోవైపు అగ్రరాజ్యం అలాంటి వారికి నాలుగుసార్లు వీసా ఇంటర్వ్యూల తేదీని మార్చుకునే వెసులుబాటు ఉంది. వీసా ఇంటర్వ్యూల తేదీని తిరిగి ప్రకటించే వరకు వీరంతా తేదీని సర్దుబాటు చేసుకోలేని పరిస్థితి. మరోవైపు కోవిడ్ వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా ముందుజాగ్రత్త చర్యలకు దిగింది. దేశంలోకి విదేశీయుల రాకపై నిషేధం విధించింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, దౌత్యవేత్తలు, అంతర్జాతీయ ప్రాజెక్టులలో పనిచేస్తున్న వారికి మాత్రం మినహాయింపు ఇచ్చింది.

# ఆ రోజు అలా మాట్లాడి తప్పు చేశా!

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా గురించి గతంలో బహిరంగంగా మాట్లాడి తప్పు చేశానని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే పార్టీకి నష్టం జరగకూడదనే ఆలోచన, ఆవేదనలే తనను అలా మాట్లాడించాయని పేర్కొన్నారు. టీడీపీతో పొత్తు వద్దని, అందరినీ కలుపుకుని వెళ్లాలని మాత్రమే చెప్పానని, అయినా తాను చేసింది తప్పేనని అంగీకరించారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీ నేతలకు ఏదైనా సమస్య ఉంటే అంతర్గత వేదికల్లో మాత్రమే మాట్లాడాలన్న కుంతియా సూచన సరైందేనని, పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకోవడమే మంచిదని అభిప్రాయపడ్డారు. మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడానికి, ఆయనకు పీసీసీ అధ్యక్ష పదవి రావడానికి సంబంధం లేదన్నారు. రేవంత్ ఓటుకు కోట్లు కేసులోనే జైలుకు వెళ్లారని, ఇప్పుడు జైలుకు వెళ్తే తాను పీసీసీ అధ్యక్షుడిని అవుతాననే ఆలోచనతో జైలుకు వెళ్లలేదన్నారు. కాంగ్రెస్ నేతల అభిమానులు వారు అభిమానించే వారికి పీసీసీ అధ్యక్ష పదవి రావాలనుకోవడంలో తప్పులేదని, అయితే అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్నారు.

# హోం ఐసోలేషన్ తప్పనిసరి

- ఇతర దేశాల నుంచి వచ్చిన ప్రయాణికులకు కేంద్రం మార్గదర్శకాలు
- అనుమానిత లక్షణాలు లేకపోయినా హోం ఐసోలేషన్‌లో ఉండాలి
- కుటుంబసభ్యులు వారికి సహకరించాలి

**సాక్షి, హైదరాబాద్:** దేశంలో కరోనా (కోవిడ్–19) అనుమానితులు పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా పలు రాష్ట్రాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి ఎలాంటి కోవిడ్ అనుమానిత లక్షణాలు లేకపోయినా హోం ఐసోలేషన్‌లో ఉండాలని స్పష్టం చేసింది. ఇతర దేశాల నుంచి ఎవరొచ్చినా వారికి హోం ఐసోలేషన్‌ను తప్పనిసరి చేసింది. నిర్ణీత ఏడు దేశాల నుంచి వచ్చిన వారైతే తప్పనిసరిగా సర్కారు నిర్ణయించిన ఆస్పత్రులు లేదా ప్రత్యేక ఐసోలేషన్ వార్డుల్లోనే ఉండాలి. హోం ఐసోలేషన్‌లో ఉండే వారి కోసం కేంద్రం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవేంటంటే..



- ఇతర దేశాల నుంచి వచ్చిన వ్యక్తికి వైరస్ లక్షణాలు లేకపోయినా ఇంట్లో గాలి వెలుతురు ఉన్న గదిలో ఐసోలేషన్ (ఒంటరిగా) ఉండాలి. ఈ విషయంలో కుటుంబ సభ్యులు వారికి సహకరించాలి.
- వారికి సాయంగా కొన్ని జాగ్రత్తలతో ఆరోగ్యంతో ఉన్న వ్యక్తిని కేటాయించాలి
- ఇతర కుటుంబ సభ్యులు వేరే గదిలో ఉండాలి. అది సాధ్యం కాకపోతే, ఆ వ్యక్తికి కనీసం ఒక మీటర్ దూరంలో ఉండాలి
- బాధితుడు ముఖానికి సురక్షితమైన మెడికల్ మాస్క్ ధరించాలి. మాస్క్‌లు ధరించినప్పుడు వాటిని తరచుగా తాకకూడదు
- మాస్క్‌లు తడిగా లేదా మురికిగా ఉంటే వెంటనే మార్చాలి
- ఆరు గంటలు ఉపయోగించిన తర్వాత మాస్క్‌ను తీసేయాలి. దాన్ని తొలగించిన తర్వాత చేతిని శుభ్రంగా కడుక్కోవాలి
- ఇంట్లోవారు కూడా ఏదైనా పనిచేశాక చేతిని సబ్బుతో కడుక్కోవాలి. అందుబాటులో ఉంటే టిష్యూ పేపర్లను వాడాలి. లేకుంటే గుడ్డ తువ్వాలు వాడాలి. తువ్వాలు తడిగా ఉంటే దాన్ని మార్చాలి
- ఉపయోగించిన వస్తువులను డిటర్జెంట్‌తో శుభ్రంగా కడగాలి
- బాధితుడు మలం, మూత్రం మరియు ఇతర వ్యర్థాలను వదిలేప్పుడు అతను చేతి తొడుగులు ఉపయోగించాలి
- క్లినికల్ పరీక్షలో వారికి లక్షణాలు లేవని నిర్ధారించే వరకు ఆ వ్యక్తులు ఇంట్లోనే ఉండాలి
- బెడ్‌లను, ఇతర ఫర్నీచర్‌ను, బాత్రూమ్‌లను తరచూ తాకినప్పుడు వాటిని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి
- బాధితుడిని 14 రోజులపాటు ఈ జాగ్రత్తలు పాటించాలని కోరాలి
- అతనికి జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో సమస్య వస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి
- రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్లకు ఫోన్ చేసి వివరాలు చెప్పాలి. తెలంగాణలో 104కు కాల్ చేయొచ్చు

# రాష్ట్రంలో మరో పాజిటివ్..

- గాంధీలో కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట యువతి
- పుణే ల్యాబ్‌కు మరో ముగ్గురు అనుమానితుల నమూనాలు
- ఐసోలేషన్ కోసం గచ్చిబౌలి స్టేడియంలోని 400 గదులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మరో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన ఓ యువతికి పాజిటివ్ వచ్చినట్లుగా నిర్ధారించారు. ఆమె ఇటీవలే ఇటలీ నుంచి వచ్చింది. జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న ఆమె కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా.. కోవిడ్ వైరస్ లక్షణాలు కన్పించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఈ నెల 11న గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె నమూనాలు గాంధీలోనే పరీక్షించగా కోవిడ్ పాజిటివ్ వచ్చింది. మరోసారి నమూనాలను పుణే ల్యాబ్‌కు పంపగా, శుక్రవారం అందిన నివేదికలో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కాగా, మంచిర్యాలకు చెందిన ఒక వ్యక్తి, అతడి స్నేహితుడు ఇద్దరికీ కోవిడ్ లక్షణాలు ఉండటంతో గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. అలాగే సౌదీ నుంచి వచ్చిన మరో కోవిడ్ అనుమానితుడికి కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరి నమూనాలను పుణేలోని ల్యాబ్‌కు పంపారు. కాగా, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లికి చెందిన మరో కోవిడ్ అనుమానితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు లండన్‌లో చదువుకుంటూ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఖమ్మంలోని శ్రీరామ్‌హిల్స్‌కు చెందిన మరో వ్యక్తికి కరోనా లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా.. వెంటనే హైదరాబాద్ తరలించారు. వీరిద్దరికీ వైరస్ లేనట్లు గాంధీ ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి (47) ఐదు రోజుల క్రితం సౌదీ అరేబియా నుంచి వచ్చాడు. దగ్గు, జ్వరం బాధ పడుతుండటంతో పరీక్షించిన వైద్యులు.. కరోనా లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే.. ఇతనికి కరోనా వైరస్ లేనట్లు నిర్ధారణ అయింది. సారంగాపూర్ మండలం కోనాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి 20 రోజుల కింద బహ్రెయిన్ నుంచి వచ్చాడు. దగ్గు తీవ్రంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నారు. 24 గంటల పాటు వైద్యసేవలు అందించిన తర్వాత తగ్గుముఖం పట్టకపోతే హైదరాబాద్‌కు తరలించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. బెంగళూరు నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 88 మందితో కాంటాక్ట్ కాగా, వారందరికీ కోవిడ్ పరీక్ష నిర్వహించగా నెగెటివ్ వచ్చింది. నయమైన వ్యక్తి మినహా మిగిలిన పాజిటివ్ వచ్చిన నలుగురు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. వారితో కాంటాక్ట్ అయిన వారిని గుర్తించే పనిలో వైద్య ఆరోగ్య శాఖ నిమగ్నమైంది.



సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి వచ్చేందుకు శనివారం మంచిర్యాలలో 108 అంబులెన్స్ ఎక్కుతున్న కోవిడ్ అనుమానిత వ్యక్తి

**ఫీవర్‌కు మరో అనుమానిత కేసు**

నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో శనివారం మరో అనుమానిత కోవిడ్ కేసు నమోదైంది. నల్లగొండ జిల్లా విమలపల్లి మండలం, శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి (32) ఇటీవల చైనా నుంచి మలేషియాకు.. అక్కడి నుంచి భారత్ వచ్చాడు. అతడు కొద్ది రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతున్నారు. శనివారం అతడిని కుటుంబ సభ్యు లు కోవిడ్ నిర్ధారణ పరీక్షల కోసం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడి నమూనాలను గాంధీ ల్యాబ్‌కు పంపనున్నారు. ప్రస్తుతం వికారాబాద్‌లో హరిత హోటల్, ఫారెస్ట్ అకాడమీ వంటి సంస్థల్లో ఐసోలేషన్ వార్డులు ఉంచుతారు. కోవిడ్ బాధితుల సంఖ్య మరీ పెరిగితే గచ్చిబౌలి స్టేడియానికి అనుబంధంగా ఉండే 400 గదులను కూడా వాడుకోవాలని నిర్ణయించారు.

### కలెక్టర్లకు విస్తృత అధికారాలు..

కోవిడ్ వైరస్ నేపథ్యంలో జిల్లాలకు వచ్చే విదేశీ ప్రయాణికుల వివరాలు, వారి ద్వారా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు కలెక్టర్లకు విస్తృత అధికారాలు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటారో, ఇప్పుడు కూడా కలెక్టర్లు అలాంటి చర్యలే తీసుకోవాలని నిర్ణయించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని చెబుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.